www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
బుధవారం 26 ఫిబ్రవరి 2025
సంపుటి :06 సంచిక : 269 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## సర్వాంగ సుందరంగా వేములవాడ


- శివరాత్రి జాతరకు ప్రత్యేకంగా ముస్తాబు

## "బయో ఆసియా సదస్సు - 2025

## ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్

- దేశంలోనే మొదటి లైఫ్ సైన్సెస్ పాలసీ తీసుకువస్తున్నాం: సీఎం రేవంత్ రెడ్డి
- హైదరాబాద్ హెచ్ ఐ సీసీ లో జరిగిన బయో-ఆసియా 2025 సదస్సులో సిఎం






**వెలుతురు, హైదరాబాద్ ఫిబ్రవరి 25:** తెలంగాణలో దేశంలోనే మొట్టమొదటి "లైఫ్ సైన్సెస్ పాలసీ" ని తీసుకురానున్నట్టు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో దేశ విదేశాల పెట్టుబడులకు సులభతరమైన పారిశ్రామిక విధానం, అవసరమైన మౌలిక సదుపాయలు కల్పన, అందుకు అనుగుణమైన పాలసీ, తగిన సహకారాన్ని అందించడంలో ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళుతుందని చెప్పారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో ప్రతిష్టాత్మకమైన 'బయో ఆసియా -2025' రెండు రోజుల సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పాల్గొన్న ఈ ప్రతిష్టాత్మకమైన సదస్సుకు ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, దేశీయ సంస్థలతో పాటు ఆ రంగంలో నిపుణులు, నిష్ణాతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "బయో ఆసియా సదస్సు హైదరాబాద్ ను ప్రపంచ లైఫ్సైన్సెస్ రాజధానిగా మార్చింది. ఫార్మా, ఐటీ, డిజిటల్ హెల్త్ రంగాల్లో గడిచిన 25 ఏళ్లగా హైదరాబాద్ ను ఒక పవర్ హౌజ్గా నిలబెట్టింది. ప్రపంచంలో పేరొందిన ఫార్మా, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, బయోటెక్ కంపెనీలు ఎన్నో హైదరాబాద్ కేంద్రంగా

2 లో..





## గల్లంతైన వారి రక్షణకు చర్యలు

- ప్రమాదవశాత్తు ఘటనలపై విమర్శలు తగవు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**నల్లగొండ,ఫిబ్రవరి25( వెలుతురు):** ఎస్ఎల్బీసీ టన్నెల్లో ప్రమాదం చోటు చేసుకుని మూడు రోజులు గడుస్తుంది. టన్నెల్లో గల్లంతైన ఎనిమిది మంది ఆచూకీపై ఇంకా స్పష్టత లేదు. రెస్క్యూ టీమ్స్ పలుమార్లు టన్నెల్లోకి వెళ్లి ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో తిరిగి వచ్చాయి. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రెస్క్యూ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. టన్నెల్లో చిక్కుకున్న వారిని క్షేమంగా తిరిగి తీసుకురావడానికి సర్వ శక్తులా ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో అత్యంత నిపుణులైన 10 ఏజెన్సీలు ఈ రెస్క్యూలో పనిచేస్తున్నాయి.. ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, జియాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్

2 లో..

## శ్రీ రాజరాజేశ్వరి ఆలయం లో ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం





( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ 25బీఫిబ్రవరి 25:** మహా శివరాత్రి సందర్భంగా మంగళ వారం నాడు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి

2 లో..

## మత రాజకీయాలు తప్ప బీజేపీకి ఏమీ చేతకాదు

- ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలమాట ఏమైంది..?
- చెప్పుకోవటానికి ఒక్కటైనా ఉందా..?
- మతం పేరు లేకుండా బండి ఒక్కమాట మాట్లాడలేదు : సీతక్క



**హైదరాబాద్,ఫిబ్రవరి25( వెలుతురు):** మత రాజకీయాలు తప్ప బీజేపీకీ ఏమీ చేతకాదని మంత్రి సీతక్క అన్నారు. బీజేపీ టీం ఇండియా, కాంగ్రెస్

2 లో..

## మాది ఇండియా టీం కాంగ్రెస్ ది పాకిస్తాన్ టీం

- 27న జరిగే మ్యాచ్ లోనూ కాంగ్రెస్ టీంను చిత్తుగా ఓడిస్తాం
- 14 నెలల పాలనపై ఎమ్మెల్సీ ఎన్నికలే రెఫరెండంగా తీసుకుందామా?
- సీఎం వస్తే...టీచర్లకు డీఏలు, జీపీఎఫ్ పైసలు, రిటైర్డ్ మెంట్ బెన్ ఫిట్స్ ప్రకటిస్తారని భావించినం
- ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు, నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలపై ప్రకటన చేస్తారని యువత ఆశించింది
- గుజరాత్, మధ్యప్రదేశ్ లోనే కాదు తెలంగాణలోనూ ఎప్పటి నుండో దూదేకులవంటి కులాలకు రిజర్వేషన్లు అమలవుతున్నయ్
- మేం ఏనాడూ అభ్యంతర పెట్టలేదే
- 12.5 శాతం ముస్లిం జనాభాలో 10.8 శాతం మందిని బీసీల్లో కలుపుతామంటే ఎందుకు ఒప్పుకుంటాం?
- నూటికి 88 మందికిపైగా ముస్లింలను బీసీల్లో కలిపితే బీసీల పొట్ట కొడితే ఊరుకునే ప్రసక్తే లేదు



- మీ పాలనలోనే ఫోన్ ట్యాపింగ్ దొంగలు విదేశాలకు పారిపోయింది నిజం కాదా?
- సీబీఐ విచారణ కోరితే హైకోర్టు ముందే మీ అడ్వోకేట్ జనరల్ ఒప్పుకోని మాట వాస్తవం కాదా?
- దమ్ముంటే సీబీఐ విచారణ కోరండి... దోషలందరి సంగతి తేలుస్తాం...
- విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదికిచ్చి 3 నెలలైనా చర్యలేవి?
- కాళేశ్వరం, డ్రగ్స్, ఫార్ములా ఈ రేస్ కేసుల్లో కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే దమ్ము మీకు లేదా?

2 లో..

## రాష్ట్ర ప్రభుత్వం వల్లే అంబర్ పేట ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో ఆలస్యం..

- నేటి నుంచి అందుబాటులోకి అంబర్ పేట ఫ్లైఓవర్
- ఏండ్ల తరబడి ట్రాఫిక్ కష్టాలకు చెక్
- ఫ్లైఓవర్ కింద మంచి రోడ్డు నిర్మాణం, గ్రీనరీ పనులు చేపడుతాం
- అధికారులతో అంబర్ పేట ఫ్లైఓవర్ ను పరిశీలించిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి





**వెలుతురు, హైదరాబాద్ 25 ఫిబ్రవరి:** రాష్ట్ర ప్రభుత్వం వల్లే నిర్మాణ పను ల్లో ఆలస్యం నెలకొన్నదని, దీనిపై ఇద్దరు ముఖ్యమంత్రులకు లేఖలు రాశానని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం కిషన్ రెడ్డి ఆర్ & బి, నేషనల్ హైవే అధికారులు, జిహెచ్ఎంసి అన్ని విభాగాల అధికారులు, వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ, రెవిన్యూ అధి కారులతో కలిసి హైదరాబాద్ లోని అంబర్ పేట్ ఫ్లై ఓవర్ ను పరిశీ లించారు. గోల్నాక చర్చ్ నుంచి అం బర్ పేట్ వాణి ఫోటో స్టూడియో వర కు ఫ్లైఓవర్ పై నడుస్తూ అధి కారులతో వివరాలను అడిగి తెలు సుకున్నారు. అనంతరం కేంద్ర మం త్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లా డారు. చాదర్ ఘట్ నుంచి వరంగల్ కు వెళ్లే జాతీయ రహదారికి గతం లో ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమ యంలో రోడ్డు వైండింగ్ చేయడం జరిగిందని తెలిపారు. అంబర్ పేట చే నెంబర్ వద్ద రెండు వైపులా శ్మశా న వాటిక ఉండటంతో రోడ్డు వైండిం గ్ కుదర లేదని, తాను అంబర్ పేట శాసన సభ్యుడిగా,

2 లో..

## వైసిపి పాలనలో సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్

- గవర్నర్ ప్రసంగం సందర్భంగా వైసిపి రచ్చ
- ఐదేళ్లు ఎలాంటి ఇబ్బందులు పడ్డామో చూశాం
- అన్నివర్గాలను వేధించిన తీరు ప్రజలంతా చూశారు
- అసెంబ్లీలో అల్లరి చేస్తే కేసులుండవనే ధీమాతో ఇలా చేస్తారా
- కూటమి ప్రజల కోసం ఏర్పడింది...ప్రజల కోసమే పనిచేస్తుంది
- గవర్నర్కు ధన్యవాద తీర్మానంలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు

2 లో..



**అమరావతి,ఫిబ్రవరి25( వెలుతురు):** వైసీపీ పాలనలో ఏపీ సంక్షోభంలో కూరుకుపోయిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీ అసెంబ్లీలో వైసీపీ సభ్యుల తీరు చూస్తే పాలసీ టెర్రరిజం గుర్తుకు వచ్చిందని పవన్ కల్యాణ్ విమర్శించారు. గవర్నర్ ప్రసంగం జరిగేటప్పుడు డిగ్నిటీని మెయింటెయిన్ చేయాలని రూల్ బుక్లో కూడా రాసి ఉందని పవన్ కల్యాణ్ తెలిపారు. అసెంబ్లీలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే చర్చలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడారు. గవర్నర్ ప్రసంగానికి జనసేన పార్టీ తరపున, వ్యక్తిగతంగా తన తరపున

## ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం

- వెంటిలేటర్పై ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్నాం
- సకాలంలో పెన్షన్లు, జీతాలు చెల్లిస్తున్నాం
- త్వరలోనే డిఎస్సీ కూడా నిర్వహిస్తాం
- గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంలో సిఎం చంద్రబాబు



**అమరావతి,ఫిబ్రవరి25( వెలుతురు):** ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని తప్పకుండా అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వెంటిలేటర్పై ఉన్న రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే బయటకు తెస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై

2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## గల్లంతైన వారి రక్షణకు చర్యలు

రిమోట్ సెన్సింగ్ అన్నీ కలిసి పనిచేస్తున్నాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ముఖ్యమంత్రి కూడా ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.. ప్రమాదం జరిగిన వెంటనే వేగంగా స్పందించామని మంత్రి పేర్కొ?న్నారు. ఇలాంటి ప్రమాదాల్లో రెస్క్యూ ఆపరేషన్స్ చేసే అనుభవం ఉన్న వాళ్ళను కూడా ఆహ్వానిస్తున్నాం.. మేము ఇంత చేస్తుంటే.. కొందరు చిల్లర రాజకీయం చేస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు. కాళేశ్వరంలో ఏడుగురు చనిపోతే మేము మాట్లాడలేదు.. శ్రీశైలం పవర్ ప్లాంట్ లో కూడా ఎనిమిది మంది చనిపోతే కూడా ఏనాడు మాట్లాడలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన ప్రమాదం దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు. దేశంలోనే గొప్ప ప్రాజెక్టు ఇది.. 45 కి.మీలలో 30 కి.మీ పూర్తి అయ్యిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు మినిమం సెన్స్ లేకుండా మాట్లాడుతున్నాయి.. ప్రాజెక్ట్ పూర్తి ఐతే నల్గొండ జిల్లాలో లక్షల ఎకరాలకు నీరు అందుతుంది.. ఫ్లోరైడ్ బాధ తొలుగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 10 ఏళ్ల పాటు ప్రాజెక్ట్ పనులు నిలిపివేశారని మంత్రి ఆరోపించారు. మరోవైపు.. టన్నెల్‌లో చిక్కుకున్న వారి ప్రాణాలు కాపాడటానికి సర్వ శక్తులా కృషి చేస్తున్నాం.. ప్రమాదం జరిగిన స్థలంలో నీరు లీక్ అవుతోంది.. నీటి ఉధృతి కూడా పెరిగిందని రెస్క్యూ టీమ్స్ చెప్తున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.

## శ్రీ రాజరాజేశ్వరి ఆలయం లో ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం

కుటుంబ సమేతంగా పట్టు వస్త్రాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమర్పించారు,తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ప్రభుత్వం తీసుకున్న అనేక ప్రజా స0క్షేమ కార్యక్రమాలకు స్వామి వారి ఆశీస్సులు ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు,వేములవాడ రాజన్న ఎంతో మహిమ గల దేవుడు దేవాలయ అభివృద్ధి విషయంలో కట్టుబడి ఉన్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు,శివరాత్రి పూర్తి కాగానే అభివృద్ధి పనులు వేగవంతం చేసి మళ్ళీ శివరాత్రి నాటికి ఇచ్చిన పనులు పూర్తి చేస్తామనీ మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు,

## మత రాజకీయాలు తప్ప బీజేపీకి ఏమీ చేతకాదు

పాకిస్తాన్ అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాలుగా యువకులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఒకటి కూడా బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పి జిల్లాకు 200 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు యువకులకు జవాబు చెప్పకోక మత రాజకీయాలకు బండి సంజయ్ పాల్పడుతున్నారని ఆగ్రహించారు. చెప్పకోవడానికి అభివృద్ధి లేదని.. సబ్జెక్టు అంతకన్నా లేదన్నారు. అందుకే బండి సంజయ్ నోరు తెరిస్తే హిందూస్తాన్, పాకిస్తాన్, హిందూ, ముస్లిం తప్ప మరో మాట తెలియదని విరుచుకుపడ్డారు. 'సూటిగా బండి సంజయ్‌ను అడుగుతున్నా... పట్టభద్రులకు మీరేం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు? ఎంత ఉపాధి కల్పించారు? ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మారు. ప్రైవేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారు. దేవుని పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ... దేవునికి వినియోగించే అగర్బత్తిల మీద కూడా జీఎస్టీ వేసింది. ఉన్నత విద్య మీద 18% జీఎస్టీ విధిస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతుంది. అలాంటి బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదు. తెలంగాణ విభజన హామీలు అమలు కాలేదు. ఎన్నికలప్పుడే హిందూ ముస్లిం అని రెచ్చగొడతారు. బండి సంజయ్.. పాకిస్తాన్‌తో పోల్చి భారతదేశం గొప్పతనాన్ని తగ్గించొద్దు. పాకిస్తాన్‌తో పోల్చి దేశాన్ని కించపరచడం తప్ప మీరు దేశానికి చేసింది లేదు. దమ్ముంటే అభివృద్ధి ప్రాతిపదికన ఎన్నికల్లోకి రండి" అంటూ సవాల్ విసిరారు. ట్రైబల్ యూనివర్సిటీ పనులు కూడా మొదలుపెట్టలేనీ అసమర్థ కేంద్ర ప్రభుత్వం అంటూ విమర్శించారు. బండి సంజయ్‌కు చెప్పుకోవడానికి ఏం లేదని.. మాట్లాడడానికి రెండు మాటలు రావన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేయాలనుకుంటే.. భారత సరిహద్దుల్లో ఉన్న సైనికుల మాదిరిగా యుద్ధంలో పాల్గొనాలని ఉచిత సలహా ఇచ్చారు. ఆకలి చావులు అంతర్గత సమస్యలతో దివాలా తీసిన పాకిస్తాన్‌తో పోల్చి.. దేశాన్ని అవమానపర్చవద్దన్నారు. పాకిస్తాన్‌తో భారతదేశాన్ని పోల్చి దేశ గౌరవాన్ని బండి సంజయ్ తగ్గిస్తున్నారని.. దేశ గౌరవాన్ని తగ్గిస్తున్న బండి సంజయ్‌ను బీజేపీ పెద్దలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. "భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన భారతీయులంతా నా సోదరులే అన్న మీరు భారత రాజ్యాంగాన్ని కాపాడతానని చెప్పిన మీరు.. అధికారం కోసం విద్వేష ప్రసంగాల అవసరమా. మీరు చేసింది శూన్యం. పట్టభద్రులారా ఆలోచించండి విద్యా వేత్త నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించండి. సంవత్సరకాలంలో 54 వేల ఉద్యోగాలు ఇచ్చాం. నరేందర్ రెడ్డిని గెలిపించి పనిచేసే ప్రభుత్వాన్ని సపోర్ట్ చేయండి. భావోద్వేగాలతో రాజకీయాలు చేసే బండి సంజయ్‌కు, బీజేపీకి గట్టిగా బుద్ధి చెప్పండి" అంటూ పిలుపునిచ్చారు. యువతను మత కొట్లాట వైపు మళ్లించి కేసులు నమోదు చేయించడమే బీజేపీ రాజకీయం చేస్తోందన్నారు. టీఆర్ఎస్, బీజేపీ దొందూ దొందే అని అన్నారు. జటిలమైనా ఎన్నో సమస్యలను పరిష్కరించిన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని స్పష్టం చేశారు. భారతదేశంలో యుద్ధ వాతావరణం సృష్టించే ప్రయత్నం మానుకోవాలని.. ఈ చిల్లర మాటలు మానేయాలని హితవుపలికారు. ఇలాంటి విద్వేషాపూరిత ప్రసంగాలు భారతీయుల ఐక్యతను దెబ్బతీస్తుందన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడ్డ పాకిస్తాన్‌తో భారతదేశాన్ని పోల్చి దేశ గౌరవాన్ని కించపరుస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి చెందిన దేశాలతో మనం పోల్చుకోవాలని మంత్రి సతీక్క వ్యాఖ్యలు చేశారు.

## రాష్ట్ర ప్రభుత్వం వల్లే అంబర్ పేట ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో ఆలస్యం..

సికింద్రబాద్ ఎం పీగా చొరవ తీసుకొని కేంద్ర ప్రభు త్వంతో మాట్లాడి.. శ్మశాన వాటిక ఉన్నందున ఫ్లైఓవర్ నిర్మాణం చే యాలని కోరానని అన్నారు. అలాగే ఈ మార్గంలో విపరీతమైన రద్దీ ఉం టుందని, స్థానిక ప్రజలు కూడా ని త్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతుంటారని, ఈ జాతీయ ర హదారి గుండా వెళ్లే వరంగల్, ఖ మ్మం ప్రజలు కూడా అనేక ఇబ్బం దులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ మంజూ రు చేయాలని ప్రధానమంత్రిని కో రగా ఆయన వెంటనే ఒప్పుకొని మంజూరు చేశారని గుర్తు చేశారు. ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వం కానీ, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కానీ ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి పూర్తిగా సహ కరించి పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది కాబట్టి రాష్ట్ర ప్రభు త్వం ముందుకొచ్చి, మిగతా ఐదు చోట్ల భూసేకరణ చేసి సహకరించా ల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒకచోట భూసేకరణకు సంబంధించి రూ.2కోట్ల 51 లక్షలు చెక్కు తీసు కున్న తర్వాత కూడా భూసేకరణకు స్థలం నేషనల్ హైవే అథారిటికి అ ప్పగించలేదని, దాన్ని త్వరగా అం దించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహ కరించాలని కోరారు. అంతేగాక జీ హెచ్ఎంసీ, నేషనల్ హైవే అధికా రులతో ఇటీవల తాను ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించానని, ఫ్లైఓవర్ కింద మంచి రోడ్డు వేయ దంతో పాటు, గ్రీనరీ, బ్యూటిఫికేషన్ చేయాలని అధికారులను సూచించి నట్లు తెలిపారు. ఈ ఫ్లై ఓవర్ కు సంబంధించి గతంలో కేసీఆర్ కు అనేక ఉత్తరాలు రాశానని, భూసేక రణ ను వేగవంతం చేయాలని ఎ న్నోసార్లు విజ్ఞప్తి చేశానని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, మిగి లిపోయిన ఆరు చోట్ల భూసేకర ణను చేపట్టాలని కోరారు. ఇక ఈ ఫ్లైఓవర్ కోసం ఇప్పటి వరకు రూ .338 కోట్లు ఖర్చు చేయడం జరిగిం దని, ఏండ్ల తరబడి ట్రాఫిక్ కష్టాల కు రేపటి శివరాత్రి రోజు నుండి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలతో ఉపశ మనం కలుగుతుందని కిషన్ రెడ్డి వెల్లడించారు.

## సర్వాంగ సుందరంగా వేములవాడ

**వేములవాడ,ఫిబ్రవరి25( వెలుతురు):**

ప్రముఖ శైవ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానం మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. శివరాత్రి సందర్భంగా 3 రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ఆచారంగా వస్తోంది. స్థానిక ఎ÷–మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతో కార్యక్రమాలు పర్యవేక్షించారు. శివరాత్రి సదర్భంగా రాత్రి 9 గంటలకు నిశిపూజ, అనంతరం మహాశివరాత్రి పూజలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఏటా శిరాత్రి జాగారం కోసం వేలాదిగా భక్తులు తరలివస్తారు. వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇవో తెలిపారు. అలాగే రాజన్నను దర్శించుకునే భక్తులు రాజన్న ప్రసాదాలపై అంతే మక్కువ చూపుతారు. మహాశివరాత్రి జాతరకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలనుంచి మూడు నుంచి నాలుగు లక్షల మంది వస్తారన్న అంచనాలో అధికార యంత్రాంగం ఉంది. భక్తులకు రాజన్న లడ్డూ ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేసారు. పెద్ద ఎత్తున లడ్డూ ప్రసాదాన్ని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు స్వామివారి ప్రసాదం అందుబాటులో ఉండేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మహాజాతర కోసం భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా రాజరాజేశ్వరస్వామివారి ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. యాత్రికుల సౌకర్యార్థం ఆలయ అధికారులు విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేశారు. గతంలో ఎదురైన అనుభవాలను దృష్ట్యా మెరుగైన ఏర్పాట్లు చేపట్టాలనే లక్ష్యంతో పనులను దాదాపుగా పూర్తి చేశారు. ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. వివిధ ప్రాంతాలలో బాధ్యతలు కేటాయించారు. జాతర ఉత్సవాలలో పాల్గొనే భక్తుల వసతి సౌకర్యం కోసం చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

# మాది ఇండియా టీం కాంగ్రెస్ ది పాకిస్తాన్ టీం

- వెనుకబాటు ఆధారంగా నిధుల పంపిణీ ఉంటుందనే సోయి లేదా సీఎంగారు
- తెలంగాణ రెవిన్యూలో హైదరాబాద్ వాటా అత్యధికం
- హైదరాబాద్ సొమ్మును ఆదిలాబాద్, ఆసిఫాబాద్ వంటి వెనుకబడి ప్రాంతాలకు నిధులు ఖర్చు చేస్తోంది నిజం కాదా?
- ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రాంతీయ వైషమ్యాలు రెచ్చగొట్టాలనుకుంటారా?
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- ఉద్యోగాల కల్పన, నిధుల ఖర్చుపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్
- సవాల్ విసిరితే సీఎం తోకముడిచారని ఎద్దేవా

**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 25:**

"మొన్న జరిగిన ఇండియా పాకిస్తాన్ ఛాంపియన్ ట్రోఫీ మ్యాచ్ లో ఇండియా గెలిచింది. బీజేపీది ఇండియా జట్టు. పాకిస్తాన్ గెలిస్తే సంబురాలు చేసుకునే ఎంఐఎంతో అంటకాగుతున్న కాంగ్రెస్ ది పాకిస్తాన్ జట్టు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల మ్యాచ్ లోనూ గెలుపు బీజేపీదే. పాకిస్తాన్ ను చిత్తు చేసి తీరుతాం" అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ 14 నెలల పాలన బాగుందని విర్రవీగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా తీసుకునేందుకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. తెలంగాణసహా ఏ గ్రామానికి, ఏ మున్సిపాలిటీ, కార్పొరేషన్ కు కేంద్రం ఎన్ని నిధులిచ్చింది? రాష్ట్రం ఎంత ఖర్చు చేసిందనే వివరాలపై లెక్కా పత్రంతో సహా బహిరంగంగా చర్చించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. తాము గతంలోనే సవాల్ చేస్తే సీఎం తోకముడిచిన విషయాన్ని గుర్తు చేశారు.

మంగళవారం రోజున ఉదయం కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల శంకర్, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్పలతో కలిసి బండి సంజయ్ మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సంజయ్ ఏమన్నారంటే.....

ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పేరుతో తెలంగాణలో ఇండియా టీం, పాకిస్తాన్ టీం మధ్య మ్యాచ్ జరగబోతోంది. ఇండియా గెలవాలనుకుంటే బీజేపీకి ఓటేయండి. పాకిస్తాన్ గెలవాలనుకుంటే కాంగ్రెస్ కు ఓటేయండి. బీజేపీ గెలిస్తే పట్టభద్రుల, టీచర్ల ఆకాంక్షలను నెరవేరుస్తాం.

కుల గణనకు మేం వ్యతిరేకం కానేకాదు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నాం. తెలంగాణలోనూ ఎప్పటి నుండో దూదేకుల కులాలకు ఎప్పటి నుండో రిజర్వేషన్లు అమలు... మేం ఏనాడూ అభ్యంతర పెట్టలేదు. కానీ 12.5 శాతం జనాభా ఉన్న ముస్లిం జనాభాలో 8.8 శాతం మందిని బీసీల్లో కలుపుతామంటే ఎందుకు ఒప్పుకుంటాం?. నూటికి 88 మందికిపైగా ముస్లింలను బీసీల్లో కలిపి నిజమైన బీసీల పొట్టకొడతారా?. ముస్లింలందరినీ బీసీల్లో చేర్చి బిల్లు పంపితే ఎందుకు ఆమోదించాలి? 60 లక్షల మంది బీసీల జనాభా ఎట్లా తగ్గిందో సమాధానం చెప్పాలి. సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ జనాభా 56 శాతం జనాభా ఉందని నాటి మంత్రులు కేటీఆర్, హరీష్ అసెంబ్లీలో చెబితే ఎందుకు అభ్యంతరం చెప్పలేదు?. ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైకోర్టులో పిటిషన్ వేసి సీబీఐ విచారణ జరిపించాలని కోరితే ప్రభుత్వం ఒప్పుకోని విషయం నిజం కాదా?. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాతే ప్రభాకర్ రావు, శ్రవణ్ విదేశాలకు పారిపోయారు. మీరు వాళ్లను అరెస్ట్ చేయకుండా పారిపోయేలా చేసిందే కాంగ్రెస్. మీరు విదేశాలకు పంపిస్తే...మేం పట్టుకురావాలా? కేసీఆర్ చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశామని పోలీసులు చెప్పిన తరువాత కూడా ఆయనకు కనీసం నోటీసు కూడా ఎందుకియ్యలే?. కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే సాహసం కూడా చేయలేని అసమర్దులు మీరు. ఫాంహౌజ్ డ్రగ్స్ లో కేటీఆర్ ఉన్నాడని చెప్పింది రేవంత్ రెడ్డే కదా?. విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక ఇచ్చి 3 నెలలైనా ఇంతవరకు ఎందుకు బయటపెట్టలేదు?. ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ వల్లే ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైందని సీఎం హెూదాలో రేవంత్ రెడ్డే చెప్పారు.. ఎందుకు అరెస్ట్ చేయలేదు?. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏడాదిగా విచారణ కమిషన్ గడువును పొడిగిస్తున్నారే తప్ప కేసీఆర్ ను ఎందుకు విచారించలేదు?. మీరు విచారణ చేస్తూ కేంద్రం ఎందుకు పట్టుకురావడం లేదంటే ఏమనాలి?. మీకు దమ్ముంటే సీబీఐ విచారణ కోరండి... కేసును సీబీఐకి అప్పగించండి. దోషులందరినీ అరెస్ట్ చేసి బొక్కలో వేస్తాం.

యమునా, గంగా, సబర్మతి ప్రక్షాళనకు అతి తక్కువ ఖర్చుతో చేశారు. కాంగ్రెస్ అగ్రనేత అల్లుడి కోసం రూ.15 వేల కోట్ల ఖర్చయ్యే మూసీ ప్రక్షాళనను రూ.1.5 లక్షలకు పెంచి కమీషన్లు దొబ్బాలనుకుంటే కేంద్రం ఎందుకు సహకరించాలి?.

తెలంగాణ నుండి రూపాయి వెళితే 42 పైసలే కేంద్రం ఇస్తోంది... బీహార్, యూపీలకు ఎక్కువ ఇస్తున్నారని చెప్పడమేంది? వెనుకబాటు ఆధారంగా కేంద్రం ఆయా రాష్ట్రాలకు నిధులను పంపిణీ చేస్తున్న విషయం మీకు తెలియదా? తెలిసి ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టాలనుకుంటున్నారా? తెలంగాణ రెవిన్యూలో అత్యధిక షేర్ హైదరాబాద్ దే.... కానీ ఆదిలాబాద్, ములుగు వంటి వెనుకబడిన జిల్లాలకు అధిక నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది? అట్లని హైదరాబాద్ కు అన్యాయం చేసిందని అనుకోవాలా?.

యూపీఏ 10 ఏళ్ల పాలనలో 2.94 కోట్ల ఉద్యోగాలను మాత్రమే సృష్టించింది. మోదీ 10 పాలనలో 17 కోట్ల 19 లక్షల ఉద్యోగాలను సృష్టించింది నిజం కాదా?. రెండేళ్లలోనే రోజ్ గార్ మేళా పేరుతో 9 లక్షల 25 వేల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది నిజం కాదా?. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తానన్నవ్...ఎటు పోయింది?. తెలంగాణ అభివృద్ధిలో కేంద్రం ఏం చేసింది? రాష్ట్రం ఏం చేసిందనే విషయంపై గ్రామాల వారీగా లెక్కలతో సహా చర్చకు సిద్ధం. మేం సవాల్ చేస్తే సీఎం తోకముడిచారు. ఎమ్మెల్సీ ఎన్నికల క్రికెట్ మ్యాచ్ లో బీఆర్ఎస్ జట్టే లేదు... ఆ టీంకు సభ్యులే లేక మ్యాచ్ నుండి వైదొలగింది. వరి వేస్తే ఉరేనని కేసీఆర్ అంటే.... రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కూడా వరి వేయుద్దు... వేస్తే నష్టపోతారని రైతులను హెచ్చరిస్తున్నారు... మీకు, బీఆర్ఎస్ పాలనకు తేడా ఏముంది? ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడ్డా నీటి కటకట ఎందుకొచ్చింది? మీ అసమర్ధత, పొరుగు రాష్ట్రానికి నీటిని దోచిపెట్టడంవల్లే ఈ దుస్థితి వచ్చింది. ప్రధాని మోదీని పెద్ద బీసీ, నన్ను చిన్న బీసీ అంటూ బీసీ సమాజాన్ని అవమానిస్తవా? మోదీ బీసీయే కాదని చెప్పిన ముఖ్యమంత్రే... ఇయాళ పెద్ద బీసీ అంటున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు వస్తుంటే...రూ.4 వేల నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాల భర్తీ, ఉద్యోగులకు డీఏలు, జీపీఎఫ్ సొమ్ము, రిటైర్డ్ బెన్ ఫిట్స్, ఫీజు రీయంబర్స్ బకాయిలపై ప్రకటన చేస్తారని ఆశపడ్డ పట్టభద్రులు, ఉద్యోగులను నిరాశకు గురి చేసినవ్. ఉద్యోగులకు ప్రతినెలా జీతం ఇవ్వడం మీ బాధ్యత... వాళ్లు పనిచేస్తేనే జీతాలిస్తున్నవ్ కదా... ఏదో బిచ్చమేస్తున్నట్లు మాట్లాడతారా?. 6 గ్యారంటీలు సహా మేనిఫెస్టో హామీలన్నీ అమలు చేశారని భావిస్తే... ఆ పార్టీకే ఓటేయండి.

మీ సమస్యలపై నిరంతరం పోరాడుతూ సర్కార్ మెడలు వంచేది బీజేపీయే అనుకుంటే మాకు మద్దతివ్వండి. మీకు ఏ కష్టమొచ్చినా బీజేపీ అండగా ఉంటుంది. ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిల ఇప్పించేలా మీతరపున కొట్లాడుతోంది బీజేపీయే. కాంగ్రెస్ కు ఎందుకు ఓటేయాలి? 14 నెలల్లో మీరు ఒరగబెట్టిందేమిటి? 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయనందుకా? నిరుద్యోగ భృతి ఇవ్వనందుకా? మహిళలకు నెలనెలా రూ.2500లు ఇవ్వనందుకా? తులం బంగారం, స్కూటీ ఇవ్వనందుకా? రైతు భరోసా ఎగ్గొట్టినందుకా? 20 లక్షల మందికి రుణమాఫీ ఎగ్గొట్టినందుకా? విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు ఇవ్వనందుకా? ఉద్యోగ, ఉపాధ్యాయులకు 5 డీఏలియ్యనందుకా? పెన్షన్ పైసలు ఇయ్యనందుకా? దాచుకున్న జీపీఎఫ్ పైసలను కూడా ఇయ్యనందుకా? ఆఖరికి రిటైర్డ్ మెంట్ బెన్ ఫిట్స్ ఇవ్వకుండా ఉద్యోగులను రోడ్డున పడేస్తున్నందుకు మీకు ఓటేయాలా? బీజేపీకి ఓటేస్తే ప్రతిరోజు మీ పక్షాన కొట్లాడతాం... ప్రభుత్వ మెడలు వంచి మీ సమస్యలను పరిష్కరించేలా చేస్తాం.

నన్ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి తప్పించి బీసీలకు అన్యాయం చేశారనడం అబద్దం. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, కేంద్ర మంత్రిగా ప్రమోషన్ ఇచ్చింది. కాంగ్రెస్ పాలన బాగుందని విర్రవీగుతున్న సీఎంకు సవాల్ చేస్తున్నా...మీ 14 నెలల పాలనపై ఎమ్మెల్సీ ఎన్నికలే రెఫరెండంగా తీసుకుందామా?

# ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్

పనిచేస్తున్నాయి. బయో సైన్సెస్‌లో పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్న దార్శకనితతో ప్రభుత్వం ముందునుంచి పనిచేస్తోంది. జినోమ్ వ్యాలీని ఏర్పాటు చేసుకున్నాం. హెల్త్‌కేర్ రంగం భవిష్యత్తును నిర్దేశించడంతో పాటు ప్రపంచానికి మార్గదర్శనం చేసే కార్యక్రమంగా బయో ఆసియా దేశవిదేశాలను ఆకర్షిస్తోంది. తెలంగాణలో ఉన్న అనుకూలతలు, ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకోవాలని, ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రపంచ స్థాయి దిగ్గజ కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నాం. నిన్ననే ఆమ్‌జెన్ కంపెనీ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను విస్తరించింది. ప్రభుత్వ సహకారానికి ఇది నిదర్శనం.జర్మనీ కంపెనీ మిల్టెని బయోటెక్ జీనోమ్ వ్యాలీ లో తన సెల్, జన్యు చికిత్సను ప్రారంభించింది. ఈ వేదికపై మరో 4 బహుళజాతి కంపెనీలను తెలంగాణ పర్యావరణ వ్యవస్థలోకి స్వాగతిస్తున్నాం. గతేడాది AI హెల్త్‌కేర్ సదస్సును కూడా విజయవంతంగా నిర్వహించాం.దేశ విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడంలో భారతదేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో అత్యల్ప ద్రవ్యోల్బణం, అత్యధిక ఉద్యోగాల కల్పన ఉంది. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో తెలంగాణ రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. విభిన్న రంగాలలో దాదాపు 50,000 ఉద్యోగాలు రానున్నాయి. అలాగే, గతేడాది లైఫ్ సైన్సెస్ రంగంలో రూ. 40,000 కోట్లకు పైగా పెట్టుబడులను విజయవంతంగా ఆకర్షించాం. దాదాపు 150 పైగా ప్రాజెక్టుల్లో ఈ పెట్టుబడులు విస్తరించాయి. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతంలో మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా, ఫార్మా క్లస్టర్స్ అభివృద్ధి చేస్తున్నాం. తద్వారా 5 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రీన్ ఫార్మా సిటీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. అతిపెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలు అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయి. వచ్చే పదేళ్లలో తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే కాకుండా చైనా ప్లస్ వన్ ఆలోచనలకు సరైన ప్రత్యామ్నాయ కేంద్రంగా తెలంగాణను అభివృద్ధి చేస్తున్నాం. నెట్ జీరో సిటీ కింద అనేక లక్ష్యాలను నిర్ధేశించాం. దేశ విదేశాల నుంచి బయో ఆసియా సదస్సుకు హాజరైన ప్రతినిధులందరికీ అభినందనలు. మీరంతా పెట్టుబడులకు తెలంగాణ అనువైన వేదికగా అవకాశాలను ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నాం". అని ముఖ్యమంత్రి గారు సదస్సును ఉద్దేశించి వివరించారు. ఈ వేదికగా జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డ్ 2025 ను ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా ప్రిసిషన్ హెల్త్ రీసెర్చ్ (ప్రిసైస్) సింగపూర్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొ. పాట్రిక్ టాన్‌కు బహూకరించారు. ప్రారంభ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు Queensland State గవర్నర్ డాక్టర్ జెన్నెట్ యంగ్ తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు.

# వైసిపి పాలనలో సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్

ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఇలాంటి సెషన్‌లు ఎప్పుడూ చూడలేదు... గొడవ ఎలా ఉంటుందో ఇప్పుడు చూడటమేనని పవన్ కల్యాణ్ అన్నారు. గతంలో గవర్నర్ ఈఎస్ఎల్ నర్సింహన్ ఉన్నప్పుడు తెలంగాణ అంశంలో ఇలాంటి గొడవ చూశానని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అసలు అసెంబ్లీలో ఇలా ప్రవర్తించవచ్చా అని తనకు అనిపిస్తోందని అన్నారు. వైసిపి సభ్యులే ఈ రూల్‌ను బ్రేక్ చేస్తే ప్రజలకు ఏం చెబుతామని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. అసెంబ్లీలో గొడవలు జరిగితే కేసులు ఎందుకు పెట్టరని మంత్రి మనోహర్‌ను అడిగానని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఇక్కడ సభ్యులపై కేసులు పెట్టడం లేదంటే అన్ని విషయాలు మాట్లాడే స్వేచ్ఛ ఇచ్చారనే కదా అని పవన్ కల్యాణ్ చెప్పారు. నిన్న వైసీపీ సభ్యులు గవర్నర్‌పై చేసిన గొడవ మంచిది కాదని అన్నారు. సుప్రీంకోర్టు జస్టిస్‌గా ఆయన ఉన్నప్పుడు ధైర్యం చేయగలరా, కళ్లల్లో చూడగలరా అని పవన్ కల్యాణ్ నిలదీశారు. నిన్న మీడియా ప్రతినిధులు తనను అడిగారు... వైసీపీ అనేది గొడవలకు పర్యాయపదమని విమర్శించారు. నిన్న అసెంబ్లీలో గొడవ జరిగిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇన్నేళ్లు వైసీపీ నేతలను తట్టుకొని నిలబడటం చూస్తే ఆయనకు హ్యాట్సాఫ్ చెప్పాలని పవన్ కల్యాణ్ అన్నారు. నిన్న వారి గొడవ చూస్తే ఎప్పుడైతే పేపర్లు విసిరేసి అక్కడికి వచ్చారో వివేకానంద రెడ్డి హత్య గుర్తుకువచ్చింది, ప్రజావేదిక, 200 ఆలయాల కూల్చివేతలు గుర్తుకువచ్చాయి, డాక్టర్ సుధాకర్ చనిపోవడం, జంగారెడ్డిగూడెం కల్తీసారా మరణాలు గుర్తుకువచ్చాయని పవన్ కల్యాణ్ చెప్పారు. పత్రికాధిపతులపై దాడులు, టీడీపీ నేతలపై జరిగిన దాడులు, 53రోజులు చంద్రబాబును జైల్లో పెట్టిన విధానం గుర్తుకు వచ్చింది, అమరావతి రైతులును పెట్టిన హింస గుర్తుకువచ్చిందని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు.గవర్నర్‌కు ఆరోగ్యం సరిగా లేకపోయినా ఆయన ప్రసంగించినందుకు పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటినుంచి వైసీపీ సభ్యులను ఇబ్బంది పెట్టవద్దని సీఎం చంద్రబాబు చెప్పారని.. అయినా వైసీపీ సభ్యుల వ్యవహారశైలి మారలేదని పవన్ కల్యాణ్ అన్నారు. నిన్న సభలో నుంచి వైసీపీ సభ్యులు బయటకు వెళ్లిపోవడంలో తమ తప్పులేకపోయినా గవర్నర్‌కు ప్రభుత్వం తరపున క్షమాపణలు చెప్పామని అన్నారు. గత జగన్ ప్రభుత్వం మూడు ముక్కలు ఆడటంతో పెట్టుబడులు రాక ఏపీ ఆర్థిక పరిస్థితి క్షీణించిందని వాపోయారు. ఇలాంటి సమయంలో చంద్రబాబు ఈ సవాళ్లను ఎదుర్కొని ప్రభుత్వాన్ని ముందుకు నడుపుతున్నారని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. గత కొంత కాలంగా రాష్ట్రం ఆర్థిక సుస్థిరత కోల్పోయినా సీఎం చంద్రబాబు దారిలో పెడుతున్నారని చెప్పారు. పంచాయితీరాజ్‌లో అవినీతికి తావు లేకుండా ఉద్యోగుల బదిలీలు చేశామని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. గ్రామ సభలు రికార్డు స్థాయిలో ఫ్లలె పండుగ రూపంలో నిర్వహించామని పవన్ కల్యాణ్ తెలిపారు. రూ. 4500 కోట్ల వ్యయంతో 30వేల అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామని అన్నారు. ఆరునెలల్లో 4300 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 22500 గోకులాలను నిర్మించామని తెలిపారు. 268 మినిగోకులాలను మాత్రమే వైసీపీ ఐదేళ్లలో ఏర్పాటు చేసిందన్నారు. విజన్ 2047కు అనుగుణంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జలజీవన్ మిషన్‌ను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. వీసీల నియామకాన్ని మెరిటోరియస్ ఓరియంటెడ్‌గా మంత్రి నారా లోకేష్ నియమించారని.. దానికి ఆయనను అభినందిస్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'ఏపీలో అటవీ విస్తీర్ణం 50శాతానికి పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని దేవాలయాలు అటవీ ప్రాంతంలో ఉన్నాయి. అక్కడికి అడవిలో కొత్తదారి గుండా భక్తులు వెళ్లారు. అందుకే ఏనుగులు దాడి చేశాయి.. గున్న ఏనుగులను పంపాలని చూడటంతో దాడి చేశాయి.

## ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం

చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. తల్లికి వందనం సహా.. అనేక పథకాల అమలును ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. తల్లికి వందనం పథకం అమలు వ్యవహారంపై మాట్లాడిన సీఎం.. ఈ పథకాన్ని మే నెలలో అమలు చేస్తామని చెప్పారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా.. పథకాన్ని అమలు చేస్తామన్నారు. మే నెలలో ఈ పథకం డబ్బులు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. రైతుకు భరోసా కల్పించే విషయంలో తాము చెప్పినట్లుగానే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు సీఎం. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా కేంద్రం ఇచ్చే కిసాన్ సమ్మాన్ నిధి యోజన రూ. 6000, రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.14 వేలు కలిపి మొత్తం రూ. 20వేలు ఇస్తామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతిదీ అమలు చేస్తామని ముఖ్యమంత్రి మరోసారి ఉద్ఘాటించారు. ఇక దివ్యాంగులకు రూ. 3 వేల నుంచి రూ. 6 వేలు పింఛను పెంచామన్నారు. సాధారణ పింఛన్‌ను రూ. 3 వేల నుంచి 4 వేలకు పెంచామన్నారు. రూ. 33 వేల కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం పింఛన్లు ఇచ్చే దేశంలోనే ఏకైక కార్యక్రమం ఇది అని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఎన్ని కష్టాలు ఉన్నా గవర్నమెంట్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అందరికీ సమయానికి జీతాలు ఇస్తున్నామని, ఈ విషయాన్ని గర్వంగా చెబుతున్నామని సీఎం చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. అన్న క్యాంటిన్లు మూసేశారని.. ఇప్పుడు తాము తిరిగి ప్రారంభించామన్నారు. పేదలకు దీపం కార్యక్రమం ద్వారా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చామని.. ఆ హామీని అమలు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ పథకం ద్వారా 93 లక్షల మందికి దీపం 2 అందుతోందన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి డీఎస్సీ సెలక్షన్ పూర్తి చేసి బడులు తెరుస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇక మత్స్యకారులకు సైతం అండగా ఉంటామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. మత్స్యకారులకు రూ. 20 వేలు ఇస్తామన్నారు. ప్రతి సంవత్సరం వారికి హాలిడే ఇస్తామని.. ఆ హాలిడే కంటే ముందుగానే ఆర్థిక సాయం చేసి ఆదుకుంటామన్నారు. వైకాపా హయాంలో జరిగిన సభ కౌరవ సభ. కౌరవసభను గౌరవసభ చేశాకే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశా. గౌరవసభను అవమానించే పార్టీ ఇవాళ అసెంబ్లీలో లేకుండా పోయింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం ఎప్పుడూ చూడలేదు.

# జర్నలిస్టుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

- హెజ్ యూజే నాయకులకు మంత్రి కొండా సురేఖ హామీ



**హైదరాబాద్ , వెలుతురు ఫిబ్రవరి 25:** రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మంగళవారం డాక్టర్.. బీఆర్.. అంబేద్కర్.. సచివాలయంలో హైదరాబాద్? యూనియన్? ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్?యూజే-టీడబ్ల్యూజేఎఫ్-) నాయకులు మంత్రి కొండా సురేఖను కలిశారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే 2025 మీడియా డైరీని మంత్రికి అందజేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను హెచ్ యుజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీశ్వర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం హెల్త్? ఇన్సూరెన్స్? సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల కొత్తగా ఇస్తున్న హెల్త్? కార్డులతో కలిపి జర్నలిస్టులకు హెల్తు కార్డులు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ప్రతి జర్నలిస్టుకు ప్రతి ఏటా రూ.10 లక్షల హెల్త్ ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. రైతు బీమా మాదిరి అక్రిడేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులందరికీ జర్నలిస్టు బీమా అమలు చేయాలని మంత్రిని కోరారు. ఏదేని కారణంతో జర్నలిస్టులు చనిపోతే వారి కుటుంబాలకు కనీసం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు అందేలా జీవిత బీమా పథకం తీసుకురావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కొండా సురేఖ... జర్నలిస్టుల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. వరంగల్ ఇంచార్జీ మంత్రి అయిన ఐ అండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కూడా జర్నలిస్టుల సమస్యలపై చర్చిస్తానని చెప్పారు. ఇండ్ల స్థలాల సమస్య విషయంలో సీఎం నిర్ణయానికి అనుగుణంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ యు జే కార్యవర్గ సభ్యులు, సీనియర్ మహిళా జర్నలిస్టులు కంచి లలిత, పెద్దిరెడ్డి విజయ తదితరులు మంత్రి కొండా సురేఖకు శాలువా కప్పి సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో హెచ్?యూజే వర్కింగ్? ప్రెసిడెంట్? గంద్ర నవీన్?, కోశాధికారి బట్టిపాటి రాజశేఖర్?, నాయకులు చిట్యాల మధుకర్?, క్రాంతి, కొడవటి నవీన్?, పూర్ణచందర్?, రాజు, రేణయ్య తదితరులు ఉన్నారు.

## క్వీన్స్ ల్యాండ్ ప్రతినిధులతో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి

- ఇరువురు ప్రతినిధులు పరస్పరం పెట్టుబడుల చర్చలు





(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 25:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంగళ వారం నాడు ఆస్ట్రేలియా క్వీన్స్‌ల్యాండ్ (Queensland) స్టేట్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. తెలంగాణలో ఉన్న సానుకూల వాతావరణం, పెట్టుబడులకు కల్పించిన అనుకూల పరిస్థితుల గురించి వారికి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. తెలంగాణలో పరిశ్రమలు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ట్రేడింగ్, ఇతర రంగాల్లో పెట్టుబడులు, అవగాహనా ఒప్పందాల విషయంలోసమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు క్వీన్స్ ల్యాండ్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.ఈ చర్చల్లో క్వీన్స్‌లాండ్ గవర్నర్ డాక్టర్ జెన్నెట్ యంగ్ , క్వీన్స్‌ల్యాండ్ ఆర్థిక, వాణిజ్య, ఉపాధి, శిక్షణా శాఖ మంత్రి రోస్లిన్ బేట్స్ తో పాటు ఇతర ప్రముఖులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గీత వృత్తి రక్షణకై ఉద్యమించండి

- గీతా పని వారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పబ్బు వీరస్వామి



**మునుగోడు వెలుతురు ఫిబ్రవరి 25:**

గీతా పనివారల సంఘం మునుగోడు నియోజకవర్గ సమావేశం ఈరోజు అనగా మంగళవారం నాడు ఎరుకల నిరంజన్ గౌడ్ అధ్యక్షతన స్థానిక సిపిఐ ఆఫీసులో జరిగింది ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ రాష్ట్రంలో గీత వృత్తికి సమగ్ర చట్టం చేసి గీత కడుపులో సంక్షేమానికి 1000 కోట్ల నిధిని ఏర్పాటు చేయాలిస్కిల్ యూనివర్సిటీలో గీత వృత్తికి సంబంధించిన శిక్షణను కల్పించాలి అని అన్నారు అర్హులైన గీతా కార్మికులకు వృత్తి పింఛన్ వెంటనే మంజూరు చేయాలి ప్రభుత్వ భూమి ఉన్నచోట ప్రతి సొసైటీకి వన పెంపకానికి భూమి ఇవ్వాలి అని అన్నారు ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగ సైదులు మాట్లాడుతూ చనిపోయిన గీతా కార్మికుల పింఛన్ ను వారి భార్యల పేరు మీద వితంతు పింఛనుగా మార్చాలని అన్నారు పల్లె ప్రకృతి వనాలలో తాటి ఈత ఖర్జూర చెట్లను పెంచాలని అన్నారు చెట్లు ఎక్కిగీతా కార్మికులకు అందరికీ కాటమయ్య కిట్లను మంజూరు చేయాలని అన్నారు పెండింగ్ లో ఉన్న ఎక్స్గ్రేషన్ వెంటనే మంజూరు చేయాలని అన్నారు ఈ సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సురిగి చలపతి, జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మరబోయిన లాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, గంటా నాగేష్ మాధవుని మల్లేష్ ఈదులకంటి కైలాస్ నాతి నరసింహ, మాధగోని మల్లయ్య, ఏ నరసింహ బి యాదయ్య, జి గాలయ్య పాలకూరి యాదయ్య, గోపగోని సైదులు, కట్కూరి లింగస్వామి కే శేఖర్, కే అంజయ్య తదితరులు పాల్గొన్నారు

## దేశ ప్రజలకు మహాశివ రాత్రి శుభాకాంక్షలు.

\- జాజుల లింగంగౌడ్



**మిర్యాలగూడ వెలుతురు ఫిబ్రవరి 25:** శివరాత్రి అంటే పవిత్రమైన చీకటి అని,ఈరోజు భక్తులు శివ నామాన్ని, మంత్రాలను మనస్ఫూర్తిగా పఠిస్తు. మహాశివరాత్రి సందర్భంగా శివుడు పార్వతీ సమేతంగా భూలోకానికి వస్తాడని,ఈ రోజున ఎవరైతే శివుడిని నిర్మలమైన మనస్సుతో పూజిస్తారో వారి పాపాలు తొలగిపోతాయని ప్రతీతి.ఈ పవిత్రమైన రోజు సందర్భంగా బందు మిత్రులకు, శ్రేయోభిలాషులకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తు జీవితంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆనందంగా ఉండాలని లింగంగౌడ్ ఆకాక్షించారు.

## ప్రజల ప్రాణాలు తీస్తున్న కిష్టారం శైలో బంకర్ ను తొలగించాలి

***రిలే నిరాహార దీక్షలకు డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మద్దతు.***



**సత్తుపల్లి వెలుతురు ఫిబ్రవరి 25:**
ఖమ్మం జిల్లా కిష్టాపురం అంబేద్కర్ నగర్ కానుకొని ఉన్న శైలో బంకర్ ను తొలగించాలి. వ్యతిరేకంగా రిలే-నిరాహారదీక్షలు గత 16 రోజులుగా జరుగుతున్న దీక్షకు మద్దతుగా మంగళవారం రోజున దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మద్దతు తెలియజేశారు. అనంతరం మారుప అనిల్ కుమార్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం, కిష్టాపురం అంబేద్కర్ నగర్ నివాసులము. గత నాల్గు సంవత్సరములుగా కాలనీకి అనుకొని కట్టిన శైలో బంకర్ వెదజల్లుతున్న కాలుష్యానికి కాలనీ వాసులు అనేక మంది అనేక రోగాలతో మరణించుచున్నారు. సింగరేణి వారు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. కాలనీలో ఇంటికొకరు రోగాలతో అలమటిస్తున్నారు. త్రాగునీరు కూడా కలుషితము అవుతున్నది. సింగరేణి వారి నిర్లక్ష్యధోరణిని తో వ్యవహరిస్తున్నారు ఆయన అన్నారు కాలనీలో పోల్యూషన్ కు కారణమైన శైలో బంకర్ వెంటనే తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . సింగరేణి యాజమాన్యానికి ఆదాయాన్ని పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాలలో రక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి ప్రజలు చిన్న ప్రజలు శర్మ వ్యాధులు, క్యాన్సర్ శ్వాసకోశ వ్యాధులతో పాటు గా అనేక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు.దళిత కాలనీకి 90 మీటర్ల దూరంలోనే బంకర్ ఏర్పాటు చేసి వారి జీవించే హక్కుల కాల రాస్తున్నాను. సింగరేణి నిర్లక్ష్య ధోరణి ఆయన ఎండగట్టారు. తెలంగాణ రాష్ట్రం నుండి కేంద్ర మంత్రులు గా ఉన్న బండి సంజయ్, కిషన్ రెడ్డి తక్షణమే ఈ నిర్వాహితుల సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఆర్థిక విధానాల మూలంగా ప్రజల్లో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వాసితులు అవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పోరాటానికి దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో సీపీఐ సత్తుపల్లి మండల కార్యదర్శి తడిక మల్ల యోబు, నాగేశ్వరరావు, ప్రభుదాస్, మదీనా, శీను, రాజు, తదితరులు పాల్గొన్నారు

## టన్నెల్ లో ఉన్న వారిని సురక్షితం గా బయటకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం

\- ఉప ముఖ్యమంత్రి భట్టి

- అధికారులతో మంత్రులు ఉత్తమ్, కోమటి రెడ్డి, జూపల్లి లు



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 25:**



ఎస్ ఎల్ బీసీ టన్నెల్ వద్ద మంగళ వారం నాడు సైతం కొనసాగుతున్న సహాయక చర్యలు,రాష్ట్ర మంత్రులు. రక్షణ శాఖ అధికారులు కలిసి టన్నెల్ లో చిక్కుకున్న వారిని సురక్షితం గా బయటకు తీసుకురావడం కోసం ప్రత్యేక చర్చించారు, ఈ చర్యలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహచర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , జూపల్లి కృష్ణా రావు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ .చిక్కుడు వంశీ కృష్ణ తో కలిసి సహాయక చర్యలో పాల్గొంటున్న ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు, అలాగే టన్నెల్ లో చిక్కుకున్న 8 మందిని కాపాడేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నిపుణుల సహకారం తీసుకుంటూ వారిని కనుగొనేందుకు అన్ని రకాలుగా ప్రయత్నం కొనసాగిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు, అలాగే టన్నెల్ లో ఇరుక్కు పోయిన వారిని గుర్తించి వెంటనే వారిని బయటకు తీసుకు రావడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటామని తెలిపారు.

### మహిళా సహకార సంఘాల అభివృద్ధికి జరిగిన సమీక్ష: మంత్రి సీతక్క



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 25:** మధుర నగరంలో మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షా సమావేశంను రాష్ట్ర మంత్రి సీతక్క,18-45 ఏండ్ల మహిళలకు ఉపాధి కల్పన ప్రణాళిక, మహిళా ప్రాంగణాల సద్వినియోగంపై చర్చ నిర్వహించారు, ఈ సమావేశంలో హాజరైన చైర్పర్సన్ బండ్రు శోభారాణి, మరియు అధికారులుతో కలిసి మహిళా ఆర్థిక స్వావలంబనపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు, ఈ సమావేశంలో మహిళా సాధికారత అధికారులు మరియు మహిళా సాధికారత ముఖ్య భూమిక పోషించిన మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు,




## సంపాదకీయం..

# చారిత్రక ఘట్టంగా మహాకుంభమేళా

భారతదేశంలో మహోజ్వల ఘట్టం ముగింపు దశకు చేరుకుంది. 144 ఏళ్లకోమారు వచ్చే మహాకుంభమేళా మహాశివరాత్రి పర్వదినంతో ముగియనుంది. ఇప్పటికే 65కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి నట్లు యూపి ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయి. శివరాత్రి బుధవారం మరింతమంది చేరితే అసలు లెక్కలు తేలుతాయి. అయితే పవిత్ర స్నానాలు ఆచరించిన వారి సంఖ్యను చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ఈ జనాభా భారత జనాభాకు సగంగా ఉండడం విశేషం. దేశవిదేశాల నుంచి కూడా కోట్లాది సంఖ్యలో భక్తులు వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు, సిఎ యోగి ఆదిత్యనాథ్, ఎపి మంత్రులు పవన్ కళ్యాణ్, లోకేవ్ దంపతులు ఇలా ఒక్కరేమిటి ఎందరో విఐపిలు పుణ్యస్నానాలు ఆచరించారు. స్వల్ప ఘటనలు మినహా ఓ రకంగా కుంభమేళా అద్భుతంగా సాగిందనే చెప్పాలి. మౌని అమావాస్య రోజు జరిగిన తొక్కిసలాట ఒక్కటే కొంత ఆందోళనకు గురిచేసింది. రెండుమూడు చిన్నచిన్న ఘటనలు..అంటే స్వల్ప అగ్నిప్రమాదాల్లాంటివి జరిగాయి. ఇవి మినహా అంతా ప్రశాంతంగా ముగిసింది. ఇందుకు యూపి ప్రభుత్వాన్ని అభినందిం చాల్సిందే. దాదాపు రెండేళ్ల ముందునుంచే ఈ మహాఘట్టం కోసం ఏర్పాట్లు మొదలయ్యాయంటే .. ఎంతగా జాగ్రత్తలు తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా ఇక చివరిదశకు చేరింది. ఇవరాత్రి పర్వదిన స్నానాలతో ఈ మహాకుంభమేళా ముగియనుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివెళ్తున్నారు. చివరి అమృత్ స్నానం కోసం కోటి మందికిపైగా భక్తులు వస్తారని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగానే ప్రయాగ్‌రాజ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. భద్రతా ఏర్పాట్లు మరింత పటిష్టం చేశారు. భక్తుల స్నానాలకు ఇబ్బందులు లేకుండా తొక్కిసలాటకు అవకాశం లేకుండా గట్టి ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి కుంభమేళా ప్రాంతాన్ని 'నో వెహికల్ జోన్' గా అధికారులు ప్రకటించారు. ప్రయాగ్‌రాజ్ మొత్తం ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. అత్యవసర, నిత్యావసర సర్వీసులకు చెందిన వాహనాలను మాత్రమే అనుమతించనున్నట్లు ప్రకటించారు. యాత్రికులంతా ఈ మార్గదర్శకాలను పాటించాలని, అధికారులకు సహకరించాలని ప్రభుత్వం కోరింది.చివరి రోజు అమృత స్నానాల కోసం కోటి మందికిపైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుంభమేళా ప్రాంతంలో రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా లక్నో, ప్రతాప్‌గఢ్ వైపు నుంచి వచ్చే యాత్రికుల కోసం ఫాఫామౌ ఘాట్‌ను నియమించారు. రేవాన్, బండా, చిత్రకూట్, మిర్జాపూర్ వైపు నుంచి వచ్చే వారికోసం అరైల్ ఘాట్‌ను రిజర్వ్ చేశారు. కౌశాంబి నుంచి వచ్చే భక్తుల కోసం సంగం ఘాట్‌ను కేటాయించారు. మరోవైపు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే అన్ని ప్రధాన రహదారుల్లో పోలీసులు భారీగా మోహరించారు. వాహనాలు సాఫీగా ముందుకు సాగేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే.. 40 పోలీసు బృందాలు మోటార్‌బైక్‌లపై ఆయా మార్గాల్లో మోహరించారు. ప్రయాగ్‌రాజ్‌ను కలిపే ఏడు ప్రధాన రహదారుల్లో అదనపు డైరెక్టర్ జనరల్, ఇన్‌స్పెక్టర్ జనరల్ స్థాయి అధికారులు విధుల్లో ఉండనున్నారు. కాగా, పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13న ప్రారంభమైన ఈ మహాకుంభమేళా.. ఫిబ్రవరి 26న శివరాత్రితో ముగియనుంది. దాదాపు 45 రోజుల పాటు సాగే ఈ కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కోట్లాదిగా తరలివస్తున్నారు. అక్కడ గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమం లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 64 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమంలో స్నానాలు ఆచరించినట్లు యూపీ సర్కార్ ప్రకటించింది. ఇక చివరి రోజు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఇదే సమయంలో గిన్నిస్ రికార్డు లక్ష్యంగా పారిశుధ్య కార్మికులు కుంభమేళా ప్రాంతంలో క్లీన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 15,000 మంది పారిశుధ్య కార్మికులు ఇక్కడ నాలుగు జోన్లలో క్లీన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా చీపురుపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు, ప్రయాగ్‌రాజ్ మేయర్ గణేశ్ కేసర్వాని, మహాకుంభ్ ప్రత్యేక ఈవో ఆకాంక్ష రాణా పర్యవేక్షించారు. ఈ రికార్డుకు సంబంధించిన వివరాలను మూడు రోజుల్లో వెల్లడించనున్నట్లు గిన్నిస్ రికార్డు ప్రతినిధులు తెలిపారు. 2019లో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళా లో 10 వేల మంది పారిశుధ్య కార్మికులు పాల్గొని గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ రికార్డును బ్రేక్ చేయబోతున్నారు. పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13న ప్రారంభమైన ఈ మహాకుంభమేళా.. ఫిబ్రవరి 26న శివరాత్రితో ముగియ నుంది. దాదాపు 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కోట్లాదిగా తరలివచ్చారు. అక్కడ గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 63 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమ స్నానం ఆచరించారు. శివరిత్రి చివరిరోజుతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. మొత్తంగా మహాకుంభ మేళాతో ప్రపంచం దృష్టిని భారత్ ఆకర్శించిందనడంలో సందేహం లేదు.

# శివుడు అభిషేక ప్రియుడు

- జాగరణం శివరాత్రి ప్రత్యేకం
- ఏడాదికి ఒక్కరోజైనా శివార్చన చేస్తే ముక్తి

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి25( వెలుతురు):**
శివుడు అభిషేక ప్రియుడే గాకుండా.. అలాగే బిల్వదళ ప్రియుడు. శివుడు ఎలా పిలిచినా అనుగ్రహిస్తాడని అందుకే భోళాశంకరుడని పురాణాలు కూడా చెబుతున్నాయి. అందుకే అభిషేకాలు, బిల్వార్చనలను శివరాత్రినాడు విధిగా చేస్తుంటారు. పరమశివుడు లింగాకారంలో పుట్టినరోజు కావడంచేత శివుడికి ఇష్టమైన ఆ రోజున శివపూజ జరపడం మంచిదని శైవం చెబుతోంది. త్రిమూర్తులలో మూడోవాడు శివుడు. బ్రహ్మ సృష్టికర్త. విష్ణువు సంరక్షకుడు. మహాశివరాత్రి వ్రతాచరణను గురించి లింగ పురాణం పేర్కొంటోంది. వ్రత ఉద్యాపన గురించి స్కందపురాణంలో వివరంగా ఉంది. శివరాత్రి నాడు పగలంతా ఉపవాసం, రాత్రిపూట లింగార్చన, జాగరణం చేస్తారు. లింగార్చన తరువాత పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం చేయడం కూడా ఓ అలవాటుగా వస్తోంది. శివరాత్రులు అయిదు రకాలు. అవి.. నిత్య శివరాత్రి, పక్ష శివరాత్రి, మాస శివరాత్రి, మహాశివరాత్రి, యోగశివరాత్రి. నిత్యశివరాత్రి అంటే ప్రతిరోజూ రాత్రిపూట చేసే శివారాధన. పక్ష శివరాత్రి అంటే ప్రతి పదిహేను రోజులకొకసారి శివార్చన కోసం నిర్దేశిరచిన రాత్రి. మాసశివరాత్రి అంటే ప్రతి మాసంలోనూ శివపూజకు ఉద్దేశించిన రాత్రి. మిగతా శివరాత్రులు ఏవి కుదిరినా కుదరకపోయినా ఏడాదికొకసారి వచ్చే మహాశివరాత్రినాడు శివపూజ చేయడం పుణ్యప్రదం. తెలిసైనా, తెలియకైనా కొన్ని నీళ్ళు శివలింగం మీద పోసి మరికొన్ని మారేడు దళాలు ఆ శివలింగంమీద పెడితే భోళాశంకరుడు పరవశించి అలా చేసినవారిని అనుగ్రహించిన కథలు ఎన్నెన్నో మన పురాణాల్లో కనిపిస్తున్నాయి. శివరాత్రినాటి లింగోద్భవ సమయంలో చేసే అభిషేకాలలో కూడా కొన్ని నియమాలున్నాయి. రాత్రి జాగరణం చేస్తూ నాలుగు జాములలోనూ నాలుగు సార్లు నాలుగు రకాలుగా అభిషేకాలు చేస్తుంటారు. మొదటి జాములో పాలతో అభిషేకించి, పద్మాలతో పూజచేసి పెసర పప్పు, బియ్యం కలిపి పులగం వండి శివుడికి నైవేద్యం పెడతారు. రుగ్వేద మంత్ర పఠనం జరుపుతారు. రెండో జాములో పెరుగుతో అభిషేకం, తులసీ దళార్చనచేసి, పాయసం నైవేద్యంపెట్టి యజుర్వేద మంత్రాలను చదువుతారు. మూడోజాములో నేతితో అభిషేకించి, మారేడు దళాలతో అర్చించి, నువ్వుల పొడి కలిపిన తిను బండారాలను నివేదిస్తారు. సామవేద మంత్రపఠన చేస్తారు. నాలుగో జాములో తేనెతో అభిషేకంచేసి నల్ల కలువలతో పూజించి అన్నం నివేదిస్తారు. అధర్వణ వేద మంత్రాలను చదువు తారు. ఇలా అభిషేకాలు



చేసే శక్తిలేనివారు అభిషేకం చేసేటప్పుడు శివదర్శనం చేసుకున్నా పుణ్యమే నంటారు. నాలుగో జాము ముగిశాక ఉదయంపూట శివుడిని ఊరేగిస్తారు. ఇలా ఊరేగించడం వెనుక ఓ సామాజిక అంతరార్థం ఉంది. అందుకే భక్తులు శివరాత్రి రోజు అభిషేకం చేసి జాగారం చేయడం ఆనవాయితీగా వస్తోంది. శివుడు మిగతా దేవతలతో పోలిస్తే సులువగా అనుగ్రహం ఇస్తాడని నమ్మిక. శివనామంతో సర్వపాపాలు హరించుకుని పోతాయని అంటారు. అందుకే మనదేశంలో అనే శైవాలయాలు ప్రత్యేకతను సంతరించు కున్నాయి. శివుడు లయకారకుడు. శివారాధకులకు మహాశిరాత్రి పర్వదినం. ఉపవాసం ఈ పండగ ప్రత్యేకత. శివుడు భోళా శంకరుడు కావడంతో అడకుండానే వరాలిచ్చే దేవుడుగా ప్రతీతి. శివరాత్రి రోజు ఉపవాసంతో... రాత్రి అభిషేకించి జాగారం చేస్తే ముక్తి లభిస్తుందని ఆర్యోక్తి. అందుకే శివరాత్రి జాగారాలకు ప్రాధాన్యం ఉంది. ఈశాన సంహిత ప్రకారం శివుడు అర్ధరాత్రి సమయంలో తేజోలింగంగా ఆవిర్భవించాడు. అదే లింగోద్భవ కాలం. మహాశివరాత్రి మాఘమాసం కృష్ణపక్షంలో అర్ధరాత్రి ఉండే చతుర్దశి తిథినాడు వస్తుంది. చతుర్దశి ఈతిథి శివుడికి ఎంతో ప్రీతికరమైంది. అందులోనూ కృష్ణచతుర్దశి అంటే అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి తిథి మరీ ప్రీతికరమైంది. ఆ కారణంగానే ప్రతి మాసంలోనూ వచ్చే కృష్ణచతుర్దశి తిథులు మాసశివరాత్రులుగా ఉంటాయి. సంవత్సరం లోని పన్నెండు శివరాత్రులలో మాఘమాసంలో వచ్చే శివరాత్రి శివుడికి బాగా ఇష్టమైంది కాబట్టి దాన్ని మహాశివరాత్రి అని అంటారు. కాశితో పాటు జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరుపుతారు. వినాయక చవితి, శ్రీరామ నవమి లాంటి పండుగలలో దేవుళ్లను పగటిపూట పూజిస్తారు. శివరాత్రినాడు శివుడిని రాత్రిపూట మాత్రమే పూజించడం, మిగిలిన పండుగలలా పంచభక్ష్య పరమాన్నా లతో కాక ఉపవాస దీక్షతో శివరాత్రి పండుగను జరుపుకోవడం ఓ విశేషం. యోగి అయినవాడు తన యోగబలం చేత యోగనిద్రలోకి వెళ్లే రాత్రిని యోగ శివరాత్రి అని అంటారు. సాధారణంగా రాత్రిపూట దేవీపూజను, పగటిపూట దేవపూజను చేయడం ఒక ఆచారంగా ఉంటుంది. కానీ శివరాత్రి విషయంలో మాత్రం ఇది భిన్నంగా కనిపిస్తుంది. శివరాత్రి రోజున రాత్రిపూటే శివపూజ జరుగుతుంది. ఇలా శివ ఆరాధన రాత్రిపూట జరగడానికి ఓ కారణం కూడా ఉంది. పూర్వం ఓసారి ప్రళయం వచ్చినప్పుడు అంతా కటికచీకటిగా మారిపోయింది. ఆ సమయంలో లోక కల్యాణం కోసం పార్వతీదేవి శివుడిని గురించి తపస్సు చేసింది. ఆనాటి పార్వతి తపస్సు మెచ్చిన శివుడు ఆ చీకటిని పోగొట్టి మళ్లీ మామూలుగా రాత్రి, పగలు ఏర్పడేలా చేశాడు. దాంతో జీవులన్నీ మళ్లీ ఆనందించాయి. తాను చేసినట్లుగా అంత రాత్రివేళ శివుడిని గురించి పూజలు చేసినవారికి సర్వసుఖాలు కలిగేలా అనుగ్రహిం చమని పార్వతీదేవి శివుడిని ప్రార్థించింది. శివుడు అందుకు అంగీకరించాడు. పార్వతి చేసిన శివపూజకు గుర్తుగా ఆనాటి నుంచి మహాశివరాత్రి పూజా పర్వదినం ఏర్పడింది. ఎవరైనా ఏ కారణం చేతనైనా ఆలయాలకు వెళ్ళి శివదర్శనం చేసుకోలేకపోతే వారికి ఆ ఊరేగింపును చూసి పుణ్యం పొందే భాగ్యం కలుగుతుందని అంటారు.

# శ్రీకాళహస్తిలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

### శివరాత్రి దర్శనాలకు భారీగా ఏర్పాట్లు

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి25( వెలుతురు):**
శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని వేకువజామున రెండు గంటలకే సర్వదర్శనం ప్రారంభించాలని ముక్కంటి ఆలయాధికారులు నిర్ణయించారు. వేకువజామున ఒంటి గంటలకు లింగోద్భవ దర్శన ఏర్పాట్లు చేయనున్నారు. భవుడి మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ఇప్పటికీ ప్రధాన ఆలయాన్ని ముచ్చటైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. గోపురాలకు కొత్త రంగులద్దడంతో కళకళలాడుతున్నాయి. భక్తకన్నప్ప, రామసేతు వంతెనలపైనా, పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటు న్నాయి. అరటిచెట్లు, మామిడాకుల పచ్చతోరణాలు, కాషాయరంగు జెండాలతో వీధులు దర్శనమిస్తున్నాయి. తరలి వచ్చే భక్తుల కోసం ఆలయంలో చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. చతుర్మాడ వీధులు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికైన




ధూర్జటి కళాప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. సన్నిధివీధిలో ఏర్పాటు చేస్తున్న కైలాసం సెట్టింగ్ పనులు జోరందుకున్నాయి. రథాలు, నారద పుష్కరణిలోని తెప్పలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవ ఏర్పాట్లు ఆలస్యం కావడంతో, ఇప్పటికీ సాంస్కృతిక కార్యక్రమాల షెడ్యూలు ఖరారు కాలేదు. అయితే పలువురు పీఠాధిపతులు, సినీనటులు, గాయకులు, కళాకారులకు ఉత్సవాలకు రావాలని అధికారులు ఆహ్వానం పంపారు. సర్వజగత్తును పరిపాలించే.. సర్వ జగద్రక్షకుడైన సోమస్కంధమూర్తికి.. యాగరక్ష పెట్టాక పురవీధుల్లో ఊరేగింపునకు తీసుకెళ్లడం ఇక్కడి సంప్రదాయంగా వస్తోంది. బ్రహ్మోత్సవ రోజుల్లో ఉత్సవమూర్తులతో నిర్వహించే ఊరేగింపు మహోత్సవానికి ఎంతో ప్రాభవం ఉంటుంది. అందుకే సాధారణ రోజుల వలే కాకుండా.. బ్రహ్మోత్సవ రోజుల్లో.. దేవతామూర్తులు బయటకు వెళ్లాలంటే.. ఆలయంలోని యాగశాల వద్ద నిలిపి యాగరక్ష పెట్టాక మాత్రమే బయటకు తీసుకెళ్లడం సంప్రదాయంగా వస్తోంది. ఆలయంలోని అలంకార మండపంలో ఉత్సవ అలంకరణలు పూర్తయిన శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కంధమూర్తి ఉత్సవమూర్తులను యాగశాల వద్ద యాగకలశాలకు రోజూ హోమాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సిద్ధం చేసిన యాగరక్షను ఉత్సవర్లకు అద్దిన తరవాత.. వీళ్లను ఊరేగింపుగా తీసుకెళ్తుంటారు. ఈ విశేషోత్సవాన్ని సందర్శించేందుకు జనం అధిక సంఖ్యలో రావడం విశేషం. ఉత్సవాలను పురస్కరించుకుని గంగాభవానీ సమేత శివయ్య దశకంఠుడిపై పురవిహారం చేస్తాడు.

# కోటప్పకొండలో శివరాత్ర సందడి

- ప్రభలతో కొండకు చేరుకున్న భక్తులు
- దక్షిణామూర్తిగా విరాజిల్లుతున్న స్వామి

**గుంటూరు,ఫిబ్రవరి25( వెలుతురు):**
కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకుంది. కోటయ్య స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని కోటయ్య తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం శివరాత్రి దర్శనాలకు భారీగా ఏర్పాట్లు చేశారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ స్తంభించకుండా పోలీసు శాఖ చర్యలు తీసుకుంది. ప్రభుత్వం తరపున ఏటా తిరునాళ్ల రోజున పట్టు వస్త్రాలను అందజేస్తారు. సంప్రదాయానికి అనుగుణంగా ఈ ఏడాది స్వామికి ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలను దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమర్పించనున్నారు. తెల్లవారు జాము నుంచే వేలాదిగా భక్తులు కోటప్పకొండకు తరలి వచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహాశివరాత్రి రోజున శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొక్కుబడి ప్రభలతో భక్తులు కొండకు తరలివచ్చారు. నరసరావుపేట నుంచి చిన్నారులు కాలి నడకన ప్రభలతో కోటయ్య సన్నిధికి చేరుకున్నారు. శీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైనలను ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం క్యూలైనలో భక్తుల రద్దీ నెలకుంది. నరసరావుపేట పురపాలక సంఘం ప్రభ కోటప్పకొండకు చేరుకుంది. కొండ దిగువున తలనీలాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో రామ కోటిరెడ్డి, పాలక మండలి చైర్మన రామక్రిష్ణ కొండలరావు దేవస్థానం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోటప్పకొండ తిరుణాళ్లకు రాష్ట్ర పండుగ హోదా ఉండటంతో ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. నరసరావుపేట డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను కోటప్ప కొండకు నిర్వహిస్తున్నది. తిరునాళ్ళ రోజున నరసరావుపేట, చిలకలూరిపేట డిపోల నుంచి బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. దక్షయజ్ఞం అనంతరం ఈశ్వరుడు సతీ వియోగంతో ప్రశాంతత కోసం త్రికూటాద్రి (కోటప్పకొండ) పర్వతం పైన 12 ఏళ్లు వటుడిగా తపమాచరిస్తుండగా,



సదాశివుని అనుగ్రహం కోసం బ్రహ్మ, విష్ణు, సకల దేవతలు, రుషి పుంగవులు స్వామి కటాక్షం కోసం అక్కడ తపమాచరించి ప్రసన్నుడిగా స్వామిని దర్శించుకుని జ్ఞాన దీక్ష పొందారు. అందు వల్లే ఈ క్షేత్రం మహాపుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. బ్రహ్మచారి అయిన దక్షణామూర్తి క్షేత్రం కావడంతో ఇక్కడ కళ్యాణోత్సవాలు నిర్వహించరు. ధ్వజ స్తంభం కూడా ఉండదు. ఎటువైపు చూసినా మూడు శిఖరాలుగా కోటప్పకొండ కన్పిస్తుంది. అందుకే కొండపై వెలసిన స్వామికి త్రికూటేశ్వరుడు అని పేరు వచ్చింది. ఈ మూడు శిఖరాలకు బ్రహ్మ, విష్ణు, రుద్ర శిఖరాలు అని పిలుస్తారు. బ్రహ్మ శిఖరంపై బ్రహ్మ నివసించాడని ప్రతీతి. జ్యోతిర్లింగం ఈ ప్రాంతంలో లేకపోవటంతో బ్రహ్మ ఈశ్వరుని గురించి తపస్సు చేయగా అప్పుడు స్వామి ప్రత్యక్షమై బ్రహ్మ కోరిక తీర్చుటకు జ్యోతిర్లింగంగా వెలిశాడు. ఆ జ్యోతిర్లింగమే భక్తుల పూజలందు కుంటున్న కోటేశ్వర లింగం. కోటప్పకొండ వద్ద ఉన్న కొండకావూరులోని గొల్లభామ ఆనందవల్లి త్రికోటేశ్వరునికి పూజలు చేయగా ఈశ్వరుడు జంగందేవర రూపంలో ప్రత్యక్షమైనట్టు స్థల పురాణం చెపుతోంది. ఆనందవల్లి పాప వినాచన దూన వద్దకు వెళ్లి తీర్థం రుద్ర శిఖరానికి తెచ్చి జంగమయ్యకు అభిషేకాధిపూజలు చేసింది. ఆమెను పరీక్షించేం దుకు ఎన్ని విధాలా కష్ట పెడుతున్నప్పటికీ పూజలు మానినం దునే ఆనందవల్లి ఇంటికి వస్తాను, అక్కడే వ్రతం ఆచరించమని జంగమయ్య ఆమె వెనుకనే బయలుదేరాడు. ఎలాంటి పరిస్థితుల్లోను వెను దిరిగి చూడవద్దని చెప్పగా ప్రళయ ధ్వనులకు తాళలేక బ్రహ్మశిఖరం వద్ద వెను దిరిగి చూసింది. జంగమయ్య అక్కడే శిలగా మారాడు. ఆ చోటనే కోటేశ్వరాలయం నిర్మించ బడింది. ఈ ఆలయానికి దిగువ భాగాన గొల్లభామ శిలగా మారిన ప్రాంతంలో ఆనందవల్లి గుడి నిర్మించారు. విష్ణుశిఖరంలో దక్ష యజ్ఞంలో పాల్గొన్న దేవతలు, రుషులు పాప విమోచనం పొందిన పవిత్ర స్థలంలో పాప విమోచనేశ్వర స్వామి ఆలయం ఉంది. ఆరు వందల అడుగుల ఎత్తులో త్రికోటేశ్వర స్వామి దేవాలయం ఉంది. ఘాట్ రోడ్డు నిర్మాణంతో ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య నానాటికి పెరుగు తోంది. చారిత్రక త్రికోటేశ్వర ఆలయం క్రీస్తు శకం 1172 నాటికే ప్రసిద్ధి చెందినట్లు వెలనాటి చోళ రాజైన కుళొత్తుంగా చోళరాజు, సామంతుడు మురంగినాయుడు వేయించిన శాసనాల ద్వారా తెలుస్తోంది.

## మహా శివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు చేయండి...

- భక్తులకి ఎటువంటి ఇబ్బందులు రావొద్దు.
- దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు మంత్రి కొండా సురేఖ ఫోన్లో కీలక ఆదేశాలు



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:** మహా శివరాత్రి పండగ పర్వదినం నేపథ్యంలో అన్ని శైవ క్షేత్రాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను మంత్రి కొండా సురేఖ ఎండోమెంట్ శాఖ ఉన్నతాధికారులకి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు, రేపు మహా శివరాత్రి పర్వదినం జరగనున్న నేపథ్యంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే వేములవాడ, కాళేశ్వరం, కీసర రామలింగేశ్వర స్వామి, ఏడుపాయల వన దుర్గ భవానీ అమ్మవారు, రామప్ప, మేళ్ళచెరువు స్వయంభు శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం, చాయా సోమేశ్వర ఆలయం పానగళ్ళు, సోమేశ్వర దేవస్థానం పాలకుర్తి, వెయ్యి స్థంభాల గుడి, మెట్టుగుట్ట దేవాలయం, కాశిబుగ్గ ఆలయం, భద్రకాళి, తదితర దేవస్థానాల్లో అవసరమైన ఏర్పాట్లపై ఉన్నతాధికారుల నుండి మంత్రి కొండా సురేఖ వివరాలు ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం రుద్రాభిషేకం, సామూహిక బిల్వార్చన, రుద్ర హెూమం, ప్రవచనాలతో పాటు క్యూలైన్ మేనేజ్మెంట్, తాగునీరు వసతి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విద్యుత్ వసతి, వాహనాల పార్కింగ్, ఆరుబయట ప్రదేశాల్లో విద్యుద్దీపాల ఏర్పాటు, చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లు తదితర అంశాలపై మంత్రి ఎండోమెంట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని దేవాలయాలను సమన్వయం చేసేందుకు హైదరాబాద్ ఎండోమెంట్ కమిషనరేట్ ఆఫీసులో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశారా అని, అందుకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఎక్కడైనా... ఏదైనా ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో అన్ని దేవాలయాల్లో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిపేందుకు జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు.

## రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలి

- హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:** వచ్చేది ముస్లింల పండుగ సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్లోని షేర్ గేట్లో ఉన్న మైదాన్ గల్లి మజీద్ దగ్గర రోడ్డు శాంక్షన్ అవ్వడంతో వారు ఆ పనులను త్వరగా పూర్తిచేయాలని హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ గారిని కోరారు, దృష్టిలో పెట్టుకొని ఈరోజు కార్పొరేటర్ ప్రాంతానికి వెళ్లి కాంట్రాక్టర్ తో మాట్లాడి వెంటనే చేపించే చర్యలు చేపడతామని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జాకి, మన్సూర్ సోహెల్, సయ్యద్, మహమ్మద్, సలాం నదీమ్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## ఐ ఐ ఎం సి కళాశాలలో "ప్రాజెక్ట్ వర్క్ పై ఒక రోజు విద్యార్థి అభివృద్ధి సదస్సుకు అనూహ్య స్పందన "



**ఖైరతాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:** ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ కామర్స్ కళాశాల, ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైసెస్ సంయుక్తంగా 25 వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 2:00 గంటలకు లక్డికపుల్ లోని ఐ ఐ ఎం సి కళాశాల ప్రాంగణంలో "ప్రాజెక్ట్ వర్క్ పై అవగాహన సదస్సు"(డిగ్రీ ,పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు) ను ముఖ్య అతిథి గా విచ్చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సంస్థల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అదేవిధంగా కళాశాలలు కూడా జాతీయ విద్యా విధానం 2020 సూచించిన విధంగా సమాజ అవసరాలకు ఉపయోగపడే వివిధ రకాల సాంకేతిక కోర్సులను అందించాలి అన్నారు. హైదరాబాదులో ఉన్న అన్ని కళాశాలలోకెల్లా ప్రతినిత్యం విద్యార్థులతో ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహింపచేస్తూ వారిలో ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీస్తున్న కళాశాలలు ఒకటి ఐఐఎంసి అని, ఇంకొకటి ఐపిఇ అని తెలియజేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఐ పి ఇ డైరెక్టర్ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ ఐ పి ఇ ,ఐ ఐ ఎం సి కళాశాలలు సంయుక్తంగా గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులలో పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రాజెక్టు వర్క్ గైడెన్స్ పైన సదస్సును నిర్వహిస్తున్నాయి. సదస్సు కోఆర్డినేటర్ కృష్ణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో పరిశోధన పై అవగాహన కలిగించి ఉత్తమ పరిశోధనలు చేసే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని తెలియజేశారు. తదనంతరం కళాశాల ప్రిన్సిపల్ కూర రఘువీర్ అతిథులతో కలిసి పరిశోధనా విధానంతో కూడిన "ప్రాజెక్ట్ వర్క్ గైడెన్స్" అనే పాకెట్ డైరీ ని ఆవిష్కరింపజేశారు. సదస్సులో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొ.పాట్రిక్,ప్రొ. రంజిని,ప్రొ.నరేంద్రనాథ్,,ప్రొ. సత్యనారాయణ ,ప్రొ. కళ్యాణి, డా.స్వాతి, ఐ పి ఇ కి చెందిన ప్రొ. అనంత కుమార్ ప్రొ. రామకృష్ణ,, ప్రొ. చంద్రశేఖర్,ప్రొ. సింజు శంకర్ పరిశోధన విధానం, సమాచార సేకరణ ,సమాచార విశ్లేషణ, నివేదిక రూపకల్పన, పరిశీలనా గ్రంథాల క్రమం మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జంట నగరాలకు చెందిన 50 కళాశాల నుండి 800 పైగా విద్యార్థులు పాల్గొని పరిశోధన గురించి చాలా విషయాలు నేర్చుకున్నామని ఈ సదస్సు మా యొక్క ప్రాజెక్టు వర్క్ చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ఐ ఐ ఎం సి , ఐ పి ఇ వారి ఉచిత కిట్ , ఉచిత పాకెట్ ప్రాజెక్టు వర్క్ గైడ్,ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డా. తిరుమలరావు, డా. సంతోషి , అధ్యాపక ,అధ్యాపకేతర బృందం,స్టూడెంట్ కౌన్సిల్ విద్యార్థి సభ్యులు, విద్యార్థి నాయకులు పాల్గొని వారి యొక్క సహకారాన్ని అందించారు.

## జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:** జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ మంగళవారం రోజున మేయర్ విజయలక్ష్మి చేతులమీదుగా నియామక పత్రాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యొక్క పొజిషన్ కి రావడానికి సహకరించిన ముఖ్యమంత్రి ఇన్చార్జ్ మంత్రి పన్నెం ప్రభాకర్ దానం నాగేందర్ మరియు మేయర్ గద్వాల విజయలక్ష్మి గారికి ధన్యవాదాలు తెలపడం జరిగింది. వారు ఈ సందర్భంగా తనకోసం పనిచేస్తున్న ప్రతి ఒక్క కార్యకర్త మరియు హిమాయత్ నగర్ వాసులందరికీ ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది

# బీజేపీ నేతలు దిగజారి మాట్లాడుతున్నారు

## ఎంఎల్ సి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం ఖాయం : టీపీసీసీ చీఫ్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 25:** కరీంనగర్ డిసిసి కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డిసిసి అధ్యక్షుడు ,ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇతర ముఖ్య నేతలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు, ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కరీంనగర్ జిల్లా కి చెందిన వ్యక్తి ఇలాంటి దిగజారుడు మాటలు మాట్లాడితే కరీంనగర్ జిల్లా ఓటేసిన ప్రజలు బాధపడుతురన్నారు,బీసీ బిడ్డ గా మీకు కేంద్రంలో స్థానం రావడం మాకు సంతోషమే కానీ ప్రతి అంశంలో భారతదేశాన్ని పాకిస్తాన్ ను.హిందువు ముస్లిం లను ముడిపెట్టడం సరికాదన్నారు, ప్రతి ఎన్నికల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టడం అలవాటు అయింది దుబాయ్ లో ఇండియా పాకిస్తాన్ మ్యాచ్ లో భారత్ గెలిచింది ఆది హర్షించదగింది,అదేదో బీజేపీ గెలిపించినట్లు క్రికెట్ అంశాన్ని రాజకీయాలకు ముడిపెట్టడం సిగ్గుచేటు.పట్టభద్రుల ఎన్నికలు రాష్ట్ర స్థితిగతులు రాష్ట్ర అంశాలను అవగాహనతో ఓటు వేసే అంశం అని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు, బీజేపీ బీ ఆర్ ఎస్ పార్టీలు పదేళ్లుగా చీకటి లోపాయికారి ఒప్పందం మరోసారి బయటపడిందన్నారు, ఎన్నికల్లో అభ్యర్థిని పెట్టకుండా బీజేపీ కి మద్దతుగా నిలుస్తుంది బీ ఆర్ ఎస్ పార్టీ అంటూ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు ,నిన్న ఉమ్మడి నిజామాబాద్ ,కరీంనగర్ లో జరిగిన సమావేశాలు విజయ వంతం కావడంతో దిమ్మతిరిగి మాట్లాడుతున్నారు, మీరందరూ కలిసిన నరేందర్ రెడ్డి గెలుపు ఆపలేరని ధీమా వ్యక్తంచేశారు, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో తీసుకుంటున్న అభివృద్ధి సంక్షేమం కార్యక్రమాలు మీరు పది సంవత్సరాల్లో చేసిన దానిపై చర్చకు సిద్ధం అని అన్నారు,ఒక సంవత్సర కాలంలో 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామనీ చెప్పారు,మీరు 10 ఏళ్లలో 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు అని విమర్శించారు, ఇంకా ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామనీ ఆయన చెప్పారు, ప్రజలు విజ్ఞత తో ఆలోచించి ఓటు వేయాలని కోరారు,కేటీఆర్ ఫార్ములా ఈ రేసు అవినీతి పై అంశం పై బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు ఇవ్వలేదు అంటున్నారు.ఫోన్ ట్యాపింగ్ ఎంత తీవ్రమైన నేరం.కేంద్ర ప్రభుత్వం లో మీరు మంత్రిగా ఉన్నారు,ఎందుకు సీబీఐ విచారణ వేయలేదు.పోలీస్ అధికారులను తప్పించడానికి ఎవరు చూస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు, రాష్ట్ర ప్రభుత్వం పరిమితి తెలియదా అంటూ మండిపడ్డారు, విదేశాల్లో ఉన్న పోలీసులను ఎందుకు వెనక్కి తెప్పించడం లేదన్నారు,స్వతంత్ర భారతదేశంలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కుల గణన సర్వే చేశాం. సమగ్ర కుటుంబ సర్వే ఆఫీసియల్ కాదు.ఆది ఒక్క రోజులో చేసిన తప్పుల తడక అన్నారు,కేటీఆర్ 51 శాతం చూపించారు. నాలుగు కేటగిరి లు చూపించారు, మేము 56 శాతం బీసీ లు చూపెట్టాం.బండి సంజయ్ వాస్తవాలు తెలుసుకోకుండా



మాట్లాడుతున్నారని విమర్శించారు, మిగిలిన 3.1 శాతం కుటుంబాలు కూడా సర్వే చేస్తున్నాం , కేసీఆర్, కేటీఆర్ హరీష్ రావు లాంటి వారికి కూడా 28 వరకు అవకాశం ఇస్తున్నామనీ చెప్పారు,బండి సంజయ్ కేంద్ర మంత్రి గా ఉండి మాట్లాడుతున్న వాటికి ఖండిస్తున్నామన్నారు,గుజరాత్ గురించి మాట్లాడే బండి సంజయ్ తెలంగాణ అభివృద్ధి గురించి మాట్లాడరు అని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు,బండి సంజయ్, కిషన్ రెడ్డి కేంద్రం నుండి రావాల్సిన నిధులు ,మెట్రో రైల్ నిధులు , ఫోర్త్ సిటీ అంశం తదితర వాటిపై ఎప్పుడైనా నిధులు అడిగారా.బడ్జెట్ లో అన్యాయం జరుగుతుంటే ఒక్కసారైనా మాట్లాడారా? ఈనాడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు, మీరు కరీంనగర్ కోసం ఏం చేశారు. జిల్లా అభివృద్ధి కూడా పట్టదు. అడుగడుగున మత రాజకీయాలు చేస్తూ ఓట్లు అడగడమేనా మీ పని అని ఆయన ప్రశ్నించారు, కేంద్ర మంత్రి బండి సంజయ్,కిషన్ రెడ్డి లు రాష్ట్ర అభివృద్ధిలో మీ పాత్ర ఏంటి? కుల సర్వే పై మీ అభిప్రాయం ఏంటి? దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా కుల సర్వే చేసి విద్యా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్తుంటే 9 వ షెడ్యూల్ లో చేరుస్తామని ప్రధాని నీ ఒప్పించి 42 శాతం రిజర్వేషన్లకు తెస్తామని బీజేపీ నేతలు ఎందుకు చెప్తలేరని ప్రశ్నించారు,బీసీ ను అధ్యక్ష పదవి నుండి తొలగించి కిషన్ రెడ్డి నీ చేస్తే బీసీ లకు అన్యాయం జరగలేదా..? దానిపై బీజేపీ ఎందుకు సమాధానం చెప్పలేదని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు ,రెడ్డి ముఖ్యమంత్రి అయిన బీసీ కుల గణన చేసి 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధం చేస్తుండడం హర్షించదగినదా కదా..? అని ప్రశ్నించారు, బీసీ లను అణగదొక్కుతున్న బీజేపీ కి ఓటేస్తారా.? బీసీ లకు సర్వం చేస్తున్న కాంగ్రెస్ కి ఓటేస్తారా పట్టభద్రులు ఆలోచించాలన్నారు,సోషల్ మీడియా ను అనైతికంగా అబద్ధపు ప్రచారానికి ,వీడియోలను మార్ఫింగ్ చేయడానికి బీజేపీ విచ్చలవిడగ వాడుతుంది,ప్రజలు గమనించాలి బీఆర్ ఎస్ అభ్యర్థిని ఎందుకు పెట్టలేదు పట్టభద్రులు గమనించాలి..ఎవరికి సహాయానికి చేయడానికి



అభ్యర్థిని పెట్టలేదన్నారు, అభివృద్ధి పథంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయాణిస్తున్న సమయంలో జరుగుతున్న ఎన్నిక,ఏడున్నర లక్షల కోట్ల అప్పులు చేసిన తరువాత ఆర్థిక విధ్వంసం చేసిన గాడిలో పెడుతూ కార్యక్రమాలు చేస్తున్నామన్నారు, పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలి,అభివృద్ధి సంక్షేమం వైపు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రయాణిస్తుంది,జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయండి,మీ అందరి ఆశీర్వాదంతో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి మంచి మెజారిటీ తో గెలుస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు,పట్టభద్రుల సమస్యలు పరిష్కారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుంది 9 నెలల్లో 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం.. కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం లో చేసిన గ్రూప్ 1 ఉద్యోగాల తరువాత మళ్ళీ ఇప్పుడే చేస్తున్నాం రైతాంగం పరిశ్రమలు ,మహిళా అభివృద్ధితో ముందుకు పోతున్నాం. 11 ఏళ్లుగా ప్రధాన మంత్రి కేంద్రంలో ఉన్నారు, 2014 లో ఎన్నికల్లో శ్రీరామ చంద్రుడిని వాడుకు న్నారు. 5 ఏళ్ళు పాలన చేశారు. ఈదేశానికి ఏం చేశారు.. మళ్ళీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడిగారు.మేము భక్తులమే. మేము పూజలు చేస్తాం.ఉన్న ఉద్యోగాలు ఉడగొట్టారు.పేదోడిని కొట్టి పెద్దోళ్ళకే పెడుతున్నారని ఆయన ఆరోపించారు, అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ తక్కువగా ఉన్న మీరు పెట్రోల్ ధరలు తగ్గించలేదు,నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. మోదీ ప్రభుత్వం బీదవాల్లకి ఏం న్యాయం చేశారు,మీరు 11 సంవత్సరాలుగా ఏం చేశారో చెప్పక మళ్ళీ రాముడి పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారు. మేము ఎప్పుడూ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడగలేదని చెప్పారు, శ్రీరామ చంద్రుడు బీజేపీ పార్టీని ప్రారంభించినట్లు చేస్తున్నారు. ఈ దేశానికి మీరు ఏం అభివృద్ధి చేశారు. రూపాయి విలువ ఎందుకు పడిపోయింది.డాలర్ ఎందుకు ఆకాశాన్ని అంటు తుంది, హిందూ ముస్లిం పేరు లేనిది మీరు ఎన్నికలకు పోవడం లేదని మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయి లో విమర్శించారు, మత విద్వేషాలు రెచ్చగొడుతు న్నారు. ఎన్నికల్లో దేవుడిని తీసుకొచ్చి ఓట్లు అడిగే పద్ధతి బాగాలేదు.ఇది పట్టభ ద్రుల ఎన్నిక ఇందులో దేవుడి ప్రస్తావన రాకూడదు.క్రికెట్ కి ఎన్నికలకు ఏం సంబంధం దిగజారుడు రాజకీయాలు బండి సంజయ్ మానుకోవాలని ఆయన హితవు పలికారు,మీరు ఎన్ని చేసిన గెలవలేరు ,కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు ఖాయం అన్నారు,వచ్చే ఎన్నికల్లోపు మీ అందరితో శెభాష్ అనిపించేలా మా ప్రభుత్వ పాలన ప్రయా ణం ఉంటుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.




# మాదిగ అమరు వీరుల కుటుంబ సభ్యుల కాళ్లు కడిగిన మంత్రి

- శాసనసభ వేదికగా ప్రకటన చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిది:మంత్రి దామోదర్ రాజనర్సింహ

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 25:**

మాదిగ అమరవీరుల సంస్మరణ సభలో అమరవీరుల చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ.మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వయంగా మాదిగ అమరవీరుల కుటుంబ సభ్యుల కాళ్లు కడిగి ఘనంగా సన్మానించారు.ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అమరులైన 6గురు అమరవీరుల కుటుంబ సభ్యులకు ఒక్కో కుటుంబానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ.అమరవీరుల కుటుంబ సభ్యులతో ఆత్మీయ పలకరింపు మాదిగ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం అని మంత్రి దామోదర అన్నారు, సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చినగంట వ్యవధిలోనే రాష్ట్ర శాసనసభ వేదికగా ప్రకటన చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిది .ఎస్సీ వర్గీకరణ అమలు లో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొత్త చరిత్ర రాయబోతున్నాం. మాదిగ అమరవీరుల సంస్మరణ సభలో దామోదర్ రాజనర్సింహ వెల్లడి. హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో జరిగిన మాదిగ అమరవీరుల సంస్మరణ సభలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంస్మరణ సభలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన శాసనసభ్యులు కాలె యాదయ్య, వేముల వీరేశం, తోట లక్ష్మీకాంతారావు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, డాక్టర్. చంద్రశేఖర్, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్, మాజీ ఎంపీ పసునూరు దయాకర్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య, ప్రొఫెసర్ మల్లేశం, మాదిగ, మాదిగ అనుబంధ సంఘాల ఐక్యవేదిక చైర్మన్ మేడి పాపయ్య మాదిగ, చింత స్వామి మాదిగ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఎస్సీ కులాలో అసమానతల వల్లే



ఆందోళనలుమొదలయ్యాయన్నారు . హక్కుల సాధన కోసం సుదీర్ఘ పోరాటం జరిగిందన్నారు. ఈ పోరాటంలో అసువులు బాసిన అమరులకు ఈరోజు నివాళులు అర్పించుకున్నామని వెల్లడించారు. జాతి ప్రయోజనాల కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల కుటుంబాలకు, మాదిగలు జీవితాంతం రుణపడి ఉంటారన్నారు. ఎన్ని తరాలైనా అమరుల రుణం తీర్చుకోలేనిదని మంత్రి దామోదర్ రాజనర్సింహ కొనియాడారు. ఈ సందర్భంగా మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పుష్పాభిషేకం చేశారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించి 1నిమిషం మౌనం పాటించారు. అనంతరం మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వయంగా మాదిగ అమరవీరుల కుటుంబ సభ్యుల కాళ్లు కడిగి.. ఘనంగా సన్మానించారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను మంత్రి దామోదర రాజనర్సింహ ఇతర శాసనసభ్యులతో కలిసి అందజేశారు.హక్కుల కోసం జరిగే పోరాటాలకు రాజకీయ రంగు పూయకూడదన్నారు. మానవత్వంతో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. వర్గీకరణ విషయంలో అదే జరిగిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపలే వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో ప్రకటన చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కి దక్కిందన్నారు. మాదిగల పట్ల వారి నిబద్ధత, పేదల హక్కుల పట్ల చిత్తశుద్ధి కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రశంసించారు, సుప్రీంకోర్టు తీర్పునకు అనుకూలంగా, వెనుకబడిన వర్గాలకు న్యాయం చేసేలా అన్ని విధాల అధ్యయనం చేసిన తర్వాత ఏక సభ్య కమిషన్ నివేదిక ఇచ్చిందన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ. నివేదికలో వంకలు పెట్టడానికేం లేదన్నారు. వర్గీకరణపై అబద్ధాలు, మోసం, రాజకీయం కోసం విమర్శలు చేయొద్దని హితువు పలికారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ పై త్వరలో చట్టం చేస్తామన్నారు.



ఆ తర్వాత పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీ చేపడుతామని మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు.ఎస్సీ వర్గీకరణ అమలు లో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొత్త చరిత్ర రాయబోతున్నామన్నారు. మీకు ఎక్కడ అవసరమున్నా, ఏ ఆపదున్నా ఆదుకునే బాధ్యత మా ప్రభుత్వానిదిని భరోసా కల్పించారని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు,ఈ సంస్మరణ సభలో మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక ముఖ్య నాయకులు ముంజగల విజయకుమార్, మేరీ మాదిగ, సంగీతపు రాజలింగం, మేడి రమణ, దేవుని సతీష్ మాదిగ, గంధం రాములు, ప్రజా గాయకులు ఏపూరి సోమన్న, బుల్లెట్ రాజు మాదిగ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఎంఎల్ సి ఎన్నికల ప్రచారం లో పాల్గొన్న ఎల్ బి నగర్ బిజెపి ముఖ్య నేతలు



**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 25:**

ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, అదిలాబాద్, మెదక్, జిల్లాల పట్టభద్రుల మరియు ఉపాధ్యాయ ఎన్నికల సందర్భంగా నిజామాబాద్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పాల్గొన్నారు, అలాగే ఈ కార్యక్రమం లో ఎన్నికల ప్రచారం లో భాగంగా హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ,రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ,బి ఎన్ . రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ,మల్కాజ్ గిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ ,జిల్లాఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్ ,జిల్లా నాయకులు జంజ్య నాయక్ , హయత్ నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి , ఇతర నాయకులు పాల్గొన్ని బీజేపీ ఎంఎల్సీ అభ్యర్థులకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు.

## మెట్రో వాటర్ వర్క్స్ ఎం డి ని కలిసిన ఎల్ బి నగర్ ఎమ్మెల్యే

- నియోజక వర్గంలో ఉన్న సమస్యల పై వినతి



**వెలుతురు, ఎల్ బి నగర్, ఫిబ్రవరి 25:**

రంగారెడ్డి జిల్లా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మెట్రో వాటర్ వర్క్స్ ఎం.డి. అశోక్ రెడ్డి ని మంగళ వారం నాడు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.దీనిలో భాగంగా నియోజకవర్గానికి దాదాపు 10 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదించారు. ముఖ్యంగా చింతలకుంట ఎల్.పీ.టీ. మార్కెట్ వెనుక నుంచి సరస్వతి నగర్ వరకు నూతన యూజీడీ పైప్‌లైన్లు వేయాలని కోరారు. ఈ పైప్‌లైన్ల ఏర్పాటు వల్ల చుట్టుపక్కల కాలనీవాసులకు మేలు కల్గు తుందని తెలిపారు.అలాగే, బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గౌతమి నగర్ కాలనీ మరియు సాహెబ్ నగర్ వీకర్ సెక్షన్ ప్రాంతాల్లో దాదాపు 30 సంవత్సరాల క్రితం అమర్చిన యూజీడీ పైప్‌లైన్ల స్థానంలో కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. అంతేగాక, సాహెబ్ నగర్ అజ్మయ్యగూడ ప్రాంతంలో కూడా నూతన పైప్‌లైన్లు వేయాల్సిన అవసరం ఉందని ఎ మ్మెల్యే సుధీర్ రెడ్డి తెలిపారు. ఈ ప్రధాన పనులను తొలుత పూర్తి చేసి, మిగతా పనులను దశలవారీగా పూర్తి చేయాలని అభ్యర్థించారు. దీనిపై మెట్రో వాటర్ వర్క్స్ ఎం.డి. అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించి, అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఎం.డి. కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, ఎల్.బి.నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగ అధ్యక్షుడు రవి ముదిరాజ్, జక్కిడి రఘువీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ల చోరీ కేసుల్లో ఓ వ్యక్తి అరెస్టు



**వెలుతురు, హయత్ నగర్, ఫిబ్రవరి 25:**


పలు రద్దీ ప్రాంతాల్లో భారీగా చోరీలను చేసిన ఓ వ్యక్తి రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ పోలీస్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం ఇది, అయితే ఈ చోరీ కేసు కు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే రద్దీ ఎక్కువగా ఉండే పలు చోట్ల సెల్ ఫోన్ దారుల నుంచి సెల్ ఫోన్లు చోరీకి పాల్పడే ముగ్గురి వ్యక్తుల ముఠా సభ్యులు వీరు 63 మంది నుంచి పలు రకాల ఫోన్లు చోరీ చేశారు,అలాగే 8 రకాల బేసిక్ ఫోన్లు కూడా చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు, వీరినుంచి వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హయత్ నగర్ సీఐ పల్సా నాగరాజు గౌడ్ తెలిపారు, ముగ్గురు వ్యక్తులల్లో ఒకరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామని సీఐ నాగరాజు గౌడ్ వెల్లడించారు, ముగ్గురు సభ్యులతో కూడిన ముఠా సభ్యులు కూరగాయల మార్కెట్లు, హొటళ్లు, షాపింగ్ మాల్స్, బస్టాండ్లలో సెల్ ఫోన్లను చోరీలను చేసే వారని సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు,


## చిన్నారులను కిడ్నాప్ చేసి విక్రయించే ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు




**వెలుతురు, ఎల్ బి నగర్ , ఫిబ్రవరి 25:**

గుజరాత్ నుంచి హైదరాబాద్ నగరానికి అప్పుడే పుట్టిన శిశువు లను దొంగిలించి విక్రయించే 11 మంది సభ్యుల ముఠా ను పోలీసులు పట్టుకున్నారు, ఈ ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసుల వివరాల ప్రకారం అప్పుడే పుట్టిన చిన్నారులను కిడ్నాప్ చేసి అక్రమ రవాణా చేసి అమ్ముతున్న ముఠా సభ్యులను మల్కాజ్ గిరి ఎస్ ఓ టి,చైతన్య పురి పోలీసులు కలిసి అక్రమ ముఠాను అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కిడ్నాపర్ల నుండి నలుగురు చిన్నారులను ,5 వేల రూపాయల నగదు,11 మొబైల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు,కిడ్నాపర్లు అమ్మదాబాద్ నుంచి హైదరాబాద్ కు తరలిస్తు ఇక్కడ చిన్నారులను అమ్మకాలు చేస్తున్నారని తమకు అందిన పక్కా సమాచారం మేరకు కిడ్నాపర్ల ను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు



# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు మూడు స్థానాలు కేటాయించాలి

*ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి విజ్ఞప్తి చేసిన బీసీ నేత లింగంగౌడ్*



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:** మార్చి 20న జరిగే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 29న ఐదు ఎమ్మెల్సీ ల పదవీకాలం ముగుస్తుందన్న కాంగ్రెస్ పార్టీకి నాలుగు ఎమ్మెల్సీలు దక్కే అవకాశం ఉంది కాబట్టి జనాభాలో 50% పైగా ఉన్నటువంటి బీసీలకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించి నిజంగా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని నిరూపించుకోవాలని జాజుల అన్నారు. టిఆర్ఎస్ పార్టీకి ఒక ఎమ్మెల్సీ స్థానం దక్కే అవకాశం ఉన్నందున ఆ స్థానాన్ని బీసీలకు ఇచ్చి టిఆర్ఎస్ పార్టీ కూడా బీసీల పక్షపాతాన్ని నిరూపించుకోవాలని లింగంగౌడ్ పేర్కొన్నారు. జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో బీసీలకు సమన్యాయం దక్కాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కూర శ్రీనివాస్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గోదా రవీందర్ పాల్గొన్నారు.

# మల్లికార్జున స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం...



**కూకట్ పల్లి ఫిబ్రవరి 25 వెలుతురు:** మల్లికార్జున స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ కళ్యాణి నగర్, ఫతేనగర్ డివిజన్ లోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి ఆలయం, కూకట్ పల్లి లోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానంలలో నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీల ఆహ్వానం మేరకు మంగళవారం ఆయన ముఖ్య అతిధిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛరణలతో మధ్య అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సత్యం శ్రీరంగంని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పుష్పారెడ్డి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ హరిచంద్, మాజీ కార్పొరేటర్ కృష్ణగౌడ్, కంచి మహేందర్, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు కుక్కల రమేష్ ముదిరాజ్, కూకట్ పల్లి డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్, రాజు ముదిరాజ్, బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ లు నరసింహారావు, నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు వరహాల స్వామి, గుండ జ్యోతి, భాస్కర్, వెంకట్ రావు, శారద, శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాట్టే ప్రసన్న కుమార్, మహేందర్, శేఖర్ గజానంద్, హేమంత్, రాము గౌడ్, ప్రసన్న, భక్తులు, స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ రోజు ప్రైవేటు స్కూల్స్, కాలేజీలకు సెలవు ఇవ్వండి

- బండి సంజయ్ కుమార్ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి

**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 25:**



ఈనెల 27న గ్రాడ్యుయేట్స్ ఎన్నికలకు సంబంధించి విలువైన ఓటు హక్కును వినియోగించుకునేందుకు పట్టభద్రులు అందరికీ అవకాశాన్ని కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ క్యాజువల్ లీవ్ ను మంజూరు చేసింది. కానీ చాలా కళాశాలల్లో, పాఠశాలల్లో ఓటు హక్కు కలిగిన సిబ్బందికి కొన్ని గంటలు మాత్రమే పర్మిషన్ ఇస్తామని చెబుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. కచ్చితంగా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు యాజమాన్యాలు ఓటు కలిగిన సిబ్బందికి రోజంతా సెలవు దినాన్ని ప్రకటించాలి. వారికి ఏడాదిలో అందించే సిఎల్ లకు వీటికి సంబంధం లేకుండానే అదనంగా పోలింగ్ రోజు సెలవు దినంగా అవకాశాన్ని ఇవ్వాలి. ఎక్కడైనా పట్టబద్రులు సిబ్బందికి ఉన్నచోట ఇబ్బంది కలిగిస్తే నేరుగా బిజెపి నాయకులకు కార్యకర్తలకు ఫిర్యాదు చేయండి. మీ పేరు గోప్యంగా ఉంచుతాం. ఆ కళాశాల యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకుంటాం. ఓటు ప్రజాస్వామ్యం కలిగించిన హక్కు. దాన్ని వినియోగించుకునే హక్కు మీకే ఉంది. ఆపే అధికారం ఎవరికి లేదు. బండి సంజయ్ కుమార్ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి.

# ఘనంగా స్వపరి పాలన దినోత్సవ వేడుకలు

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 25**



మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో మంగళవారం స్వపరి పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి తమ ప్రతిభను కనబరిచారు .ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు వాజిద తబస్సుమ్, ఉపాధ్యాయురాలు మెహరాజ్ ఫాతిమా, బహుమతులను ప్రధానం చేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిగా రఫియా, మండల విద్యాధికారిగా అబ్దుల్ రెహమాన్, ప్రధానోపాధ్యాయురాలిగా ఆతిఫాలు , అనస్ ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైకోర్టులో పిటిషన్ వేసి సీబీఐ విచారణ జరిపించాలని కోరితే ప్రభుత్వం ఒప్పుకోని విషయం నిజం కాదా?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాతే ప్రభాకర్ రావు, శ్రవణ్ విదేశాలకు పారిపోయారు...

మీరు వాళ్లను అరెస్ట్ చేయకుండా పారిపోయేలా చేసిందే మీరు

మీరు విదేశాలకు పంపిస్తే...మేం పట్టుకురావాలా?

కేసీఆర్ చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశామని పోలీసులు చెప్పిన తరువాత కూడా ఆయనకు కనీసం నోటీసు కూడా ఎందుకియ్యలే?

కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే సాహసం కూడా చేయలేని అసమర్థులు మీరు

ఫాంహౌజ్ డ్రగ్స్ లో కేటీఆర్ ఉన్నాడని చెప్పింది రేవంత్ రెడ్డే కదా?

విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక ఇచ్చి 3 నెలలైనా ఇంతవరకు ఎందుకు బయటపెట్టలేదు?

ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ వల్లే ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైందని సీఎం హెూదాలో రేవంత్ రెడ్డే చెప్పారు.. ఎందుకు అరెస్ట్ చేయలేదు?

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏడాదిగా విచారణ కమిషన్ గడువును పొడిగిస్తున్నారే తప్ప కేసీఆర్ ను ఎందుకు విచారించలేదు?

మీరు విచారణ చేస్తూ కేంద్రం ఎందుకు పట్టుకురావడం లేదంటే ఏమనాలి?

మీకు దమ్ముంటే సీబీఐ విచారణ కోరండి... కేసును సీబీఐకి అప్పగించండి

దోషులందరినీ అరెస్ట్ చేసి బొక్కలో వేస్తాం....

యమునా, గంగా, సబర్మతి ప్రక్షాళనకు అతి తక్కువ ఖర్చుతో చేశారు...

కాంగ్రెస్ అగ్రనేత అల్లుడి కోసం రూ.15 వేల కోట్ల ఖర్చయ్యే మూసీ ప్రక్షాళనను రూ.1.5 లక్షలకు పెంచి కమీషన్లు దొబ్బాలనుకుంటే కేంద్రం ఎందుకు సహకరించాలి?

తెలంగాణ నుండి రూపాయి వెళితే 42 పైసలే కేంద్రం ఇస్తోంది... బీహార్, యూపీలకు ఎక్కువ ఇస్తున్నారని చెప్పడమేంది?

వెనుకబాటు ఆధారంగా కేంద్రం ఆయా రాష్ట్రాలకు నిధులను పంపిణీ చేస్తున్న విషయం మీకు తెలిసి ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టాలనుకుంటున్నారా?

తెలంగాణ రెవిన్యూలో అత్యధిక షేర్ హైదరాబాద్ దే.... కానీ ఆదిలాబాద్, ములుగు వంటి వెనుకబడిన జిల్లాలకు అధిక నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది? అట్లని హైదరాబాద్ కు అన్యాయం చేసిందని అనుకోవాలా?

యూపీఏ 10 ఏళ్ల పాలనలో 2.94 కోట్ల ఉద్యోగాలను మాత్రమే సృష్టించింది

మోదీ 10 పాలనలో 17 కోట్ల 19 లక్షల ఉద్యోగాలను సృష్టించింది నిజం కాదా?

రెండేళ్లలోనే రోజ్ గార్ మేళా పేరుతో 9 లక్షల 25 వేల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది నిజం కాదా?

ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తానన్నవ్...ఎటు పోయింది?

తెలంగాణ అభివృద్ధిలో కేంద్రం ఏం చేసింది? రాష్ట్రం ఏం చేసిందనే విషయంపై గ్రామాల వారీగా లెక్కలతో సహా చర్చకు సిద్ధం

మేం సవాల్ చేస్తే సీఎం తోకముడిచారు

ఎమ్మెల్సీ ఎన్నికల క్రికెట్ మ్యాచ్ లో బీఆర్ఎస్ జట్టే లేదు... ఆ టీంకు సభ్యులే లేక మ్యాచ్ నుండి వైదొలగింది

వరి వేస్తే ఉరేనని కేసీఆర్ అంటే.... రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కూడా వరి వేయుద్దు... వేస్తే నష్టపోతారని రైతులను హెచ్చరిస్తున్నారు... మీకు, బీఆర్ఎస్ పాలనకు తేడా ఏముంది?

ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడ్డా నీటి కటకట ఎందుకొచ్చింది?

మీ అసమర్థత, పొరుగు రాష్ట్రానికి నీటిని దోచిపెట్టడంవల్లే ఈ దుస్థితి వచ్చింది

ప్రధాని మోదీని పెద్ద బీసీ, నన్ను చిన్న బీసీ అంటూ బీసీ సమాజాన్ని అవమానిస్తవా?

మోదీ బీసీయే కాదని చెప్పిన ముఖ్యమంత్రే... ఇయాళ పెద్ద బీసీ అంటున్నారు

ఎమ్మెల్సీ ఎన్నికలకు వస్తుంటే...రూ.4 వేల నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాల భర్తీ, ఉద్యోగులకు డీఏలు, జీపీఎఫ్ సొమ్ము, రిటైర్డ్ బెన్ ఫిట్స్, ఫీజు రీయంబర్స్ బకాయిలపై ప్రకటన చేస్తారని ఆశపడ్డ పట్టభద్రులు, ఉద్యోగులను నిరాశకు గురి చేసినవ్

ఉద్యోగులకు ప్రతినెలా జీతం ఇవ్వడం మీ బాధ్యత... వాళ్లు పనిచేస్తేనే జీతాలిస్తున్నవ్ కదా... ఏదో బిచ్చమేస్తున్నట్లు మాట్లాడతారా?

6 గ్యారంటీలు సహా మేనిఫెస్టో హామీలన్నీ అమలు చేశారని భావిస్తే... ఆ పార్టీకే ఓటేయండి

మీ సమస్యలపై నిరంతరం పోరాడుతూ సర్కార్ మెడలు వంచేది బీజేపీయే అనుకుంటే మాకు మద్దతివ్వండి



మీకు ఏ కష్టమొచ్చినా బీజేపీ అండగా ఉంటుంది

ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిల ఇప్పించేలా మీతరపున కొట్లాడుతోంది బీజేపీయే

కాంగ్రెస్ కు ఎందుకు ఓటేయాలి? 14 నెలల్లో మీరు ఒరగబెట్టిందేమిటి?

2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయనందుకా? నిరుద్యోగ భృతి ఇవ్వనందుకా?

మహిళలకు నెలనెలా రూ.2500లు ఇవ్వనందుకా? తులం బంగారం, స్కూటీ ఇవ్వనందుకా?

రైతు భరోసా ఎగ్గొట్టినందుకా? 20 లక్షల మందికి రుణమాఫీ ఎగ్గొట్టినందుకా?

విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు ఇవ్వనందుకా? ఉద్యోగ, ఉపాధ్యాయులకు 5 డీఏలియ్యనందుకా? పెన్షన్ పైసలు ఇయ్యనందుకా?

దాచుకున్న జీపీఎఫ్ పైసలను కూడా ఇయ్యనందుకా?

లిఆఖరికి రిటైర్డ్ మెంట్ బెన్ ఫిట్స్ ఇవ్వకుండా ఉద్యోగులను రోడ్డున పడేస్తున్నందుకు మీకు ఓటేయాలా?

బీజేపీకి ఓటేస్తే ప్రతిరోజు మీ పక్షాన కొట్లాడతాం... ప్రభుత్వ మెడలు వంచి మీ సమస్యలను పరిష్కరించేలా చేస్తాం...

నన్ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి తొలగించి బీసీలకు అన్యాయం చేశారనడం అబద్ధం

నాకు జాతీయ ప్రధాన కార్యదర్శిని చేసి, కేంద్ర మంత్రి పదవి బాధ్యతిచ్చి ప్రమోషన్ ఇచ్చింది

కాంగ్రెస్ పాలన బాగుందని విర్రవీగుతున్న సీఎంకు సవాల్ చేస్తున్నా....

మీ 14 నెలల పాలనపై ఎమ్మెల్సీ ఎన్నికలే రెఫరెండంగా తీసుకుందామా?

కాంగ్రెస్ ఓడిపోతే ముక్కు నేలకు రాసి సీఎం పదవి నుండి తప్పుకుంటారా?

దమ్ముంటే నా సవాల్ ను స్వీకరించాలి

కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 25:

# 14 నెలలుగా నిరుద్యోగ భృతి ఇవ్వనోళ్లు పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తారా..?

- కాంగ్రెస్ సర్కార్ ఒక్కో నిరుద్యోగ పట్టభద్రునికి రూ.54 వేలు బాకీ చెల్లించాల్సి ఉంది..
- నిరుద్యోగ భృతి ఇవ్వకున్నా కాంగ్రెస్ కు ఓటు వేస్తే పట్టభద్రుల సమస్యలను గాలికి వదిలేస్తుంది.
- గత బిఆర్ఎస్ అడుగుజాడల్లోనే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది..
- నిరుద్యోగ పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కి గుణపాఠం చెప్పాలి.
- బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి..
- బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్....



**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 25:** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల్లో భాగంగా నిరుద్యోగుల కు ప్రతి నెల రూ 4 వేలు అందిస్తామని హామీ ఇచ్చి నేడు నిరుద్యోగులందరిని మోసం చేసిందని , నిరుద్యోగుల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం 14 నెలలైనా నిరుద్యోగ భృతి ఇవ్వలేని దుస్థితిలో ఉందని, ఒక్కో నిరుద్యోగికి రూ. 54 వేలు ప్రభుత్వం బాకీ పడిందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ లోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ భృతి ఇవ్వలేనోళ్లు నిరుద్యోగ పట్టభద్రుల సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, ఏటా జాబ్ క్యాలెండర్ లాంటి ప్రధాన అంశాలతో నిరుద్యోగ యువతీ యువకులను నిలువునా మోసం చేసిందన్నా రు. పట్టభద్రుల సమస్యల పట్ల గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని , అందుకే నేడు మొఖం లేక ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి కి వచ్చిందన్నారు. గత సీఎం కెసిఆర్ అడుగుజాడల్లోనేసీఎం రేవంత్ రెడ్డి నడుస్తున్నారని పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు . కాంగ్రెస్ పాలనలో పట్టభద్రులకు ఏ లాంటి న్యాయం జరిగే పరిస్థితి కనబడడం లేదన్నారు. నిరుద్యోగ సమాజానికి అండగా నిలిచి , పట్టభద్రుల సమస్య పరిష్కారం కోసం గళం విప్పింది , కొట్లాడింది , ఉద్యమించింది, కేవలం బిజెపి, బీజేవైఎం మాత్రమేనన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కేవలం బిజెపితోనే సాధ్యమన్నారు. అందుకే జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి అంజి రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఆనాడు 317 జీవో కు వ్యతిరేకంగా కొట్లాడి, ఉపాధ్యాయులకు అండగా నిలిచిన బిజెపికి నేడు ఉపాధ్యాయులు అందరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని , బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఈసందర్భంగా కోరారు. ఈకార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దురిశెట్టి సంపత్, రాష్ట్ర కార్యదర్శి యువ క్రాంతి, కార్యాలయం కార్యదర్శి అరవింద్,జిల్లా ఉపాధ్యక్షులు బోడ్డు అశోక్,గుండారపు సంపత్,తోట సాయి, అజయ్,సోషల్ మీడియా కన్వీనర్ ఉప్పారపల్లి శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి ఈసంపల్లి మహేష్, జోన్ అధ్యక్షులు పొన్నాల రామ్, శ్రీమంతుల అక్షయ్,తోట సతీష్ లు పాల్గొన్నారు..

## ప్రాచీన శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు



**సంస్థాన్ నారాయణపురం వెలుతురు ఫిబ్రవరి 25:** సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని శైవ క్షేత్రాలు అన్ని అత్యంత సుందరంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దారు. మహా శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు అయినా మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఉపవాస దీక్షలు ఉండి మహా శివుని ఆరాధిస్తారు ఆలయాల వద్ద ఉపవాస విరమణ కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. వారికోసం ఆలయ నిర్వాహకులు భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ప్రాచీన శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవాలయం (ప్రాచీన శివాలయం) వద్ద మహాశివరాత్రి 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం గణపతి పూజ, గౌరీ పూజ, చండీశ్వర, నందీశ్వర పూజలు, నవగ్రహ పూజలు, ఆంజనేయ స్వామి అభిషేకం తో పాటు రుద్ర హెూమం నిర్వహించడం జరిగింది. అలాగే సాయంత్రం గ్రామ మహిళల చేత కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అత్యంత పవిత్రమైన మహా శివరాత్రి పర్వదినం రోజున ఉపవాస దీక్ష విరమణలు , సాయంత్రం అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం జరుగును అనంతరం జాగారం లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉండును అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శివాలయ కమిటీ అధ్యక్షుడు పాలకుర్ల సతీష్ గౌడ్, గౌరవ అధ్యక్షులు పాలకూర గిరి గౌడ్, వీరమల్ల కేశవుల గుప్తా, పాలకూరల యాదయ్య గౌడ్ (సూర్య), ప్రధాన కార్యదర్శి సూరపల్లి జవహర్, సహాయ కార్యదర్శులు సోమనబోయిన కృష్ణ కుమార్ యాదవ్, సుర చినరాజయ్య, కోశాధికారి దూసరి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు దాచేపల్లి ఉమా శంకర్ గుప్తా, పట్నం రాములు గౌడ్, ప్రచార కార్యదర్శి గొల్లూరి శ్రీశైలం సాగర్, సభ్యులు పాశం కృష్ణ యాదవ్, పాలకొర్ల వెంకటేష్ గౌడ్, బద్దం లింగస్వామి రవి తదితరులు పాల్గొన్నారు.



# కె.పి.హెచ్.బి కాలని నూతన సిఐ కి శుభాకాంక్షలు తెలిపిన కూన సత్యం గౌడ్..




**కూకట్ పల్లి ఫిబ్రవరి 25 వెలుతురు:**
కె.పి.హెచ్.బి కాలని నూతన సిఐ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాజశేఖర్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూన సత్యం గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం తో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కె.పి.హెచ్.బి కాలని పిఎస్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడటం లో సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో కూన సాయి తేజ గౌడ్ పాల్గొన్నారు.

# డాక్టర్ లక్ష్మణ్ ని సన్మానించిన బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి



**రామన్నపేట వెలుతురు రేస్ ఫిబ్రవరి 25**
నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎన్నికల ప్రచారంలో, భాగంగా రాజ్యసభ సభ్యులు , డాక్టర్ లక్ష్మణ్ బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డి ,జిల్లా అధ్యక్షులు డాక్టర్ వర్షిత్ రెడ్డి . నకిరేకల్ ఇంచార్జ్ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య. స్టేట్ కౌన్సిల్ నెంబర్ వనం అంజయ్య . నకిరేకల్ మండల్ లోని పలు పాఠశాలలలో ఉపాధ్యాయులతో సమావేశమై బిజెపి అభ్యర్థి పులి సరోత్తం రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి బలపరచాలని కోరడం జరిగింది.

# ఘనంగా జరిగిన స్వపరిపాలన దినోత్సవం వేడుకలు



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 25**
మంగళవారం రోజున జిల్లా పరిషత్ హైస్కూల్ మునిపంపులలో స్వపరిపాలన దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఒక రోజు అధికారులు కలెక్టర్లుగా ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి అందరినీ ఆలరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా జనపాల మానస ,విద్యాశాఖ మంత్రిగా భాను కౌశిక్, కలెక్టర్గా ఆయేషా తనీమ్ , ఆర్డీవో గా సింధూర డీఈవోగా చరణ్ ,ఎమ్మెల్యేగా కార్తీక్, బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొడ్డి.స్వామి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవ స్ఫూర్తితో ఉపాధ్యాయులుగా అధికారులుగా వ్యవహరించి వారు పడినటువంటి ఇబ్బందులను మన పాఠశాల అవసరాలను గుర్తించి వాళ్లు కూడా క్రమశిక్షణతో, పట్టుదలతో మంచి చదువులు చదివి ఉన్నత వ్యక్తులుగా, ఉపాధ్యాయులుగా అధికారులుగా, ఉద్యోగాలు పొంది వారి సొంత గ్రామం ను ఆదర్శవంతంగా రూపొందించాలని తెలిపారు. ఈ దినోత్సవ వేడుకలలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకై ప్రచారం...



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**
జహీరాబాద్ పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్ ఆధ్వర్యంలో పట్టణంలోని బసవేశ్వర స్ట్రీట్ లో పట్టభద్రులను కలిసి 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి సి. అంజిరెడ్డికి వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి అరుణ కౌలాస్ బీజేపీ నాయకులు మంజుల కౌలాస్,సురేష్ పూరి జీవన్ జైన్, టేకూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు

# కొల్చారం వీరభద్ర ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు

**కొల్చారం, వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 25:**



మండల కేంద్రమైన కొల్చారంలోని పురాతన వీరభద్ర ఆలయంలో మహాశివరాత్రి పండుగ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, శివునికి అభిషేక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ అధ్యక్షులు ర్యాగల్ల ఆనంద్, అర్చకులు మహేశ్వర్ అప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ బుధవారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు ఉంటాయని, ఆసక్తి ఉన్న భక్తులు సతీసమేతంగా సామూహిక అభిషేక కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఉపవాస దీక్ష అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పండ్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉపవాస దీక్ష కూలిన భక్తులు ఆలయ ప్రాంగణంలో స్వామివారిని దర్శించుకుని ఉపవాస దీక్ష విరమించాలని కోరారు.

# మరకతశివలింగనామకరణ భక్తుడుఆలయ పునర్ నిర్మాణ శ్రీకారకుడు శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడుఆర్ నరేష్ కుమార్

*శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ మరకత సోమేశ్వర లింగాన్ని సేవిస్తే వ్యాధులు పోతాయని, సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం*

**శంకర్ పల్లి, వెలుతురు ఫిబ్రవరి 24**






**ఆలయ చరిత్ర**

మరకత లింగం ముదురు ఆకుపచ్చ రంగులో మెరిసిపోతూ ఉంటుంది. అరుదైన ఆ మరకత లింగం కొలువై ఉన్న చందిప్ప క్షేత్రానికి శతాబ్దాల చరిత్ర ఉంది. ముచుకుంద నది ఒడ్డున ఉంది క్షేత్రం. క్రీస్తు శకం 1076-1126 మధ్య పశ్చిమ చాళుక్య రాజు ఆరో విక్రమాదిత్యుడు ఈ లింగాన్ని ప్రతిష్ఠించాడని శాసనం ద్వారా తెలుస్తున్నది. క్రీ.శ.1101 సంవత్సరం కార్తిక శుద్ధ పంచమి.. గురువారం నాడు ప్రతిష్ఠ ఉత్సవం జరిగిందని అదే శాసనంలో స్పష్టంగా లిఖించారు. దాదాపు 920 ఏండ్ల చరిత్ర ఉన్న ఈ పురాతన శివాలయం కాలపరీక్షకులోనై శిథిలమైపోయింది. పదిహేనేండ్ల కిందట శంకర్ పల్లి కి చెందిన నరేష్ కుమార్ పూనుకొని పునరుద్ధరించారు. నూతన గర్భాలయాన్ని నిర్మించారు.

**ఆరోగ్య ప్రదాత**

పర్లిలోని వైద్యనాథ జ్యోతిర్లింగానికి, చందిప్ప మరకత లింగానికి చాలా పోలికలు ఉన్నాయని చెబుతారు పండితులు. చందిప్ప శివయ్యను పూజిస్తే పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. అసలే శివుడు అభిషేక ప్రియుడు. ఐదు సోమవారాలు కానీ, ఐదు పౌర్ణములు కానీ, ఐదు మాస శివరాత్రులు కానీ మరకత లింగాన్ని అర్చిస్తే సకల కోరికలూ నెరవేరుతాయని విశ్వాసం. పౌర్ణమినాడు లింగాభిషేకం చేసిన జలాలతో స్నానం చేసిన వారికి వైకుంఠప్రాప్తి తథ్యమని



చెబుతారు. అంతేకాదు బ్రాహ్మీ ముహూర్తంలో అభిషేకిస్తే పరమశివుడి కటాక్షం లభిస్తుందని స్థానిక ఐతిహ్యం.

**క్షేత్రపాలకుడు కాళ భైరవుడు**

ఈ ఆలయానికి కాలభైరవుడు క్షేత్ర పాలకుడు. ఆలయ ప్రాంగణంలో వెలిసిన కాలభైరవుడు ఆవరణను వెయ్యి కండ్లతో రక్షిస్తూ ఉంటాడని చెబుతారు. ఆదివారం కాలభైరవుడిని పూజిస్తే సమస్త గ్రహదోషాలూ తొలగిపోతాయని స్థల పురాణం. అంతేకాదు శివుడి కుమారుడైన సుబ్రహ్మణ్యస్వామి ఇక్కడ నాగుపాము రూపంలో సంచరిస్తూ ఉంటాడని ప్రతీతి. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఈ ఆలయం కొన్నేండ్ల కిందటి వరకూ నిరాదరణకు గురైంది. పండుగలప్పుడు తప్ప భక్తులు వచ్చేవారు కాదు. 2007లో శివరాత్రి నాడు తన పెద్దన్న శ్రీరాములు తెలపడంతో శంకర్ పల్లికి చెందిన నరేష్ కుమార్ (తండ్రి కీ.శే.సాయిలు) ఆలయంలో అభిషేకం చేశాడు. అప్పుడు శివలింగంపై ప్రసరించిన సూర్యకిరణాలు పరావర్తనం చెందడంతో దానిని మరకత లింగంగా గుర్తించాడు. తర్వాత చందిప్ప చరిత్ర తెలుసుకొని భక్తుల సహకారంతో ఆలయాన్ని పునరుద్ధరించాడు. శ్రావణం, కార్తిక మాసాల్లో ఇక్కడ విశేష పూజలు జరుగుతాయి. శివరాత్రి ఘనంగా నిర్వహిస్తారు. హైదరాబాద్ వాసులు వారాంతంలో వెళ్లిరావడానికి అనువైన క్షేత్రమిది. మానసిక ఒత్తిళ్లతో కూడిన జీవితంలో ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శన మనోబలాన్ని ప్రసాదిస్తుంది.

**ఎలా వెళ్లాలి?**

చందిప్ప క్షేత్రం హైదరాబాద్‌కు 48 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది . శంకర్‌పల్లి వరకు బస్సులో వెళ్లాలి. అక్కడి నుంచి చందిప్పకు ఆటోలు ఉంటాయి.

**దేవుడి మాన్యాలు**

చందిప్ప ఆలయానికి విక్రమాదిత్యుడి కాలంలోనే వందలాది ఎకరాలు మాన్యాలుగా సమర్పించినట్టు ఇక్కడి శాసనం తెలియజేస్తున్నది. ఆలయ నిర్వహణ, విశేష పూజలు, శివరాత్రి వంటి ఉత్సవాల నిర్వహణకు దాదాపు 254 ఎకరాలు కేటాయించినట్లు అందులో ఉన్నది. ఆలయానికి పశ్చిమ దిశలో 153 ఎకరాలు, తూర్పు దిశలో 2.20 ఎకరాలు, వరి పంట, పూలతోట కోసమని 54 ఎకరాలు, ఆలయ అర్చకులకు, నిత్యాన్నదానం కోసం మరిన్ని ఎకరాలు.. ఇలా అపారమైన మాన్యాలు ఉన్నాయి

**ఆలయమరతశిలింగనామకరణ భక్తుడు**

**ఆలయ పునః నిర్మాణ మాన శ్రీకారకారకుడు**



శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ కుమార్ అప్పట్లో ఈ గుడి అభివృద్ధి కోసం తన పాల దుకాణం నుండి పాలు, పెరుగు, తీసుకెల్లి భక్తులకు ఉచితంగా ఇచ్చి అభిషేకాలు చేయించేవాడు. అంతే కాక పూజారులకు, ప్రముఖులకు, భక్తులకు తన ఇంట్లో భోజనాలు కూడా చేయించారు. అలా నిరంతరం ఆయన సేవలను గుర్తించి భక్తి టీవి కోటి దీపోత్సవం లో రాష్ట్ర స్థాయి లో ధర్మకర్తగా అవార్డు అందుకోవడంతో ఈ ఆలయం రెండు రాష్ట్రాలకు సుపరిచతం అయ్యింది.

# 11వ సంవత్సరంలోకి అడిగిడుతున్న గ్రీన్ గ్రోవ్ యందు కల్చరల్ ఫెస్ట్

**వెలుతురు చౌటుప్పల్, ఫిబ్రవరి 25 :**
గ్రీన్ గ్రోవ్ పాఠశాల దశమ వార్షికాలు పూర్తిచేసుకుని 11వ సంవత్సరంలోకి అడిగిడుతున్న వేళ సోమవారం రోజున ఎస్ఎం రెడ్డి గార్డెన్స్ చౌటుప్పల యందు గ్రాండ్ గా కల్చరల్ ఫెస్ట్ నిర్వహించబడినది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ లక్ష్మీకాంత్ రెడ్డి గారు జనరల్ సెక్రెటరీ ధర్మ జాగరణ షా సంయోజక్ గారు, మండల విద్యాధికారి శ్రీ గురువా రావు గారులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యా విధానం ఏ విధంగా ఉందో తెలియజేస్తూ, విద్యార్థులకు కేవలం మార్కులతో కూడిన భట్టి చదువు అవసరం లేదని విలువలతో కూడినటువంటి విద్యను అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందని, ప్రాశ్చాత్య సంస్కృతులు భారత సంస్కృతి పై దాడి చేస్తున్నాయని వాటి నుండి తమ పిల్లలను కాపాడుకుంటూ తల్లిదండ్రులు మెలగాలని విద్యార్థుల ఎదుగుదలలో తల్లి పాత్ర ప్రముఖమైనదని, శివాజీని తీర్చిదిద్దిన తల్లి జిజియా బాయ్ లాగా ప్రతి తల్లి ఉండాలని ఆశించారు. వారు ఉపన్యసించిన సత్వర్తన రీతులు కార్యక్రమానికి విచ్చేసిన తల్లిదండ్రులను విద్యార్థులను ఎంతో ఆకట్టుకున్నది మాట్లాడుతూ పాఠశాల వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అమోఘంగా ఉన్నాయని, ప్రదర్శించిన కూచిపూడి




నృత్యం వీక్షకులను పరవశులను చేసింది. రాబోయే పరీక్షలకు సిద్ధంగా ఉండాలని ఒత్తిడి లేని విద్యతోనే విజయాలు సాధ్యమని,తమ యొక్క లక్ష్యం లాభాపేక్ష కాదని విద్యార్థులకు ఉన్నతమైనటువంటి చక్కని విద్యను అందించాలన్నదే అని తెలియజేశారు చక్కనైన వేషధారణతో చిన్నారుల అద్భుతమైన నృత్యాలతో ప్రాంగణమంతా కనుల పండుగగా మైమరిపించే విధంగా మారిపోయింది. కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయుటలో సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సినీ నటి శ్రీమతి రాగిణి, వేణు శ్రవణ్, అనిల్ రెడ్డి, బండి అనిల్, కుమార్, ఎస్ లక్ష్మి గారు తదితరులు పాల్గొన్నారు

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించండి

- **మొగడంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండీ మాక్సూద్ అహ్మద్**



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**
ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మొగడం పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ మాక్సూద్ అహ్మద్ కోరారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండల కేంద్రంలో మాజీ మంత్రి జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ డా:ఏ. చంద్రశేఖర్ ఆదేశానుసారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ మాక్సూద్ అహ్మద్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డి కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారికి విన్నవించారు. బ్యాలెట్ పేపర్లో వారి సీరియల్ నెంబర్ రెండు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిష్టయ్య, కమల్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు. విష్ణు, ఖాన్ సాబ్, ప్రేమ, సందీప్, శంకర్ గౌడ్, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- **జహీరాబాద్ డిఎస్పీ రామ్మోహన్ రెడ్డి**




**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సబ్ డివిజన్‌లో ఈ నెల 27న జరగనున్న టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక డిఎస్పీ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్బంగా వారు మంగళవారం సమావేశం నిర్వహించి సబ్ డివిజన్ బలగాలకు పలు సూచనలిచ్చారు. ఈ సమావేశంలో టౌన్ సిఐ శివలింగం, రూరల్ సీఐ హన్మంతు,10 మంది ఎస్ఐ లు, 2 ఏఎస్ఐ లు, 10 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 60 మంది పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్బంగా ఎలాంటి అవాంఛనియ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకువాలని అధికారులకు సూచించారు.

# శివ స్వాముల మహాపడి పూజ కార్యక్రమం



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములోని శ్రీ కైలాసగిరి శివాలయంలో శివస్వాముల మహాపడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం శివస్వాములచే ఇరుముడి కట్టించి అనంతరం పూజారులు గణేష్ స్వామి, నందు స్వాముల ఆధ్వర్యంలో ఈ పడి పూజ కార్యక్రమం కొనసాగుంచారు. శివనామ స్మరణంతో శివాలయం మారుమోగింది. ఆర్కెస్ట్రా భజన మండలిచే భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

## బుగ్గ రాజేశ్వర స్వామిని దర్శించుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే దంపతులు.

- ఘన స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు.



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 25**
ఎంతో పవిత్రమైన ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన శైవ క్షేత్రం, బెల్లంపల్లి బుగ్గ రాజరాజేశ్వర స్వామిని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్- రమా, దంపతులు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు, శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో, పాడిపంటలతో, సంతోషంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నామని అన్నారు. రోడ్డు నిర్మాణం చేయడానికి ముఖ్యమంత్రితో నిధుల కోసం, అటవీ శాఖ అధికారుల అనుమతులు కోసం తీవ్రంగా ప్రయత్నించి అనుమతులు తీసుకువచ్చి రోడ్డు నిర్మాణం చేపట్టానని, ఈ సంవత్సరం భక్తులు సుఖ సంతోషాలతో బుగ్గ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని ఆనందంగా స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. మహాశివరాత్రి సందర్భంగా స్వామి దర్శనానికి వస్తున్న ప్రజలకి, ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎం.ఎల్.సి. పోలింగ్లో అర్హత గల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 25**
మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎం.ఎల్.సి. ఎన్నికలలో భాగంగా ఈ నెల 27వ తేదీన జిల్లాలో జరుగనున్న పోలింగ్లో రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థలు, వ్యాపారం, పరిశ్రమలు, ట్రేడ్ ఇతర సంస్థలలో పని చేస్తున్న అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గం॥ల నుండి సాయంత్రం 4 గం॥ల వరకు పోలింగ్ జరుగుతుందని, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజున ప్రత్యేక ఆకస్మిక సెలవు వాడుకొనుటకు, ప్రైవేట్ సంస్థలలో పని చేసే ఉద్యోగులు, అధికారులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా విధులలో వెసలుబాటు కల్పించడం జరుగుతుందని, ఆయా సంస్థల యాజమాన్యాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సహకరించాలని తెలిపారు.

## మహిళల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు

- జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్‌రాజ్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 25**



మహిళల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్ రాజ్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాన్ని సందర్శించి వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ మహిళల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆరోగ్య మహిళా కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న మహిళలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉ చితంగా ఇవ్వడం జరుగుతుందని, ఆరోగ్యం కొరకు పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని, వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# శాంతిగని ని ఓపెన్ కాస్ట్ చేసే ప్రసక్తే లేదు

- లాంగ్ వాల్ పద్ధతిలోనే మిగిలిన బొగ్గును వెలికి తీస్తాం.
- స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురి కావలసిన అవసరం లేదు.
- గత అనుమతులను రెన్యువల్ చేయడానికే, మార్చి 6న ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నాం.
- మందమర్రి జీఎం దేవయ్య.



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 25**



మందమర్రి డివిజన్ లో గల బెల్లంపల్లి పట్టణానికి సమీపంలో ఉన్న శాంతిగనిలో, మిగిలిపోయిన బొగ్గు నిల్వలను లాంగ్ వాల్, పద్ధతిని ఉపయోగించి తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామే తప్ప, శాంతిగని ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ కాస్ట్ చేసే ప్రసక్తి లేదని మందమర్రి జనరల్ మేనేజర్ దేవయ్య తెలిపారు. ఈ సందర్భంగా పత్రిక సమావేశంలో జనరల్ మేనేజర్ దేవయ్య మాట్లాడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేసేది లేదని, ఎవరు భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదని తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి స్థానిక ఏజెంట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 1954లో ప్రారంభించిన శాంతిగని లో అప్పటి నిబంధనల మేరకు బొగ్గు నిల్వలను బయటకు తీసుకుంటూ, మారుతున్న మార్పులకు అనుగుణంగా 2006 సంవత్సరంలో ఎం ఓ ఈ ఎఫ్ అండ్ సి సి, మంజూరు చేసిన పర్యావరణ అనుమతి ( ఈసి) ప్రకారం 681. 23 హెక్టార్ల ప్రాజెక్టు స్థలంలో, సాలిన 1.167 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో గని లోని బొగ్గును వెలికితీస్తున్నామని, ఈ భూగర్భ గని నిర్వహణ కోసం అదనపు భూమి అవసరం లేదని, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ (ఎం.ఈఎఫ్ అండ్ సి సి) వారు ప్రకటించిన ఎస్ ఓ సంఖ్య 1530 ( ఈ) 6-04-2018 ప్రకారం 2006లో ఇచ్చిన పర్యావరణ అనుమతిని తిరిగి రెన్యూవల్ చేసుకునేందుకు, పర్యావరణ అనుమతులు తీసుకొనుటకు, జారీ చేసిన నియమావళి ప్రకారం ప్రజాభిప్రాయ సేకరణ వచ్చే మార్చి 6న ఉదయం 11 గంటలకు శాంతిగని పాత కార్యాలయం సమీపమున నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖ అనుమతులు తీసుకున్నాక, శాంతిగని లో ప్రస్తుతం 500 మీటర్ల నుండి 700 మీటర్ల లోతున ఉన్న బొగ్గును తీయడానికి లాంగ్ వాల్ పద్ధతి ఉపయోగించి మాత్రమే బొగ్గును తీసే అవకాశం ఉందని, ఓపెన్ కాస్ట్ చేసే పరిస్థితి లేదని, ఈ గనిలో అంత లోతున మిగిలిపోయిన 10 నుండి 12 మిలియన్ టన్నుల బొగ్గు ఖనిజాన్ని లాంగ్ వాల్ పద్ధతిలో మాత్రమే తీసుకునే అవకాశం ఉంటుందని, ఓపెన్ కాస్ట్ చేస్తామనే పుకార్లు 100% అబద్ధమని ఎవరు భయభ్రాంతులకు గురి కావద్దని విజ్ఞప్తి చేశారు. శాంతిగని లో మిగిలిపోయిన బొగ్గు నిక్షేపాలను బయటకు తీస్తే, స్థానిక కార్మికులకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, మరో 20 సంవత్సరాలు బెల్లంపల్లి, మందమర్రి, పట్టణాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని అన్నారు. ఉన్న ఆ ఒక్క గని మూతపడితే అటు సంస్థకు, ఇటు బెల్లంపల్లి, మందమర్రి, పట్టణాలకు తీవ్ర నష్టం జరుగుతుందని, అందుకే ఎవరు భయాందోళనకు గురికా వద్దని, గతంలో 2006లో తీసుకున్న పర్యావరణ అనుమతులను తిరిగి రెన్యువల్ చేసుకోవడానికి మాత్రమే, కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు పర్యావరణ, అభిప్రాయ సేకరణ చేపడుతున్నామని, అన్ని గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం, విజయ్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్, శ్యాంసుందర్, శాంతిగని ఏజెంట్ అబ్దుల్ ఖదీర్, ఈ అండ్ ఎం, వెంకటేశ్వర రెడ్డి, రాజన్న ఐ ఈ డి, తదితర అధికారులు రవి, రవి కుమార్ పాల్గొన్నారు.

# బ్యాలెట్ బాక్సు, ఎన్నికల సామాగ్రి పంపిణీకి సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 25**
మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుల ఎన్నికలలో భాగంగా ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గం॥ల నుండి సాయంత్రం 4 గం?ల వరకు జరుగనున్న పోలింగ్ కొరకు బ్యాలెట్ బాక్స్ లు ఎన్నికల సామాగ్రి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణలతో కలిసి బ్యాలెట్ బాక్సు, సామాగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27న జరుగనున్న శాసనమండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ నిర్వహణ కొరకు ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, పట్టభద్రుల ఎన్నికల కొరకు 48 జంబో బ్యాలెట్ బాక్సు కేటాయించగా అందులో 8 అదనపు బాక్సు, 48 స్మాల్ బ్యాలెట్ బాక్సు కేటాయించగా అందులో 8 అదనపు బాక్సు, ఉపాధ్యాయుల ఎన్నికల కొరకు 44 స్మాల్ బ్యాలెట్ బాక్సు కేటాయించగా అందులో 8 అదనపు బాక్సును కేటాయించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 40 పట్టభద్రులు, 18 ఉపాధ్యాయ ఎన్నికల కొరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 26వ తేదీన ఉదయం 10 గం?లకు ర్యాండమైజేషన్ ప్రక్రియలో కేటాయించిన ప్రకారంగా బ్యాలెట్ బాక్సు, ఇతర సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని, భద్రతా చర్యల మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ ఆసుపత్రిలో సాయి భోజన్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 25**



బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ దాతలు పోతు మానస మురళి మోహన్, నికోడే విజయ, లోహిత్, లక్ష్మి సహకారంతో గర్భిణులకు బాలింతలకు, డయాలసిస్ రోగులకు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్ -రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని, గర్భిణీలు, బాలింతలు, రోగులు, అన్నార్తులు, ఆసుపత్రి సిబ్బంది, సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి మరియు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం - అన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్-రాజేశ్వరి పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని, మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ తెలిపారు. ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు జేరిపోతుల చంద్రకళ, సేవకులు ఆర్ఎంపి డాక్టర్ పేరం రమేష్, ఆరెల్లి కుమార్, ఎండి యూసఫ్, ఎస్డి జిలాని, ఎస్కె పర్వీన్ తదితరులు పాల్గొన్నారు. బాయిజమ్మసాయి సేవా ట్రస్ట్ ద్వారా అన్నదానం, సాయం అందించాలని అనుకునేవారు ట్రస్ట్ మేనేజర్ 8106550532, ఫౌండర్స్ 9959269975, 9949041595 సంప్రదించాలని కోరారు.

## పాయల్ శంకర్ గారి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన రైతులు



**ఆదిలాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**
ప్రభుత్వం ప్రకటించిన మద్దతు కందుల విక్రయించుకోవడానికి నిర్ణయించిన పరిమితి పెంపు కోసం ఆదిలాబాద్ ఎమ్మెల్యే ప పాయల్ శంకర్ గారి చేసిన కృషి మేరకు మంగళవారం కిసాన్ మోర్చా నాయకులు మార్కెట్ ఆవరణలో పాయల్ శంకర్ గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు కందులు 3.31 క్వింటాళ్ల కంటే ఎక్కువ కొనుగోలు చేయొద్దని ప్రభుత్వం నిర్ణయించింది పంటను అమ్ముకునేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకొనిపోవడంతో పాటు పరిమితిని ఆరు క్వింటాళ్లకు పెంచాలని కోరారు స్పందించిన మంత్రి వెంటనే ఆదేశాలు జారీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు పరిమితి పెంపునకు కృషి చేసిన కృతజ్ఞతగా ఎమ్మెల్యేకు పాలాభిషేకం చేశారు ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దయాకర్ మయూర్ చంద్ర వెంకన్న నరేందర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు

## ఉమ్మడి జిల్లాలో శివాలయాలు ముస్తాబు

- శివరాత్రి కోసం భారీగా ఏర్పాట్లు

**ఆదిలాబాద్, ఫిబ్రవ25( వెలుతురు):**
శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి తీరంతో పాటు ఆలయాలను ముస్తాబు చేసారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గోదావరి తీరంలో ఏర్పాట్లను స్థానికనేతలు పరిశీలించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గోదావరి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు అల్పాహారం, తాగు నీటి సదుపాయం కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. వేలాలలో నిర్వహించే జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శివరాత్రికి ఒక రోజు ముందుగానే భక్తులు గుట్టపైకి చేరుకుని అర్ధరాత్రి నుంచి దర్శనం కోసం బారులు తీరుతారు. శివరాత్రి రోజు గుట్టపైన జాతర జరుగుతుంది. గుట్టపైకి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. జాతరకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి సుమారు 2 లక్షల మంది వరకు భక్తులు వస్తారు. గోదావరిఖని, మంచిర్యాల డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు నడిపిస్తారు. గుట్టపైన, కింద తాగునీటి వసతి కల్పిస్తున్నారు. గోదావరి స్నానఘట్టాల వద్ద సింగరేణి రెస్క్యూటీం, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసున్నారు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కన్నాలలో గల బుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. జిల్లా ప్రజలతో పాటు కుమరంభీంఆసిఫాబాద్, ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, మహారాష్ట్ర నుంచి జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్‌లతోపాటు మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు నిలిపేందుకు స్థలాన్ని కేటాయించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరి తీర హనుమాన్ ఆలయం, పట్టణంలోని శివాలయంతోపాటు పలు ఆల యాలు ముస్తాబయ్యాయి. పంచకోశ ఉత్తరవాహిని గోదావరి నది తీరాన భక్తుల సౌకర్యార్థం మున్సిపల్ అధికారులు పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేస్తున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్ మండలం ఈసుగాం శివమల్లన్న ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలకరించారు. మహాశివరాత్రి రోజు ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శివాలయాన్ని ముస్తాబు చేశారు.

# పట్టిసీమలో శివరాత్రి వేడుకలు

- దైవదర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

ఏలూరు,ఫిబ్రవరి25( వెలుతురు):



మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టిసీమలో సకల ఏర్పాట్లు చేశారు. .పోలవరం మండలం పట్టిసీమ రేవులో దైవదర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్నారు. తాటాకు పందిళ్లకు, మరుగుదొడ్లు, లైటింగ్, బారికేడ్లను ఏర్పాటు చేశారు. అందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేస్తామని, అందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేసామని అన్నారు. గూడెం మండలం వీరంపాలెంలోని బాలాత్రిపుర సుందరీదేవి పీఠంలో మహాశివరాత్రి ఉత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. స్వామివారి దర్శనార్థం ఆలయానికొచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళ వాయిద్యాలతో వేదమంత్రాలతో ఆలయ ప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన, దీక్షాధారణ, మహావిద్య పారాయణ, వేదపారాయణ, సర్వదేవతా ఆవాహనం, గోపూజ, సూర్యనమస్కారాలు, మహాలింగార్చన, స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మేథా సరస్వతి అమ్మవారికి లక్షపుష్పార్చన, విశ్వేశ్వరస్వామివారికి లక్ష బిల్వార్చన, ఆధ్యాత్మిక ఉపన్యాసం, భూప్రస్తార శ్రీచక్రార్చనతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. తెల్లవారుజాము నుంచి స్పటికలింగేశ్వర స్వామివారికినదీ జలాలతో అభిషేకాలు, 5 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం, వేదపారాయణ, రుద్రపారాయణ, రుత్వికులతో మహన్యాస పఠనం, మహాదేవునికి 12 రకాల విశేష ద్రవ్యాలతో మహాకుంభాభిషేకం చేస్తారు. విశ్వేశ్వర స్వామివారికి 11 లక్షల రుద్రాక్షలతో అర్చన, సర్వదేవతా హోమం, సంపూర్ణ పూర్ణాహుతి ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు.

# మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

- పలు ఆలయాల్లో ప్రత్యేకంగా శివరాత్రివేడుకలు

కడప,ఫిబ్రవరి 28 ( వెలుతురు):



జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవక్షేత్రం పొలతల. పార్వతీ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ముస్తాబైంది. పెండ్లిమర్రి మండలం గంగనపల్లె గ్రామ పంచాయతీ శేషాచల పర్వత శ్రేణుల్లోని పాలకొండల్లో పొలతల మల్లికార్జునుడు కొలువై ఉన్నాడు. ఇక్కడికి వచ్చే భక్తుల కోర్కెలు తీరుస్తూ కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. ప్రతి ఏటా శివరాత్రి పర్వదినం రోజు రాష్ట్ర నలుమూలల నుంచే కాక కర్ణాటక నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఈ క్షేత్రంలో మల్లికార్జునుడితో పాటు పార్వతీదేవి, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఏడుగురు అక్కదేవతలు, పులిబండెన్న, వినాయక, సుబ్రమణ్యస్వామి, కాశిరెడ్డినాయనస్వాములు నిత్యం ప్రజలచే పూజలు అందుకుంటున్నారు. పొలతల క్షేత్రంలో గత కొన్ని సంవత్సరాల నుంచి కాశిరెడ్డినాయన ఆశ్రమం వారు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. కాశిరెడ్డినాయన కూడా ఈ క్షేత్రంలో పర్యటించి పూజలు నిర్వహిం చారని ఆలయ పెద్దలు తెలియజేశారు. మహాశివరాత్రి సందర్భంగా లక్షల మంది భక్తులకు అన్నిరకాల వంటలను అన్నదాన సత్రం సిద్ధం చేస్తుంది. పొలతలకు చేరే మార్గం పొలతలకు వెళ్లేందుకు ఆర్టీసీ వారు బస్సులను ఏర్పాటు చేశారు. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, రాయచోటిల నుంచి బస్సు సౌకర్యం కలదు. కడప నుంచి మూలవంక మీదుగా 22 కిలోమీటర్ల దూరంలో పొలతల క్షేత్రం ఉంది. పులివెందుల వైపు నుంచి వచ్చే వారు వెల్లటూరు మీదుగా చేరవచ్చు. పొలతల క్షేత్రంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకంతో పాటు 10 గంటలకు ముత్యాల తలంబ్రాలతో స్వామి వారి కల్యాణం ఉంటుందన్నారు. ఇకపోతే లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజస్వామి ఆలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. మండలంలోని వంతాటిపల్లె గ్రామానికి 13 కిలోమీటర్ల దూరంలోని లంకమల అభయారణ్యంలో 600 ఏళ్ల క్రితమే ఉద్భవలింగం వెలసినట్లు ప్రచారం. ఈ ఉద్భవలింగానికి ప్రతినిత్యం సమీప కొలనులో అక్కదేవతల స్నానాలు చేసి ఎంతో పవిత్రంగా పూజలు నిర్వహించేవారని ప్రతీతి. 1500వ సంవత్సరంలో పెన్నానది ఒడ్డున ఉన్న మూలపల్లె గ్రామానికి చెందిన అయ్యవారురెడ్డి స్వామి బాలుడుగా ఉన్నప్పుడు గోవుల మందలో నుంచి ఒక గోవు అదృశ్యమై ప్రతిరోజూ ఉద్భవలింగం వద్దకు వెళ్లి పాలు ఇచ్చి వచ్చేది. ఆ దృశ్యాన్ని అయ్యవారురెడ్డి స్వామి చూసి మరుసటి రోజున ఆవును వెంబడించి ఉద్భవలింగం ఉన్న చోటును కనుగొన్నారు. ఈ గోవు పాలను ప్రతినిత్యం నిత్యపూజస్వామి స్వీకరించే వారని ఒక కథ ప్రచారంలో ఉంది. అనంతరం పరమేశ్వరుడు అయ్యవారురెడ్డి స్వామి వారికి నాలుకపై బీజాక్షరాలు రాసి భక్తుడిగా చేసుకున్నారని పూర్వీకులు చెబుతున్నారు. మహాశివరాత్రి పర్వదినాన, కార్తీక మాసాల్లో స్వామికి వైభవంగా పూజలు జరుగుతాయి. నిత్య పూజ స్వామి వద్దకు వెళ్లే భక్తులు మొదట పంచలింగాల స్వామికి పూజలు నిర్వహిస్తారు. అక్కడ చెన్నకేశవ స్వామి ఆలయం, అక్కదేవతల విగ్రహాలకు పూజలు చేస్తారు. అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో కొండవాలు కింద వెలసిన ఉద్భవలింగం కొండ లోపలిభాగంలో శివపార్వతుల విగ్రహాలు ఉన్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా నిత్య పూజస్వామిని దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. భక్తులు పంచలింగాల గుడి వద్ద దారి పొడవునా అన్నదానం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తారు.

# యాగంటిలో శివరాత్రి ఏర్పాట్లు

కర్నూలు,ఫిబ్రవరి25( వెలుతురు):



శివరాత్రిని పురస్కరించుకొని యాగంటి క్షేత్రం ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో తెలిపారు. క్యూలైన్ల వెంట చలువ పందిళ్లు, అవసరమైన చోట శామియానాలు, లైటింగ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దాతల సహకారంతో మజ్జిగ పాకెట్లను భక్తులకు అందించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చే భక్తులు వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఆలయంలో శానిటైజేషన్ పూర్తి చేసి అవసరమైన చోట టస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశామన్నారు. భక్తుల స్నానాల కోసం ప్రత్యేక ట్యాంకులు, కొళ్ళాయి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవసరమైన భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశామన్నారు.

# హైదరాబాద్‌లో మోగుతున్న డేంజర్ బెల్స్

- గాలిలో తగ్గుతున్న నాణ్యత ప్రమాణాలు
- 24న ఏకంగా 431 ఏక్యూఐ నమోదు
- సనత్‌నగర్‌లో పరిస్థితులు మరీ దారుణం

హైదరాబాద్,ఫిబ్రవరి25( వెలుతురు):



హైదరాబాద్ డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యంతో.. పరిస్థితి ఆందోళనకరంగా మారగా.. ఇప్పుడు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోనూ ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా.. సనత్‌నగర్‌లో పరిస్థితులు మరీ దారుణంగా మారాయి. సనత్‌నగర్‌లోని ఎయిర్ క్వాలిటీ ప్రమాదకర స్థాయికి చేరుకుంది. సోమవారం (ఫిబ్రవరి 24న) రోజున ఏకంగా 431 ఏక్యూఐ నమోదైంది. సోమవారం మధ్యాహ్నం 3.05 గంటల ప్రాంతంలో ఈ వ్యాల్యూ నమోదైనట్టు పేర్కొన్న టీటీపీసీబీ అధికారులు.. క్రమంగా ఈ లెవెల్స్ తగ్గుతూ వచ్చినట్టు తెలిపారు. మరోవైపు.. నగరంలో సగటున 108 ఏక్యూఐ నమోదైనట్టు అధికారులు తెలిపారు. మరోవైపు.. జూపార్క్‌లో 135, పటాన్ చెరువులో 112 తప్ప గ్రేటర్లో గాలి నాణ్యతను సూచించే 14 స్టేషన్లలో ఎక్కడా 100 ఏక్యూఐ దాటలేదని అధికారులు స్పష్టం చేశారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్లో గాలి నాణ్యత 0 నుంచి 50లోపు నమోదైతే ఆ గాలి స్వచ్ఛంగా ఉన్నట్టని.. అదే 51 నుంచి 100 వరకు ఉంటే గాలి నాణ్యత సంతృప్తికర స్థాయిలో ఉందని తెలిపిన అధికారులు.. 101 నుంచి 200 మధ్య ఉంటే కాస్త అనారోగ్యకరమని, 200 నుంచి 300 వరకు ఉంటే పూర్ క్వాలిటీ అని, 301 నుంచి 400 వరకు ఉంటే వెరీ పూర్ క్వాలిటీ అని పేర్కొన్నారు. ఇక.. 401 నుంచి 500 వరకు ఉంటే మాత్రం అది అత్యంత ప్రమాదకర స్థాయి అని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో.. సోమవారం సనత్నగర్లో 431 ఏక్యూఐ నమోదు కావటం కాస్త ఆందోళన కలిగించే అంశంగా అధికారులు పేర్కొన్నారు. గతేడాది.. నవంబర్ 25వ తేదీన సనత్నగర్లో 298, డిసెంబర్లో 229, జనవరిలో 171 ఏక్యూఐ నమోదైంది. అయితే.. సనత్ నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతం కావడంతో అక్కడ సాధారణంగానే అసాధారణ వ్యాల్యూస్ నమోదవుతుంటాయని అధికారులు తెలిపారు. అయితే.. ఎప్పుడూ లేనంతగా సోమవారం రోజున ప్రమాదకర స్థాయిలో వ్యాల్యూస్ నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇదిలా ఉంటే.. హైదరాబాద్లోని సనత్ నగర్లో ఎయిర్ క్వాలిటీ లెక్కించే మీటర్ పక్కన.. రెండు కంపెనీలకు చెందిన జనరేటర్లు ఉన్నాయని టీజీ పీసీబీ సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్ తెలిపారు. ఒక్కోసారి గాలి ఎక్కువ వీచినప్పుడు ఎయిర్ క్వాలిటీ లెవల్స్ పడిపోతుంటాయని చెప్పుకొచ్చారు. జనరేటర్ల కారణంగానే సోమవారం మధ్యాహ్నం 431 ఏక్యూఐ నమోదై ఉండొచ్చని.. దానికి భయపడాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. కాగా.. సనత్నగర్లో ఉన్న మీటర్ను అక్కడి నుంచి మారుస్తామని ప్రసాద్ తెలిపారు.

# ఉమ్మడి జిల్లాలో ముస్తాబైన శైవక్షేత్రాలు

## ధర్మపురి క్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లు

కరీంనగర్,ఫిబ్రవరి25( వెలుతురు):



మహాశివరాత్రి వేడుకలకు రాజన్న జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శివరాత్రి సందర్భంగా శివభక్తులు భక్తి శ్రద్ధలతో గండదీపాన్ని వెలిగించి పరవశించి పోతారు. జిల్లాలోని శివాలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. స్వయంభూ దేవస్థానాలు, పురతాన ఆలయాల్లో శివరాత్రి వేడుకలు సోమవారం ప్రారంభంకానున్నాయి. మంగళ, బుధ వారాల్లో కొనసాగనున్నాయి. మంగళవారం మహాశివరాత్రి వేడుకలను జరుపుకోనున్నారు. జిల్లాలో దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి లక్షలాది మంది భక్తులు తరలిరావడం మొదలైంది. శివాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. ధర్మపురి శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలోమహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని స్వామి వారలకు అభిషేకం, మహాలింగార్చన, కల్యాణం పూజాది కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేయించి నట్లు ఆయన వివరించారు. విద్యుత్ దీపాలతో అలంకరణ చేయించి, భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, మంచి నీటి వసతి కల్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.శివరాత్రి సందర్భంగా ధర్మపురి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు భక్తుల అభి షేకాలు, దర్శనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 వరకు మహాలింగార్చ న, రాత్రి 11 నుంచి ఒంటి గంట వరకు లింగోద్భవ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రాత్రి 1 నుంచి 3 వరకు శివకల్యాణం, ప్రాత:కాలం 3 నుంచి 4 వరకు రథోత్సవం ఉంటుందని వివరించారు. అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయంలోనూ శివరాత్రి ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. టెంట్లు, మంచి నీటి వసతులు కల్పించారు. అలాగే గోదావరితీరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సారంగాపూర్ మండలం పెంబట్ల, కోనాపూర్ లోని దుబ్బరాజన్న జాతర బ్రహోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారం భమయ్యాయి. స్వామివారి సన్నిధిలో పుణ్యహవచన, అంకురార్పణ కార్య క్రమాలను నిర్వహిం చారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాంగ సుంద రంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గాను వెదురు తడకలతో చలువ పందిళ్లు, రంగు రంగుల విద్యుద్దీపాలతో ఆలయ ప్రాంగణాన్ని అలంకరిం చారు. కోటిలింగాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చే శారు. అధిక సంఖ్యలో భక్తులు గోదావరి స్నానాలకు వస్తారని తగిన ఏ ర్పాట్లు పూర్తి చేశారు. చలువ పందిళ్లు, మహిళలు దుస్తులు మార్చు కోవడానికి గదులు, మంచి నీటి సౌకర్యం కల్పించారు. మెగా కంపెనీ ఆధ్వర్యంలో ఆలయ పరిసర ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాన్ని చదును చేశారు. ముక్తేశ్వర స్వామి ఆలయంతో పాటు, శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో, స్వయం భూ కట్ట రాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు.

# శివరాత్రి వేడుకలకు సిద్ధంగా వేయిస్తంభాల గుడి

- కాకతీయ కళాసంస్కృతికి నిలయం త్రికూటాలయం
- అంగరంగ వైభవంగా వేడుకల నిర్వహణ

వరంగల్,ఫిబ్రవరి25( వెలుతురు):



హన్మకొండ వేయిస్తంభాల గుడిలో శివరాత్రి వేళ పాంచాహ్నిక దీక్షతో ఉత్సవాలు కోలాహలంగా జరుగుతాయి. రుద్రేశ్వరి, రుద్రేశ్వరులకు మంగళస్నానాలు చేయించి వధూవరులుగా చక్కగా అలంకరిస్తారు. బుధవారం ఉదయం మూడింటికే స్వామికి సుప్రభాత సేవ, మంగళవాయిద్య సేవ, మహాగణపతికి నవరసాభిషేకం నిర్వహించిన తర్వాత రుద్రేశ్వరుడికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకం చేస్తారు. సాయంత్రం ఆరింటికి శివపార్వతుల కల్యాణం వైభవోపేతంగా నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో విశేషంగా మహ రుద్రాభిషేకం ఉంటుంది. శివరాత్రి మర్నాడు స్వామికి నాకబలి, సదస్యం కార్యక్రమాలు ఉంటాయి. పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి. కాకతీయుల కళావైభవానికి, భక్తి పారవశ్యానికి నిలయం వేయి స్తంభాల దేవాలయం. వేయి స్థంబాల పేరుతో నిర్మితమైన ఆలయ వైభవం నేటికి కొనసాగుతుంది. ఈ దేవాలయంలో శివలింగాన్ని రుద్రేశ్వరస్వామిగా కొలుస్తారు. అంతేకాదు వేయిస్థంభాల దేవాలయానికి మరో విశిష్టత ఉంది. భక్తి భావంతో పాటు ఆలయంలో శిల్పకల ఉట్టిపడుతుంది. వేయిస్తంభాల దేవాలయాన్ని త్రికుటాల యంగా పిలుస్తారు. ఇక్కడ శివునితోపాటు విష్ణుమూర్తి, సూర్య భగవానుడు కొలువుదీరాడు. 850 ఏళ్ల ఘనచరిత కలిగి దేశంలోనే ప్రముఖ పర్యటక ప్రాంతాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది ఆలయం. రుద్రేశ్వరాల యంగానూ దీనికి పేరుంది. క్రీ.శ. 1163లో కాకతీయుల రాజు రుద్రదేవుడి హయాంలో వేయిస్తంభాల ఆలయాన్ని నిర్మించారు. వేయి స్తంభాలతో ఆలయంతో పాటు ఆలయానికి ఎదురుగా కళ్యాణ మండపాన్ని అత్యంత సుందరనీగా తీర్చిదిద్దారు. కాకతీయు నిర్మాణం పూర్తి కావడానికి 80 సంవత్సరాలు పట్టినట్లు చరిత్ర చెబుతుంది. శైవ క్షేత్రాల్లో సాదారణంగా శివునికి, శివలింగానికి ఎదురగా నందీశ్వరుడు ఉంటారు. కానీ వేయిస్తంభాల దేవాలయంలో భిన్నంగా సూర్యభగవానుడు కొలువై ఉంటారు. ఈ ఆలయం మరో విశిష్టతను కల్గిఉంది. త్రికూటాలయంగా నామకరణం చేసి శివునికి ఎడమై వైపున విష్ణుమూర్తిని, ఎదురుగా సూర్యభగవానున్ని ప్రతిష్టించారు. విష్ణుమూర్తికి నిత్య కళ్యాణం మచ్చతోరణం అన్నట్లు నిత్యపూజలు జరుగుతాయి కాబట్టి విష్ణుమూర్తికి ఎదురుగా నందీశ్వరుడి విగ్రహం విగ్రహం వెనకాల కళ్యాణమండపం నిర్మించారు రుద్రదేవ మహారాజు. ఇక్కడ శివునితోపాటు విష్ణుమూర్తి, సూర్యభగవానుడు నిత్య పూజులు అందుకోనేవారు. ఉత్సవాల వేళ చుట్టూ మిరుమిట్లు గొలిపే విద్యుత్తు దీపాల అలంకరణ, పుష్పాలంకరణతో ఆలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

# కొమురవెల్లిలో శివరాత్రి వేడుకలు

- ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న పెద్దపట్నం

సిద్దిపేట,ఫిబ్రవరి25( వెలుతురు):



కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి నాడు ఆలయంలో స్వామివారికి మహాన్యాసపూర్వక అభిషేకంతో పాటు నిరంతరం అభిషేకాలు చేయనున్నారు. ఆలయం తరపున నిర్వహించే 'పెద్దపట్నం' ప్రత్యేక ఆకర్షణ కానుంది. ఈ వైవిధ్య పూజా కార్యక్రమం తెలంగాణకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీనికోసం భారీగా భక్తులు తరలిరానున్నారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇవో తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. భారీగా భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పట్నం' అంటే స్వామికి కల్యాణం చేయడం. హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లికి ముందు 'పోలు' (బియ్యంతో పోయడం) కార్యక్రమాన్ని కొమురవెల్లిలో వీరశైవ ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తారు. ఆలయం వద్ద 'పట్నం' వేయడమంటే స్వామికి కల్యాణం చేసినట్లుగా భక్తులు భావిస్తారు. శివరాత్రి నాటి అర్ధరాత్రి పంచవర్ణాలతో పెద్దపట్నం వేస్తారు. క్వింటాళ్ల కొద్దీ పసుపు, కుంకుమ, తంగేడు ఆకులతో తయారైన చూర్ణం, బియ్యపు పిండిని వినియోగిస్తారు. పట్నం వేయడం పూర్తయ్యాక ఆలయ అర్చకులు స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి పెద్దపట్నం వద్ద నిలిపి, పూజలు నిర్వహిస్తారు. అక్కడే స్వామి కల్యాణం నిర్వహిస్తారు. తెల్లవారుజాము కాగానే గర్భాలయంలోనుంచి వీరశైవులు ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి పట్నం చుట్టూ ప్రదక్షిణలు చేసి పట్నం తొక్కడం ప్రారంభించిన అనంతరం భక్తులు మల్లన్నను స్తుతిస్తూ పట్నంపై చిందేస్తూ తన్మయత్వం చెంది స్వామివారిని దర్శించుకుంటారు. పట్నాన్ని తిలకించి చిందేస్తే తమ కష్టాలు కడతేరతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రత్యేకంగా నిర్మించిన కల్యాణ వేదికపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. యాదవపూజారులు ఆధ్వర్యంలో జానపద కళాకృతిలో యాదవసంప్రదాయం ప్రకారం తోటబావి ప్రాంగణంలో పెద్దపట్నం వేసి స్వామివారికి కల్యాణం నిర్వహించనున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని తోటబావి ప్రాంగణంలో వేసే పెద్దపట్నానికి వైవిధ్యం, విశిష్టత ఉంది. మల్లన్న వీరశైవుల ఆడబిడ్డ మేడలాదేవీతో పాటు యాదవుల ఆడపడుచైన గొల్లకేతమ్మను వివాహమాడిన తరుణంలో స్వామివారు ఇక్కడ రెండురకాలుగా పూజలందుకుంటారు. వీరశైవులు బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా వేదమంత్రోచ్చారణలతో స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. అలాగే యాదవపూజారులు తమ ఆచారం ప్రకారం పంచవర్ణాలతో పట్నం వేసి కల్యాణం నిర్వహిస్తారు. పట్నం వేయడానికి ముందు ఒగ్గుపూజారులు పల్లకిలో ఊరేగింపుగా స్వామివారిని తీసుకెళ్లి కోనేటిలో స్నానమాచరింపచేసి శుద్ధిచేసి గంగదీపంపెటి గంగతెప్ప వదులుతారు. మల్లన్న ,కేతలమ్మ, మేడలాదేవిలకు నూతనవస్త్రాలను సమర్పించి సుంకు పడతారు. గొంగళిలో బియ్యంపోసి మైలపోలు తీస్తారు. స్వామివారు ధరించే త్రిశూలం, ఢమరుకాలను నెలకొల్పిన అనంతరం పెద్దపట్నం పైకి ఆవాహనం చేస్తారు.

# సుప్రీంకోర్టులో దిల్‌రాజ్‌కు రిలీఫ్

మిస్టర్ పర్‌ఫెక్ట్' కాపీరైట్ కేసు సుదీర్ఘ కాలంగా కొనసాగుతోంది. దర్శకుడు దశరథ్, నిర్మాత దిల్‌రాజు తన నవల 'నా మనసు కోరింది నిన్నే' సినిమాను రూపొందించారని ముమ్మిడి శ్యామల రాణి ఫిర్యాదు చేశారు. సినిమా 2011లో విడుదల కాగా, 2017లో ఫిర్యాదు నమోదు అయింది. శ్యామలారాణి ఫిర్యాదుపై ట్రయల్ కోర్టులో విచారణ జరిగింది. 2019లో దిల్ రాజు, దశరథ్‌లపై చర్యలు తీసుకోవాలని ట్రయల్ కోర్ట్ ఆదేశించింది. ట్రయల్ కోర్ట్ ఇచ్చిన ఆదేశాలను కొట్టి వేయాలంటూ నిర్మాత దిల్ రాజు, దర్శకుడు దశరథ్‌లు సుప్రీం కోర్ట్‌ను ఆశ్రయించారు. వీరి తరపున ప్రముఖ లాయర్ నిరంజన్ రెడ్డి సుప్రీం కోర్ట్‌లో వాదించారు. సుప్రీం కోర్ట్‌లో దిల్ రాజు, దశరథ్‌కి ఊరట లభించింది. కాపీ రైట్ కేసులో తాత్కాలిక స్టే విధించిన సుప్రీం కోర్టు ధర్మాసనం సీరియస్ వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఈ సమస్యను త్వరగా చర్చల ద్వారా పరిష్కరించుకోవడం కోసం ప్రయత్నించాలని, లేదంటే ముందు ముందు మీ పిటీషన్‌దారులు ఇబ్బందుల్లో పడతారని నిరంజన్ రెడ్డితో అన్నారట. కాపీరైట్ చట్టం కింద నమోదు అయిన కేసు కాల పరిమితి



ముగిసిన కారణంగా కేసు కొట్టి వేయాలని నిరంజన్ రెడ్డి సుప్రీం ధర్మాసనం ముందు వాదించారని తెలుస్తోంది. సుప్రీం కోర్ట్ ధర్మాసనం మాత్రం ఈ వివాదానికి చర్చల ద్వారా పరిష్కారంకు ప్రయత్నాలు చేయాలని సూచించింది. సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈ వివాదానికి చర్చల ద్వారా పరిష్కారం సాధ్యమేనా అనేది చూడాలి. ప్రభాస్ హీరోగా కాజల్ అగర్వాల్, తాప్సి హీరోయిన్స్‌గా నటించిన 'మిస్టర్ పర్‌ఫెక్ట్' సినిమాను దశరథ్ దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించారు. 2011, ఏప్రిల్ 20న విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. సాధారణంగా సినిమా విడుదలైన వెంటనే కాపీరైట్ వివాదం మొదలవుతుంది. కానీ మిస్టర్ పర్‌ఫెక్ట్ విడుదలైన దాదాపు ఏడేళ్లకు శ్యామలారాణి మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో నిర్మాత, దర్శకుడిపై ఫిర్యాదు చేసింది. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఎన్నో సినిమాలకు కాపీరైట్ వివాదం చుట్టుముట్టిన విషయం తెల్సిందే. అయితే కొన్నాళ్ల తర్వాత చర్చల ద్వారా పరిష్కారం లేదంటే, మరో విధంగా పరిష్కారం చేయడంతో వివాదం సద్దుమణుగుతుంది. కానీ మిస్టర్ పర్‌ఫెక్ట్ సినిమా విడుదల అయ్యి దాదాపుగా 15 ఏళ్లు అవుతున్నా వివాదం కంటిన్యూ అవుతుంది. ప్రస్తుతానికి తాత్కాలిక స్టే లభించినా ముందు ముందు ఎలాంటి పరిస్థితులను నిర్మాత దిల్ రాజు, దర్శకుడు దశరథ్ ఎదుర్కోవాల్సి వస్తుందో అనేది చూడాలి.



# ప్రశాంత్‌నీల్ డైరెక్షన్‌లో ఊర్వశీ రౌతేలా ప్రత్యేక పాత్ర

## మొన్న బాబాయ్.. నేడు అబ్బాయ్‌తో నటన



గత కొద్ది రోజులుగా బాలీవుడ్ భామ ఊర్వశీ రౌతేలా పేరు మీడియాలో మారు మ్రోగిపోతోంది. నిజానికి ఊర్వశీ రౌతేలా టాలీవుడ్ లోకి 2023లో అడుగు పెట్టిన ఏడాదే 'వాల్తేర్ వీరయ్య'తో పాటు 'ఏజెంట్', 'బ్రో' , 'స్కంద' మూవీస్ లో స్పెషల్ సాంగ్ లో నర్తించి భారీ ఎత్తున సందడి చేసేసింది. అయితే అప్పటికే ఆమె 'బ్లాక్ రోజ్' అనే ద్విభాషా చిత్రం (తెలుగు, హిందీ)లో హీరోయిన్ గా నటించింది కానీ అదింకా విడుదలకు నోచుకోలేదు. ఇక బాలకృష్ణ సరసన ఏ ముహూర్తాన ఊర్వశీ రౌతేలా 'డాకు మహరాజ్'లో నటించిందో కానీ ఆమె ప్రతి కదలిక అందరి దృష్టినీ విశేషంగా ఆకర్షించింది. ఆమెతో కలిసి బాలకృష్ణ వేసి స్టెప్పులు సోషల్ మీడియాలో పాజిటివ్ గానూ నెగెటివ్ గానూ కూడా వైరల్ అయ్యాయి. దానికి తోడు ఇటీవల ఈ సినిమా నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కాగానే... ఆమె సన్నివేశాలను, పాటను తొలగించారనే ప్రచారం జరిగిపోయింది. కానీ అందులో నిజం లేదని తెలిసింది. అయితే... ఓటీటీలో వివిధ భాషల్లో స్ట్రీమింగ్ కాగానే ప్రేక్షకులు బ్రహ్మ రథం పట్టేస్తున్నారు. ఇది చాలదన్నట్టుగా ఇప్పుడు ఈ అందాల ముద్దుగుమ్మ జూనియర్ ఎన్టీఆర్– ప్రశాంత్ నీల్ మూవీలోనూ ఓ కీలక పాత్ర పోషించబోతోందనే వార్త ఫిల్మ్ సర్కిల్స్ లో చక్కర్లు కొడుతోంది. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ ను దర్శకుడు ప్రశాంత్ నీల్ మొదలెట్టాడు. అందులో ఊర్వశీ నటిస్తోందని, వచ్చే షెడ్యూల్ లో ఆమె జాయిన్ అవుతుందని అంటున్నారు. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో ఓల్ట్ కోల్ కతా బ్యాక్ డ్రాప్ లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ పీరియాడిక్ యాక్షన్ మాస్ మూవీలో ఎన్టీయార్ సరసన రుక్మిణీ వసంత్ నటిస్తోంది. అలానే మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. వచ్చే యేడాది జనవరి 9న రాబోతున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. విశేషం ఏమంటే... 'వాల్తేర్ వీరయ్య, డాకు మహారాజ్' తర్వాత ఊర్వశీ రౌతేలాకు ఇది మూడో సంక్రాంతి మూవీ అవుతుంది.

# తప్పుడు వార్తలు ప్రచారం చేయడం సిగ్గుచేటు : ప్రీతిజింటా



పార్టీపై బాలీవుడ్ ప్రముఖ నటి ప్రీతి జింటా తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యూ ఇండియా కో ఆపరేటివ్ బ్యాంక్‌లో ఆమె తీసుకున్న రూ.18 కోట్ల రుణం మాఫీ అయ్యేందుకు నటి తన సోషల్ మీడియా ఖాతాలను బీజేపీకి అప్పగించిందని కేరళ కాంగ్రెస్ పార్టీ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలపై నటి తాజాగా స్పందించింది. ఈ మేరకు హస్తం పార్టీపై తీవ్ర స్థాయిలో మండిపడింది. తన సోషల్ మీడియా ఖాతాలను తానే సొంతంగా నిర్వహించుకుంటున్నానని స్పష్టం చేసింది. ఎవరికీ ఇవ్వలేదని తెలిపింది. తన రుణాన్ని ఎవరూ మాఫీ చేయలేదని పేర్కొంది. పదేండ్ల కిందటే బ్యాంకు నుంచి తాను రుణం తీసుకొని తీర్చేశానని స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ చేసిన పోస్ట్ చూసి తాను షాక్ అయ్యానని చెప్పింది. తనపై ఇలా తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. కాగా, సోమవారం కేరళ కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది. నటి ప్రీతి జింటా తన సోషల్ మీడియా ఖాతాలను బీజేపీకి అప్పగించినందుకు న్యూ ఇండియా కో ఆపరేటివ్ బ్యాంక్‌లో ఆమె తీసుకున్న రూ.18 కోట్ల రుణం మాఫీ అయ్యిందని ఆ పోస్ట్‌లో ఆరోపించింది. గత వారం ఆ బ్యాంకును మూసేయడంతో డిపాజిటర్లు రోడ్డున పడ్డారని పేర్కొంది. ఈ మేరకు ఈ పోస్ట్‌కు ప్రీతి జింటా ఫొటోను చూడా జత చేసింది. దీనిపై నటి తాజాగా స్పందించింది.

# జపాన్‌కు వెళ్లనున్న దేవర

కొరటాల శివ, ఎన్టీఆర్ కాంబోలో దేవర చిత్రం వచ్చి బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని దక్కించుకుంది. ఇక ఈ చిత్రాన్ని ఇప్పుడు జపాన్ ఆడియెన్స్ ముందుకు తీసుకు రాబోతోన్నారు. ఈ క్రమంలో జపాన్ మీడియాతో వీడియో మీటింగ్ అరేంజ్ చేశారు. ఇలా జూమ్ మీటింగ్‌లోనే వారితో ముచ్చటించాడు ఎన్టీఆర్. ఇక ప్రస్తుతం ఎన్టీఆర్ దుబాయ్‌లోని పెళ్లి వేడుకల్లో సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. నిర్మాత మహేష్ రెడ్డి కొడుకు నితేష్ రెడ్డి, కీర్తి పెళ్లి వేడుకల్లో టాలీవుడ్ టాప్ స్టార్లంతా కూడా సందడి చేస్తున్నారు. చూస్తుంటే ఎన్టీఆర్ అక్కడి నుంచే ఇలా ప్రమోషన్స్‌లో పాల్గొన్నట్టుగా కనిపిస్తోంది. మరి ఎన్టీఆర్ హైదరాబాద్‌లో ఎప్పుడు ల్యాండ్ అవుతాడో చూడాలి. దుబాయ్ నుంచి జపాన్‌కు వెళ్లి అక్కడే ప్రమోషన్స్‌లో సందడి చేస్తాడేమో చూడాలి. ఇక్కడ అయితే ప్రశాంత్ నీల్ ఆల్రెడీ సినిమా షూటింగ్ స్టార్ట్ చేశాడు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. గుంపు, లాఠీ ఛార్జ్, పోలీసుల గొడవ సీన్లను ప్రశాంత్ నీల్ ప్లాన్ చేశాడని ఫోటో ద్వారా అర్థం అవుతోంది. ఇక ఎన్టీఆర్ మాత్రం ఇప్పుడు వార్ 2, నీల్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసుకునే పనిలో పడ్డాడు. ఈ రెండు ప్రాజెక్టుల తరువాత మళ్లీ కొరటాల శివ దేవర 2తో బిజీ అవుతాడని సమాచారం. అంతలోపు ఇతర దర్శకులు కథలు ఏమైనా పట్టుకొస్తే.. కొత్త ప్రాజెక్టుల్ని కూడా ప్రకటిస్తాడేమో చ్చూడాలి. తమిళం నుంచి అయితే వెట్రి మారన్ మన ఎన్టీఆర్‌తో పని చేసేందుకు రెడీగా ఉన్న సంగతి తెలిసిందే.



# మోదీ పిలుపు... రజనీకాంత్, చిరంజీవిని నామినేటెడ్ చేసిన మోహన్‌లాల్



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఊబకాయంపై పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 24, 2025న మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా.. ఊబకాయం సమస్యను ప్రస్తావించి, దీన్ని ఎదుర్కోవడానికి తక్కువ నూనె వాడాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా, మోహన్‌లాల్‌తో సహా 10 మంది ప్రముఖులను ఈ ఉద్యమంలో భాగం కావాల్సిందిగా నామినేట్ చేశారు. అయితే ప్రధాని మోదీ తనను నామినేట్ చేయడంపై తాజాగా స్పందించారు మోహన్ లాల్. ఊబకాయం సమస్యపై పోరాటానికి నాయకత్వం వహిస్తున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. ఇలాంటి ఆలోచనలతోనే ఆరోగ్యకరమైన భారతదేశాన్ని రూపొందించగలం. అధిక నూనె వినియోగాన్ని తగ్గించడం వలన ఊబకాయం నుంచి బయటపడడంతో పాటు సరైన దిశగా ఒక అడుగు ముందుకు వేయవచ్చు. ఈ మిషన్‌లో చేతులు కలిపేందుకు నేనూ 10 మందిని నామినేట్ చేస్తున్నా. అంటూ అగ్ర నటుడు చిరంజీవితో పాటు సూపర్ స్టార్ రజనీకాంత్, దుల్కర్ సల్మాన్, ఉన్ని ముకుందన్, దర్శకుడు ప్రియ దర్శన్, టోవినో థామస్, మేయర్ రవి, మంజు వారియర్, కళ్యాణి ప్రియదర్శన్‌లను నామినేట్ చేశాడు మోహన్ లాల్.

# నేను లింగ వివక్షను ఎదుర్కొన్నా : జ్యోతిక

ప్రముఖ నటి జ్యోతిక గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తెలుగుతో పాటు తమిళం హిందీ సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో మాస్, ఠాగూర్, షాక్ వంటి సినిమాల్లో నటించి సూపర్ హిట్లు అందుకుంది. తమిళ హీరో సూర్యను ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ భామ ఆ తర్వాత చెన్నైకి షిఫ్ట్ అయ్యింది. అయితే దాదాపు 26 ఏండ్ల తర్వాత మళ్లీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది జ్యోతిక. ఇప్పటికే రాజ్ కుమార్ రావు నటించిన శ్రీకాంత్ సినిమాతో పాటు షైతాన్ సినిమాలో హీరోయిన్‌గా నటించి ప్రశంసలు అందుకుంది. ఇక ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కిన తాజా వెబ్ సిరీస్ 'డబ్బా కార్టెల్' ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఫిబ్రవరి 28 నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది జ్యోతిక. తాజాగా ఒక ప్రమోషన్‌లో మాట్లాడుతూ.. తాను కూడా లింగ వివక్షను ఎదుర్కొన్నట్లు తెలిపింది. లింగ వివక్ష అనేది ప్రస్తుతం రోజువారిలో జరిగే ఒక విషయంగా మారిపోయింది. నేను సూర్యను పెళ్లి చేసుకున్నా కూడా సమాజంలో ఇప్పటికి లింగ వివక్షను ఫేస్ చేస్తూనే ఉన్న. నేను ఎప్పుడైన ఇంటర్వ్యూలలో సూర్యని పెళ్ళి చేసుకున్నందుకు అదృష్టవంతురాలిని అని చెబితే.. ప్రజలు సూర్య చాలా మంచి వాడు అంటారు. అదే విషయంలో సూర్య నన్ను పెళ్లి చేసుకుని అతడు సంతోషంగా ఉన్నాడని చెబితే.. సూర్య ఎంత మంచి వాడు భార్య గురించి ఇంతలా ఆలోచిస్తున్నాడు అంటారు. ఇందులో నేను ఎక్కడ కనిపించను. ఎందుకంటే సమాజం అలా చిత్రీకరిస్తుంది. చివరికి వస్తువుల విషయంలో కూడా మేము లింగ వివక్షను ఎదుర్కొంటాం. నేను ఒక కారు లేదా ఇంకా ఏదైన వస్తువు కొన్నప్పటికి దాని ఫీచర్లు చూడాల్సింది వేరొకరు అనే ధోరణి ఉంది. ఎందుకంటే ఆడవా ళ్లు బాగా నిర్ణయాలు తీసుకోలేరు అనే చిన్నచూపు ఉంటుంది. కొన్నిసార్లు అయితే ఇది మా గుర్తింపుకి కూడా సంక్షోభం కలిగించే స్థాయికి చేరుకుంటుందని ఆమె పంచుకుంది.



# నలభై ఏళ్ల కల... నెరవేరింది ఈవేళ...




**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 25**

నలభై ఏళ్ల కల నెరవేరింది ఈవేళ. బెల్లంపల్లి మండలం ప్రసిద్ధ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంకు సరైన దారి లేక, అటవీ శాఖ అడ్డంకులతో రోడ్డు నిర్మాణం పూర్తి కాక ఇబ్బందులు పడుతున్న భక్తుల కల నెరవేరింది. మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి బుగ్గ రోడ్డును ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ముందుగా బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీలోని కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం నూతనంగా నిర్మించిన బుగ్గ బీటి రోడ్డును పరిశీలించారు. నూతన రోడ్డుకు క్షీరాభిషేకం చేసి రోడ్డును ప్రజలకు అంకితం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ.. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజల కోరిక మేరకు ప్రేమతో అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించానని, బెల్లంపల్లి సర్వముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధి అని, ప్రోటోకాల్ ప్రొసీజర్ ప్రకారం అభివృద్ధి చేస్తానని అన్నారు. అటవీ శాఖ అధికారులతో కొట్లాడి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో బీటి రోడ్డు నిర్మాణం చేయించానని అన్నారు. వేమనపల్లి, చెన్నూర్ రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అడ్డంకులు ఉన్నాయని, రోడ్డు నిర్మాణానికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సహకరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో మూడు జూనియర్ కాలేజీలు మంజూరు చేయించానని, వాటికి స్థలాల కేటాయింపు కోసం జిల్లా కలెక్టర్ తో చర్చించానని అన్నారు. అభివృద్ధిలో ముందుకు దూసుకు పోతున్న బెల్లంపల్లిలో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా నరేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి రమాదేవి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల రాకతో కిటకిటలాడుతున్న శ్రీశైలం

- భారీగా తరలి రావడంతో సందడిగా గిరులు



**శ్రీశైలం,ఫిబ్రవరి25( వెలుతురు):**

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీభ్రమరాంబికామల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. భక్తులతో శ్రీశైలం కిటకిటలాడుతోంది. శివనామస్మరణతో ఆలయ పురవీధులు మారుమ్రోగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వారికి వాహనసేవలు వైభవంగా సాగుతున్నాయి. శ్రీశైల పుణ్యక్షేత్రం భక్తులతో రద్దీగా మారింది. శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామిదర్శనం చేసుకోవటానికి నల్లమల అటవీప్రాంతం నుంచి భారీగా భక్తులు తరలి రావడంతో శ్రీగిరులు భక్తులతో కోలాహలంగా మారయి. ఆదిదంపతులైన శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లు కల్యాణశోభతో ముస్తాబయ్యారు. ఆలయ ప్రాంగణంలోని అలంకారమండపంలో స్వామి అమ్మవార్లకు అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చరణ లతో విశేషపూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తజనం నడుమ గ్రామోత్సవానికి తీసుకొచ్చారు. ఉత్సవం ముంగిట మహిళల కోలాటాలు, వేషధారణలు, డోలు విన్యాసాలు, నందికోళ విన్యాసాలు, బుట్టబొమ్మలు వంటి సాంస్కృతిక కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం నుంచి అడుగడుగునా ఉత్సవమూర్తులకు మంగళహారతులు ఇచ్చుకుం టూ పురవీధుల్లోకి తీసుకువచ్చారు. గంగాధరమండపం వద్ద రంగు రంగుల పుష్పాలు, విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేసిన పుష్పపల్లకీలో శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి అర్చకులు మంగళహారతులిచ్చారు.

## పుణ్యస్నానాలకు రాజమండ్రి గోదావరి తీరం సిద్ధం

**రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 25( వెలుతురు):**

మహాశివరాత్రికి రాజమహేంద్రవరం గోదావరి ఘాట్‌ల వద్ద స్నానం ఆచరించేందుకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. .పుష్కరాలరేవు, గౌతమి ఘాట్, వీఐపీ ఘాట్‌లను అధికారులు పరిశీలించారు.అలాగే నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రేవులకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ రేవులోను ప్రజలకు సూచనలు ఇచ్చే పబ్లిక్ అడ్రాసింగ్ సిస్టమ్ ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్పొరే షన్, మెడికల్, ఫిషరీస్, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులతో జాయింట్ కంట్రోల్ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఘాట్‌లో పారిశుధ్యం బాగుండాలని, రేవుల్లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని, భక్తులకు ఎలాంటి అసౌ కర్యం కలుగకుండా జాయింట్ కంట్రోల్ కమిటీ 24గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అధికారుల పర్యవేక్షణ అత్యంత కీలకమని చెప్పారు. మహిళలు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు ఏర్పాటు చేయాలన్నారు.

# కాంగ్రెస్ పొత్తులో భాగంగా సీపీఐ పార్టీకి 2 ఎంఎల్ సి సీట్లు కేటాయించేనా









**వెలుతురు, నల్గొండ జిల్లా, ఫిబ్రవరి 25:**

2023 సంవత్సరం లో నవంబర్ మాసంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సిపిఐ తో పొత్తులను ఖరారులో భాగంగా కొత్తగూడెం మునుగోడు బెల్లంపల్లి స్థానాలను సిపిఐ పార్టీ బలంగా కోరింది దానికి కాంగ్రెస్ అధిష్టానం కొత్తగూడెం స్థానంతో పాటు చెన్నూరు ఎమ్మెల్యే టికెట్లను ఇస్తామని సిపిఐ అధిష్టానానికి హామీ ఇచ్చింది.దానికి సిపిఐ పార్టీ మునుగోడు టిక్కెట్లు బలంగా కోరుకుంది దానికి కాంగ్రెస్ ఒప్పుకోకపోవడంతో నల్లగొండ జిల్లా సిపిఐ పార్టీ అందుకు విరుద్ధంగా బలమైన స్థానాలను కాంగ్రెస్ పార్టీ పొత్తుల వదలకుండా వేరే స్థానాలను ఇవ్వడాన్ని నిరసిస్తూ మునుగోడు స్థానం నుండి పొత్తులో భాగంగాభా మునుగోడు స్థానంలో ఫ్రెండ్లీ కాంటెస్ట్ చేసేందుకు ఈ ప్రాంత నేతలు ఇరు పార్టీల అధిష్టానాలసపై ఒత్తిడి తెచ్చారు .అప్పటికే కాంగ్రెస్ అధిష్టానం ఒక కొత్తగూడెం స్థానంతో ఒక అసెంబ్లీ స్థానాన్ని సిపిఐ కి కేటాయించి రెండు ఎమ్మెల్సీ స్థానాలను సిపిఐ పార్టీకి ఇస్తామని అప్పటి పిసిసి అధ్యక్షులు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాదులోని సిపిఐ కార్యాలయం మగ్దూన్ భవన్ చేరుకొని సిపిఐ పార్టీకి కొత్తగూడెం స్థానంతో పాటు రెండు ఎమ్మెల్సీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయిస్తామనిఖరారుచేసి పొత్తును కూర్చుంది అప్పటి ఒప్పందం ప్రకారం మునుగోడు స్థానం నుండి పోటీకి సిద్ధమైన బీసీ నేత నెల్లికంటి సత్యం ను కాంగ్రెస్ ఇచ్చే ఎమ్మెల్సీ స్థానాన్ని తమకి ఇస్తామని బుజ్జగించింది సిపిఐ పార్టీ నాయకులు బుజ్జగించి చెప్పారు. దానితో నిర్ణయాన్ని కట్టుబడి మునుగోడు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన రాజగోపాల్ రెడ్డి గెలుపు కోసం అదేవిధంగా జిల్లాలోని అన్ని స్థానాల గెలుపు కోసం సిపిఐ నాయకులు నెలికంటి సత్యం తన వంతు పాత్రను పోషించారు. వచ్చేనెల మార్చిలో కాళీ కాపోతున్న ఎమ్మెల్సీ స్థానాలలో సిపిఐ పార్టీకి రెండు ఇచ్చి అప్పటి హామీని భర్తీ చేస్తారని రాష్ట్రంలో భారీగా చర్చ జరుగుతుంది కా సిపిఐ పార్టీకి ఇస్తున్న రెండు ఎమ్మెల్సీలలో ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని బలంగా సిపిఐ పార్టీ ఉన్న నల్లగొండ జిల్లాలో జిల్లా బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీని బలోపేతం చేస్తున్న ఒక బీసీ నేత బీసీ నేత జిల్లాలోబలమైన సామాజిక వర్గం తోపాటు బలంగా బిసి ఓటర్లు కలిగి ఉన్నందున నెలికంటి సత్యానికి ఆ పదవి ఇస్తే ఇరు పార్టీలకు, సామాజిక సామాజికంగా న్యాయం జరుగుతుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.







# బీజేపీదే గెలుపు హవా..

## టీచర్ ఎన్నికల్లో గెలుపు నల్లేరు నడకే...

## పట్టభద్రుల నియోజకవర్గంలో గెలుపు బాటలో అంజిరెడ్డి


మరికొద్ది గంటల్లో కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ రెండు స్థానాల్లో గెలుపు ఎవరిని వరిస్తుందనే దానిపై చర్చోప చర్చలు మొదలయ్యాయి. గెలుపు మాదంటే మాదేనంటూ రాజకీయ పార్టీలు, పోటీ చేస్తున్న అభ్యర్థుల అంచనాలు వేసుకుంటున్నారు. ఇంతకీ గెలుపు అవకాశాలు దక్కేదెవరికి?..

**వెలుతురు, హైదరాబాద్ ఫిబ్రవరి 25:**



- రెండో ప్రాధాన్యత ఓటుతో విజయం తథ్యమని తేల్చిన సర్వేలు
- సర్వేల్లో ఆమడ దూరంలో కాంగ్రెస్ అభ్యర్థి
- అధికార కాంగ్రెస్ కు ఇక మూడినట్లే...
- బీఆర్ఎస్ కు ప్రధాన ప్రతిపక్షంగా నిలదొక్కుకోవడమే కష్టమే





వివిధ సంస్థలు నిర్వహించిన సర్వే నివేదికలు, ఇంటెలిజెన్స్ వర్గాలకు అందుతున్న సమాచారం మేరకు బీజేపీ బలపర్చిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపు ఖాయమైనట్లే. ఆయన గెలుపు నల్లేరుపై నడకేనని తేల్చేశాయి. దీంతో రాజకీయ పార్టీల, ప్రజల, పట్టభద్రుల, టీచర్ల, మీడియా దృష్టి అంతా ఇప్పుడు పట్టభద్రుల నియోజకవర్గంలో ఎవరు గెలవబోతున్నారనే దానిపైనే ఊహాగానాలు, విశ్లేషణలు చేస్తున్నాయి. తమకు అందుతున్న సమాచారం ఆధారంగా ఫలానా పార్టీ గెలవబోతుందని భావిస్తున్నాయి.

కానీ ఈ స్థానంలో గెలుపు ఎవరిదనే అంశంపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలు ముఖ్యమంత్రికి, కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు కేంద్ర మంత్రులకు సమాచారం అందించాయి. ఈ సమాచారం ప్రకారం... గెలుపు బాటలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి అందరికంటే ముందున్నారని తేలింది. బీజేపీ అభ్యర్థికి 37 నుండి 40 శాతం ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరిక్రిష్ణకు 32 నుండి 34 శాతం ఓట్లు వచ్చే అవకాశాలున్నట్లు తెలిసింది. ఆశ్చర్యపోయే విషయమేమిటంటే అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి 23 నుండి 25 శాతం ఓట్లకే పరిమితమయ్యే అవకాశముందని తేల్చేశాయి. దీంతో ఖంగుతిన్న కాంగ్రెస్ అభ్యర్థి ఓటుకు రూ.5 వేల నుండి 7 వేల వరకు పంపిణీ చేసి ఎట్లాగ్కైనా గెలవాలనే కసితో రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

అట్లాగే వివిధ సర్వే సంస్థల నివేదికల్లోనూ బీజేపీ, బీఎస్పీ అభ్యర్థికి మధ్య 4 నుండి 7 శాతం ఓట్ల తేడా ఉందని, బీజేపీకే గెలుపు అవకాశాలున్నాయని అంచనా వేశాయి. ఈ సర్వేల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి మూడో స్థానానికే పరిమితం కావడం గమనార్హం. విశేషమేమిటంటే మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఏ పార్టీ అభ్యర్థి కూడా గెలిచే అవకాశాలు లేవని ఆయా సర్వే సంస్థలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండో ప్రాధాన్యత ఓటు కీలకంగా మారింది. అయితే ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరిక్రిష్ణకు తొలి ఓటేసిన వారిలో అత్యధికంగా బీజేపీ అభ్యర్థికే రెండో ప్రాధాన్యత ఓటేయాలని భావిస్తున్నట్లు సర్వే సంస్థలు తేల్చడంతో బీజేపీ గెలుపు ఖాయమని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి చివరి రెండ్రోజులు అప్రమత్తంగా ఉంటూ ఆర్థిక వనరులను ఖర్చు చేయగలిగితే గెలుపు సునాయాసమవుతుందని ప్రత్యర్థి పార్టీల నేతలే మాట్లాడుకోవడం గమనార్హం.

మరోవైపు ఈ రెండు స్థానాల్లో బీజేపీ గెలిస్తే కాంగ్రెస్ కు మూడినట్లేనని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోతే సొంత పార్టీలోనే లుకలుకలు మొదలవుతాయని, సీఎంపై అసమ్మతి ఎక్కువై సీటుకే ఎసరొచ్చే ప్రమాదమూ లేకపోలేదని కాంగ్రెస్ నేతలే గుసగుసలాడుతున్నాయి. అదే సమయంలో బీఆర్ఎస్ ఉనికి మరింత కష్టమవుతుందని, ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని బీజేపీ భర్తీ చేస్తూ పోరాటాలతో కాంగ్రెస్ ను మరింత ఇరకాటంలోకి నెట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com